తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

అక్టోబరు 2020 వెల రూ.5/-

16-10-2020
శుక్రవారం
రాత్రి:
పెద్దశేషవాహనం



## తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవం

2020 అక్టోబరు 16 నుండి 24 వరకు

తిరుమల తిరుపతి దేవస్థానములు

## తిరుమల శ్రీవారి ఆలయప్రాంగణంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలలో జరిగిన వివిధ వాహనసేవల దృశ్యమాలిక







ధ్వజారోహణం, పెద్దశేషవాహనసేవలో పాల్గొన్న తి.తి.దే. ఉన్నతాధికారులు



తిరుమలకు చేరిన శ్రీవిల్లిపుత్తూరు గోదాపుష్పమాలలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు
శ్రీవారి గరుడసేవలో పాల్గొన్న దృశ్యం



ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు
శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం



తిరుమలలో జరిగిన 'సుందరకాండ పారాయణం'లో
ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రముఖ్యమంత్రులు గౌ॥ శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు,
గౌ॥ శ్రీ బి.ఎస్.యడియూరప్పగారలు పాల్గొన్న దృశ్యం



ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారికి
తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డిగారు
శ్రీవారి ప్రసాదం అందిస్తున్న దృశ్యం



ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రముఖ్యమంత్రివర్యులు గౌ॥ శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు,
కర్ణాటక రాష్ట్రముఖ్యమంత్రి గౌ॥ శ్రీ బి.ఎస్.యడియూరప్పగారికి
శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం



## గీతాశ్లోకార్థసారం

**శ్లో : పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।**
**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-15వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** హృషీకేశః= శ్రీకృష్ణుడు; పాంచజన్యమ్= 'పాంచజన్య'మను పేరుగల శంఖమును (పూరించెను); ధనంజయః= అర్జునుడు; దేవదత్తమ్='దేవదత్త' మను పేరుగల శంఖమును(పూరించెను); భీమకర్మాః= భయంకర కృత్యములను చేయునట్టి; వృకోదరః= భీమసేనుడు; పౌండ్రమ్= 'పౌండ్ర'మను పేరుగల; మహాశంఖమ్= మహాశంఖమును; దధ్మౌ= పూరించెను.

**భావం:** శ్రీకృష్ణుడు 'పాంచజన్యము'ను; అర్జునుడు 'దేవదత్త'మను శంఖమును పూరించిరి. అరివీరభయంకరుడైన భీముడు 'పౌండ్ర'మను మహాశంఖమును పూరించెను.

## ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనములెక్క

ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనములెక్క
గట్టిగా నిందుకే హరి కడుమెచ్చేమయ్యా

గరుడునిమీఁద నెక్కి గమనించితివి నాఁడు
అరుదైన పారిజాతహరణానకు
గరిమతో రథమెక్కి కదలితి వల్లనాఁడు
సారిది బ్రాహ్మణపడుచుల నుద్ధరించను


చక్కఁగాఁ గుబేరుని పుష్పక మెక్కి కదలితి
మక్కువ సీతాదేవి మరలించను

తక్కక వాయుజ నెక్కి దాడివెట్టితివి నాఁడు
చొక్కపువానరులపొఁజులు చూడను

కొట్టఁగొన నీవు రాతిగుఱ్ఱము నెక్కి తోలితి-
పట్టియెడ నధర్మము నడఁచఁగను
మెట్టుక శ్రీవేంకటాద్రిమీఁదఁ బల్లకి యెక్కితి-
విట్టెయిందిరఁ గూడి యేఁగుఁబెండ్లి యేఁగను

(అన్నమాచార్య సంకీర్తన-20-105)

అన్నమయ్య బ్రహ్మాండనాయకుని వాహన విశేషాలను వర్ణిస్తున్నాడు ఈ కీర్తనలో- "అలనాడు శ్రీకృష్ణుడవై స్వర్గమునుండి పారిజాతము దెచ్చుటకై గరుడవాహనారూఢుడవై పయనించితివి. మరి యొకప్పుడు గురువగు సాందీపని కుమారుల దెచ్చుటకై రథమెక్కి హుందాగా ప్రయాణమైతివి. ఇంకొకపరి (రామావతారంలో) కుబేరునియొక్క పుష్పక విమానము నెక్కి ప్రీతితో సీతతో నయోధ్యకు తిరిగి వచ్చితివి. వాయువేగముగల వాయుపుత్రుడు హనుమనెక్కి మిక్కిలి శౌర్యముతో లంకపైకి దాడి వెడలితివి. కడపట కల్క్యవతారమున రాతి గుఱ్ఱము దౌడుదీయించి అధర్మము నణగార్చితివి. పెండ్లి యూరేగింపులో పద్మావతీసమేతుడవై పూల పల్లకినెక్కి అందముగా వేంకటాచలముపై ఊరేగితివి. ఔరా! ఇన్ని వాహనము లెక్కుట ఎట్లు నేర్పితివి? ఈ నీ సాహసమును మిగుల మెచ్చుచున్నాము."





# సరస్వతి నమామ్యహం

-డా॥ఎ. సచ్చిదానందమూర్తి

సర్వశక్తిసంపన్న అయిన జగదంబను 'వాక్– బుద్ధి– జ్ఞాన' స్వరూపిణిగా భావిస్తే ఆ దివ్యాకృతియే 'సరస్వతీదేవి'.

'దేవీభాగవతం' వంటి శక్తి గ్రంథాలు సరస్వతీ పూజను ప్రశస్తంగా చాటి చెబుతున్నాయి. ఆశ్వయుజ మాసంలో వచ్చే నవరాత్రి ఉత్సవాలలో సరస్వతీపూజ, దుర్గాపూజ, విజయదశమి ఎంతో ప్రత్యేకతను సంతరించుకొని ఉన్నాయి. సరస్వతిని, దుర్గాదేవిని మరియు విజయదశమి రోజులను ఆరాధిస్తే సర్వదేవతలను పూజించినట్లుగా భక్తులు భావిస్తారు.

ప్రత్యేకంగా సరస్వతీదేవి గురించి చెప్పాలంటే.. గణపతిని పూజించి, తరువాత సరస్వతీ దేవి ప్రతిమను, పుస్తకాలను, లేఖినిని (పెన్సిల్, పెన్) ఆరాధించాలి.

షోడశోపచారాలతో సరస్వతిని పూజించాలి.

తల్లిని తెల్లని కుసుమాలతో, సుగంధ ద్రవ్యాలను రంగరించిన చందనంతో, తెల్లటివస్త్రాలతో అర్చించాలి.

బ్రహ్మదేవుడు పరాశక్తిని శారదారూపంలో దర్శించి, ఆరాధించి, ఆమె దయచేత సృష్టిని రచించగలిగే సృజనాత్మకతను పొందాడంటారు. అటుపై దేవతలందరూ ఈ మహాశక్తిని ఆరాధించారు.

యాజ్ఞవల్క్యుడు గురుశాపం వలన విద్యలను కోల్పోయి, సూర్యుని ఆరాధించగా, ఆ ఆదిత్య భగవానుడు సరస్వతీ ఉపాసనను ఉపదేశించాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు ఆ అమ్మ కృపవలన తిరిగి స్మృతిశక్తిని సంపాదించుకొని విద్వాంసుడయ్యాడని పురాణ వచనం.

**ప్రతిభ, మేధ, శ్రద్ధ, స్ఫురణ, సాహిత్య సంగీతాది కళానైపుణ్యం....** శారదా స్వరూపాలు.

వాల్మీకి సరస్వతీ ఉపాసన వలన మహాకావ్యరచన చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి.

శారదాదీక్షను స్వీకరించిన వ్యాసదేవుడు వేదవిభజన చేసి, పురాణ విద్యను ఆవిష్కరించి, మహాభారత, భాగవత, బ్రహ్మసూత్రాది రచనలను గావించి భారతీయ సంస్కృతికీ, సనాతన ధర్మానికీ ఆచార్యుడయ్యాడు.

లౌకికమైన అపరవిద్యలకు, పారమార్థికమైన బ్రహ్మవిద్యకు అధిష్ఠానదేవత సరస్వతి. భ్రమ, మాంద్యం, మతిమరపు, మాటలో తడబడుట.... మొదలైన జాడ్యాలను సమూలంగా నశింపజేస్తుంది కనుక **"నిశ్శేష జాడ్యాపహా...."** అని ఈ విద్యాదేవిని పేర్కొన్నారు.

వేదాల్లో సరస్వతీ సూక్తాలున్నాయి. ప్రాణశక్తిగా, జ్ఞానశక్తిగా ఉపాసించే సరస్వతిని **అంబితమే, నదీతమే, దేవితమే, సరస్వతి** అని శ్రుతి కీర్తించింది.

అమ్మల్లో శ్రేష్ఠురాలు, నదుల్లో గొప్పది, దేవతల్లో ఉన్నతురాలు సరస్వతి.

**"యా బ్రహ్మాచ్యుత శంకరః ప్రభృతిభిః దేవైః సదా పూజితా"** అని సర్వదేవతార్చితగా పలుకుల తల్లిని ప్రస్తుతిస్తారు.

ఆదిశంకరులు అపారమైన వాఙ్మయాన్ని, తత్త్వవిజ్ఞానాన్ని ఈ తల్లి కృపచేతనే పొందినట్లు పేర్కొనడమేకాక, శారదానుగ్రహం వలననే మన మందరం సమగ్రజ్ఞానంతో, సద్బుద్ధితో ఎదగగలమని చాటుతూ – నాలుగు ఆమ్నాయ పీఠాలలో ఒకటైన పావన శృంగగిరి (శృంగేరీ) క్షేత్రంలో శారదామాతను ప్రతిష్ఠించారు.

గాయత్రిగా, సావిత్రిగా, పరాశక్తిగా శ్రుతులు పేర్కొన్న సర్వచైతన్య రూపిణి శారద అందరినీ అనుగ్రహించాలి.



'మనస్సు' చంచలమైనది - దానిని నిగ్రహించాలి



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


50 వసంతాల 1970-2020

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 అక్టోబరు, 2020 సంచిక : 05


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| సరస్వతి నమామ్యహం | డా॥ ఎ.సచ్చిదానందమూర్తి | 04 |
| బ్రహ్మాండనాయకుని నవరాత్రి బ్రహ్మోత్సవాలు | కీ.శే. డా॥ కె.వి.రాఘవాచార్య | 07 |
| పావనములకెల్ల పావనమయమూ... | 'వాచస్పతి' బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 11 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 13 |
| భావన | శ్రీమతి జి. సత్యవతి | 15 |
| దుర్గోపాసన | శ్రీ కాశీభట్ల సుబ్బరామ శర్మ | 16 |
| అంతరంగశత్రువులు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 20 |
| శ్రీవారి సేవలో 'తిరుమలనంబి' | శ్రీ వేమరాజు అనంత పద్మనాభం | 21 |
| ఆళ్వార్ తిరువడిగలే శరణమ్ | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 23 |
| ఆచార్యశేఖరులు మణవాళమహామునులు | డా॥ ఈ.ఎ.శింగరాచార్యులు | 25 |
| శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, తిరుచానూరు | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 51 |
| భక్తప్రహ్లాదుని దివ్య మహిమలు | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 55 |
| శ్రీవేదాంతదేశికులు - న్యాసదశకమ్ | శ్రీఆచార్య చక్రవర్తిరంగనాథన్ | 57 |
| పురాణాలు ధర్మమార్గ దర్శనములు | శ్రీ పాలకుర్తి రామమూర్తి | 59 |
| 'తీర్థం' దాని పరమార్థం | శ్రీ యం.జి.రామచంద్రన్ | 61 |
| ముడుపు తీర్చుకున్న స్వామి | శ్రీమతి సుజాతా శేఖర్ | 62 |
| విష్వక్సేనం తమాశ్రయే | డా॥ తిరుమల శ్రీతేజాచార్యులు | 63 |
| స్వయంప్రభ | ఆచార్య కె.మలయవాసిని | 65 |
| అత్యాశ | మాస్టర్ జె.వి.ఎస్.ఇంద్రనీల్ | 67 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 68 |
| వ్యాధులను నిర్మూలించే 'చిత్రమూలం' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 69 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 71 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 72 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 74 |


ముఖచిత్రం : పెద్దశేషవాహనం పై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు
వెనుక చిత్రం : హంసవాహనంపై వీణాపాణిగా శ్రీమలయప్పస్వామివారు


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

## సంపాదకీయం

# "నవోన్మేషమైన శరన్నవరాత్రులు - నవరాత్రి బ్రహ్మోత్సవం"

శరత్కాలం తేటదనానికి సంకేతం. శరచ్చంద్రుడు, శరత్పూర్ణిమ వంటి మాటలు ప్రాచీనశాస్త్రాల్లో, కావ్యాల్లో కూడా కన్పిస్తాయి. నిర్మలాకాశం, నిండుచంద్రుడు శరత్తులో గోచరించే అద్భుతాలు. అటువంటి తేటదనపు స్వచ్ఛమైన మనస్సే దుర్గాదేవికి ప్రీతి కలిగించే శరత్తు. జగద్రక్షణ చేయగలిగే సామర్థ్యం, అందుకు తగిన ప్రేమ– దయ కల్గిన తల్లిని 'సౌందర్యలహరి'గా స్తుతించారు.

ధర్మానికి, లోకక్షేమానికి విఘాతాన్ని కల్గించే ఆసురీశక్తుల్ని రూపుమాపడానికి దేవతాశక్తులు ప్రార్థించితే, 'శక్తి' ఆవిర్భవించి, రాక్షససంహారం చేసిన గాథలను పురాణాలు పలువిధాలుగా వర్ణించాయి. వ్యక్తికి – సమాజానికి ప్రధానమైన మూడు ఆవశ్యకాలు– 'జ్ఞానం, ఐశ్వర్యం, శక్తి'. ఈ మూడు స్వరూపాల సమాహారమే 'జగన్మాత'. జ్ఞానాన్ని– 'సరస్వతిగా', ఐశ్వర్యాన్ని– 'లక్ష్మిగా', శక్తిని– 'భవానిగా' ఉపాసించి, మూడింటి ఏకస్వరూపాన్ని 'దుర్గ'గా ఆరాధించడం మన సనాతన సంప్రదాయం. అందుకే–"ప్రణోదేవీ సరస్వతి.... దుర్గాం దేవీం శరణమహం ప్రపద్యే.... దేవీం వాచమజనయంత దేవాః" ఇత్యాది మంత్రాలు దుర్గామాతను దేవీ నామంతో కీర్తించాయి. ఒక దేవియే, ఎన్నో విధాలుగా ఆరాధింపబడుతుంది. ఈ దేవీనామాలు, రూపాలు తత్త్వసంకేతాలు. ఒక్కొక్కపేరులో అనంతమైన అర్థాలు ఇమిడి ఉండటంచేత, ఆ నామాలు మంత్రాలుగా జపించబడుతున్నాయి. ముఖ్యంగా శరన్నవరాత్రుల్లో దేవీపరాక్రమ స్వరూపాన్ని సంభావిస్తారు. మహిషాసురాది దుష్టశక్తుల్ని రూపుమాపిన దుర్గగా అమ్మను ఆరాధిస్తారు.

తేటమనసుతో 'అమ్మా' అంటూ పిలిచి, పూజించే నవరాత్రుల వేడుకతో దేశమంతా పునీతమవుతుంది. దుర్గ నామమే ఒక మహామంత్రం. ధర్మానికి అమ్మయే ఆధారం. ధర్మబద్ధమైన జీవితాన్ని గడిపే వారికి ఆధారమై, అమ్మ ఆదుకుంటుంది. దేవీనామాలన్నీ మంత్రాలే. శక్తి కలిగిన శబ్దమే మంత్రం. శక్తి ఐశ్వర్యానికి, పరాక్రమానికి ప్రతీక. అంతుపట్టని తత్త్వంగల దుర్గాదేవి, దురాచారాలను నశింపజేస్తుంది.

అటువంటి ఆసురీశక్తులను రూపుమాపి, క్షేమకరమైన సాత్త్వికశక్తుల్ని పరిరక్షించి, అందరికి శాంతిని ప్రసాదించాలని, అమ్మలగన్న అమ్మ దుర్గాదేవిని వేడుకొందాం.

ఇక శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు కూడా నవరాత్రులలోనే వైభవంగా జరుగుతాయి. తిరుమల క్షేత్రంలో ఎప్పుడూ నిత్యకల్యాణం పచ్చతోరణమే. ఈ సంవత్సరంలో అధికమాసం వచ్చినందువల్ల వార్షిక బ్రహ్మోత్సవంతో పాటు 'నవరాత్రి బ్రహ్మోత్సవాలు' కూడ వచ్చాయి. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవంలో శ్రీస్వామివారు సర్వాలంకార భూషితుడై, దేవేరులతో వివిధవాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇస్తారు. భక్తులు మౌనంగా మనసులోనే ప్రార్థిస్తారు. మనోనేత్రంతో స్వామిని సందర్శిస్తారు.

శ్రీనివాస ప్రభువు కోరినవారికి 'కల్పతరువు', మనోరథ సిద్ధి ప్రసాదించే దైవం. తన్మయించి స్తుతించే వారికి ఆనందరూపం. అటువంటి స్వామి వారి హృదయంలో 'వ్యూహలక్ష్మి' పేరుతో మహాలక్ష్మి వెలసివుంది. అందుకే ఆయన శ్రీనివాసుడయ్యాడు. కాబట్టి తిరుమలలో స్వామివారికి ఏ అర్చన జరిగినా, ఆ వెనువెంటనే హృదయలక్ష్మికి అర్చన జరుగుతుంది. ఇది తిరుమలక్షేత్రంలో ఉన్న సంప్రదాయం. శరన్నవరాత్రులలో స్వామివారు అమ్మవారు అభిన్నులై ఒక్కరుగా నిల్చిఉన్న వేంకటాచలక్షేత్రంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలను దర్శిస్తే అటు స్వామివారిని, ఇటు అమ్మవారిని అర్చించిన ఫలాన్ని పొందగల్గుతాం. క్షేత్రపవిత్రతకు ఏ మాత్రం భంగం కలగని రీతిలో త్రికరణశుద్ధిగా ఈ క్షేత్రసంప్రదాయాలు పాటిద్దాం. పరంధామునికి జరిగే బ్రహ్మోత్సవాలలో పవిత్రంగా పాలుపంచుకుందాం. నిత్య కల్యాణచక్రవర్తి అయిన 'సప్తగిరీశుని' సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులమవుదాం.

*'శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే'*

# బ్రహ్మాండ నాయకుని నవరాత్రి బ్రహ్మోత్సవాలు

– కీ.శే. డా॥ కె.వి.రాఘవాచార్య

**అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతి మూడుసంవత్సరాలకు ఒకసారి అధిక మాసం రావడం వల్ల రెండుబ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఒకటి వార్షిక(సాలకట్ల) బ్రహ్మోత్సవాలు - రెండు నవరాత్రి బ్రహ్మోత్సవాలు. ఈ రెండవ నవరాత్రి బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణ, ధ్వజావరోహణములు ఉండవు. ఈ ఉత్సవాలకు అష్టదిక్పాలకులు, దేవతలు ఆహ్వానించబడరు. కానీ, వాహనఉత్సవాలు మొదటి బ్రహ్మోత్సవం వలె యథాక్రమంగా జరుగుతాయి. అయితే, మొదటి బ్రహ్మోత్సవంలో కొయ్యతేరు (రథం)ను, రెండవ బ్రహ్మోత్సవంలో బంగారురథాన్ని ఉపయోగిస్తారు.**

**బ్రహ్మోత్సవాలలో జరిగే వాహనసేవలలో శ్రీదేవి భూదేవి సమేతుడైన మలయప్పస్వామి పెద్దశేష వాహనం, ముత్యపుపందిరివాహనం, కల్పవృక్షవాహనం, సర్వభూపాలవాహనం, సువర్ణరథము, బంగారు తిరుచ్చి (పల్లకి) వాహనాలలో వేడుకగా తిరుమల మాడవీథులలో ఊరేగుతాడు.**

**మలయప్పస్వామి ఒక్కడే చిన్నశేషవాహనం, హంసవాహనం, సింహవాహనం, మోహినీఅవతారం పల్లకి, గరుడ వాహనం, హనుమంత వాహనం, గజవాహనం, సూర్యప్రభ, చంద్రప్రభ, అశ్వవాహనం పై తిరుమల మాడవీథులలో ఊరేగుతాడు.**

## పెద్దశేషవాహనం

నవరాత్రి బ్రహ్మోత్సవాలలో శ్రీవేంకటేశ్వరస్వామి అధిరోహించే ఒక్కొక్క వాహనానికి ఒక్కో చరిత్ర ఉంది. ఐతిహ్యం ఉంది. అంతేగాక శ్రీవారు ఒక్కో వాహనంపై ఊరేగుతూ భక్తజనులకు ఒక్కో సందేశం ఇస్తుంటారు. తిరుచ్చిఉత్సవం (వేంకటేశ్వరస్వామి ఉత్సవవిగ్రహం) ఏడుపడగల బంగారు పెద్దశేషవాహనంపై ఉత్సవం జరుగుతుంది. విశిష్టాద్వైత సంప్రదాయానుసారంగా భగవంతుడు 'శేషి' ఇతరములు 'శేషభూతం'. స్వామి శేషవాహనంపై ఊరేగడం ద్వారా భక్తులకు ఈ శేషశేషి భావాన్ని బోధిస్తున్నాడు.



## చిన్నశేషవాహనం

శేషాద్రి నిలయుడైన వేంకటేశ్వరస్వామి ఒక్కరే రెండవరోజు పగటి ఉత్సవంలో అయిదు పడగల చిన్నశేషవాహనంపై ఊరేగుతాడు. ఆదిశేషుడు శ్రీనివాసునకు నివాసము, శయ్య, ఆసనము, పాదుక, ఉత్తరీయం, తలగడ, ఎండవానలనుండి రక్షించే ఛత్రము, పదపీఠం, సేవకుడు, శరీరభేదం కలిగి విష్ణుదేవునికి శేషత్వ పాత్రుడైనాడు.



అందువల్లనే బ్రహ్మోత్సవాలలో రెండవసారి కూడ శేషుడు వాహనమైనాడు. ఈ వాహనంపై స్వామి మురళీ మనోహరుడుగా భక్తులకు కనువిందు చేస్తాడు.

## హంసవాహనం

రెండవరోజు రాత్రి బంగారు హంసవాహనంపై వేంకటేశ్వరస్వామి ఒక్కడే వీణా పాణియై, చదువుల తల్లి సరస్వతిరూపంలో కనిపిస్తూ, భక్తజనులకు కనువిందు చేస్తూ, మాడవీథులలో ఊరేగుతాడు. హంస పాలు, నీరు వేరు చేసినట్లే, గుణావగుణ విచక్షణా జ్ఞానానికి సంకేతం. హంస మానస సరోవరంలో విహరిస్తుంది. పరమాత్మ అనన్య భక్తుల మనస్సులనెడి సరస్సులలో విహరిస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామి హంస వాహనారూఢుడై వాగ్దేవత సరస్వతి రూపంలో ఆత్మా నాత్మ తత్త్వాన్ని భక్తులకు బోధిస్తున్నాడు.

## సింహవాహనం

మూడవరోజు పగలు మలయప్పస్వామి ఒక్కడే సింహవాహనంపై ఊరేగుతాడు. సింహం మృగరాజు. విష్ణువు సింహముఖుడై, దుష్టుడైన హిరణ్యకశిపుని సంహ రించినాడు. భక్తుడైన ప్రహ్లాదుని రక్షించినాడు. యోగ శాస్త్రంలో సింహం వహన శక్తికి, గమన శక్తికి ప్రతీక. బ్రహ్మోత్సవాలలో శ్రీవేంకటేశ్వరస్వామి సింహవాహనుడై ఊరేగడం దుష్టజన సంహారానికి, భక్తజన రక్షణకు సంకేతం.

## ముత్యపుపందిరివాహనం

మూడవరోజు రాత్రి ముత్యపుపందిరివాహనంపై శ్రీదేవి భూదేవులతో కూడ మలయప్పస్వామి తిరు మాడవీథులలో ఊరేగుతాడు. ముత్యాలు చల్లదనాన్ని కలిగి స్తాయి. వేంకటేశ్వరుడు "మౌక్తికస్రగ్వి" (ముత్యాలమాలను ధరించినాడు) అని నిత్యమూ ప్రస్తుతింపబడుచున్నాడు. మంచిముత్యాలతో తయారు చేయబడిన ముత్యపుపందిరిని వాహనంగా చేసుకొని మలయప్ప స్వామి ఉభయదేవేరులతో విహరిస్తూ, భక్తులకు కనువిందు చేస్తాడు.

## కల్పవృక్ష వాహనం

నాల్గవనాడు పగలు శ్రీదేవి-భూదేవి సహితుడై వేంకటేశ్వరస్వామి కల్పవృక్షవాహనంపై విహరిస్తూ, భక్తులను అలరిస్తాడు. కోరినవారి కోరికలను తీర్చునట్టి కల్పవృక్షము పాలసముద్రము నుండి పుట్టినది. కల్పవృక్షం ఐహిక సుఖాలను మాత్రమే ప్రసాదిస్తుంది. కల్పవృక్ష వాహనారూఢు డైన వేంకటేశ్వరుడు ఐహిక, ఆముష్మిక సుఖములను ప్రసాది స్తాడు. వేంకటేశ్వరస్వామి కల్పవృక్షవాహనంపై గోవులను కాపాడుచున్న గోపాలుని రూపంలో కనువిందు చేస్తాడు. ఈ కలియుగంలో ఆశ్రితకల్పవృక్షమైన స్వామి, భక్తజనుల ముందే కల్పవృక్షవాహనుడై ఊరేగుతూ భక్తుల కోరికలను తీరుస్తుంటాడు. భక్తుల పాలిట కల్పవృక్షమే వేంకటేశ్వరుడు.

## సర్వభూపాల వాహనం

నవరాత్రిబ్రహ్మోత్సవాలలో నాల్గవనాటి రాత్రి మల యప్ప స్వామి శ్రీదేవి- భూదేవులతో కూడి సర్వభూపాల వాహనంపై విహరిస్తాడు. రాజులు ప్రజలకు రక్షకులు, పాలకులు. శ్రీవేంకటేశ్వరస్వామి ప్రజలకు, రాజులకు కూడ రక్షకుడు. సర్వభూపాలురకు అధిపతి. కనుక నేడు సర్వభూపాలురు స్వామికి వాహనంగా ఉండి, సేవిస్తున్నారు. వేంకటేశ్వరుడు సర్వభూపాల వాహనంలో కాళీయమర్దనం చేస్తూ దుష్టుని శిక్షిస్తున్న కృష్ణుని రూపంలో కనిపిస్తాడు.

## మోహినీ అవతారం

అయిదవనాటి పగలు వేంకటాచలపతి మోహినీ రూపం ధరించి రాక్షసులను మోహింపజేసిన జగన్మోహినిగా బంగారు పల్లకిలో భక్తులకు కనిపిస్తాడు. శ్రీకృష్ణుడు దంతపు పల్లకిపై వెంబడే వస్తుంటాడు. మలయప్పస్వామి మోహిని అలంకారంలో నిల్చున్న భంగిమలో కాకుండా కూర్చున్న భంగిమలో కనిపిస్తాడు. స్త్రీలు ధరించే అన్ని ఆభరణాలతో స్వామి అలంకరింపబడతాడు. స్వామివారికి పట్టుచీర, కిరీటంపైన రత్నఖచితమైన సూర్య చంద్ర సావేరిని అలం కరిస్తారు. స్వామివారి ముక్కుకు వజ్రపు ముక్కుపుడక, బులాకిని అలంకరిస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామి మోహినీ అవతారంలో బలగర్వితులు, అహంకారులు కార్యప్రయో జనాన్ని పొందలేరని, వినయవిధేయతలతో భగవంతుని ఆశ్రయించిన వారే కృషి ఫలితాన్ని పొందగలరని హితము ఉపదేశిస్తున్నాడు.

## గరుడసేవ

తిరుమలలో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలలో అయిదవనాటి రాత్రి జరిగే గరుడోత్సవం ప్రథమగణ్య మైనది. గరుత్మంతుడు వేదస్వరూపుడు. విష్ణు గరుడ సమ్మే

శనం వేదస్వరూప, శీర్షాలుగా వ్యక్తమవుతుంది. తొమ్మిదిరోజుల శ్రీవేంక టేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజు రాత్రి జరిగే గరుడవాహన ఉత్సవంలో మలయప్పస్వామిని మూలవిరాట్టుకు నిత్యం అలంకరించి యుండే మకరకంఠి, లక్ష్మీహారం, వేంకటేశసహస్రనామ మాల మొదలగు విశిష్టాభరణములతో అలంకరిస్తారు. కనుక గరుడసేవలో ధ్రువమూర్తి వేంకటేశ్వరస్వామికి, ఉత్సవమూర్తి మలయప్పస్వామికి భేదము లేదన్నది సంప్రదాయం.

## హనుమద్వాహనం

నవరాత్రిబ్రహ్మోత్సవాలలో ఆరవనాటి పగలు వేంకటేశ్వరస్వామి ఒక్కడే హనుమంతుని వాహనంగా చేసికొని ఊరేగుతూ, 'లోకహితము కోసమే నేను త్రేతాయుగంలో శ్రీరామునిగా, కలియుగంలో వేంకటేశునిగా అవతరించాను. ఆ విషయాన్ని జ్ఞాపకం చేయడం కోసమే నేడు అనన్యభక్తుడైన హనుమంతుని అధిరోహించి మీకు వేంకటాద్రి రామునిగా కనిపిస్తున్నాను' అని భక్తులకు దర్శనమిస్తాడు. హనుమంతుడు దాస్యభక్తికి ప్రతీక, ఆదర్శము.

## పుష్పక విమానము (పుష్పక వాహనం)

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆరవనాటి సాయంకాలం జరుపబడే పుష్పకవిమాన సేవ అత్యంత ప్రాధాన్యమైనది. రకరకాలైన పుష్పాలతో కళ్లకు కనువిందుగా కనిపిస్తుంది పుష్పకవిమానం. కొండలోని పువ్వులన్నీ శ్రీవేంకటేశ్వరునికే అన్నట్లుగా మల్లెలు, మొల్లలు, జాజులు మొదలైన అనేక పరిమళాలు వెదజల్లే పువ్వులతో పుష్పకవిమానం అలంకరింపబడుతుంది. శ్రీనివాసునికి తులసి అంటే మహాప్రీతి అందువల్ల పుష్పక విమానంలోపలి భాగంలో తులసీ మాలను విరివిగా వాడుతారు.

## గజవాహనం

ఆరవనాటి రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి ఒక్కడే గజరాజుపై ఊరేగుతూ భాగవతంలోని గజేంద్రమోక్షం వృత్తాంతాన్ని స్మరింపజేసాడు. 'సంసారం ఒక సరస్సు. మొసలి కర్మ. గజేంద్రుడు జీవుడు. సంసార కర్మల నుండి విముక్తిని ప్రసాదించేవాడు విష్ణుదేవుడు. ప్రతి భక్తుడు ఒక గజేంద్రుడు. సంసార బంధం నుండి, కర్మ బంధం నుండి విముక్తిని ప్రసాదించేవాడు వేంకటేశ్వరస్వామియే' అని తెలపడమే గజవాహన పరమార్థం.

## సూర్యప్రభ వాహనము

నవరాత్రిబ్రహ్మోత్సవాలలో ఏడవరోజు పగలు సప్తాశ్వరథారూఢుడైన సూర్యప్రభవాహనంపై సప్తగిరీశ్వరుడు వేంకటేశ్వరుడు ఒక్కడే వజ్రకవచం ధరించి ఉదయ సూర్యకిరణాలు ప్రసరించుచుండగా, తిరుమల మాడవీథులలో ఊరేగుతూ, సూర్యమండలం మధ్యనున్న నారాయణమూర్తిని



నేనే అని బోధిస్తున్నాడు. "జ్యోతిషాం రవి రంశుమాన్" 'జ్యోతి స్వరూపాలలో సూర్యుడను నేను' అని భగవంతుని మాట. భగవంతుని స్వరూపమే తేజస్సు. అది సూర్య భగవానునిలో ప్రముఖంగా ఉంది.

ప్రపంచానికి వెలుగు ప్రసాదించే సూర్యనారాయణు డను నేనే అని వేంకటేశ్వరస్వామి సూర్యప్రభవాహనంపై భక్తజనులకు దర్శన భాగ్యం కలిగించి, ఆరోగ్య ఐశ్వర్యాలను అనుగ్రహిస్తాడు.

## చంద్రప్రభ వాహనము

ఏడవనాటి రాత్రి వేంకటేశ్వరుడు చల్లని వాతా వరణంలో చంద్రప్రభవాహనంపై విహరిస్తాడు. చంద్రుడు నిశాకరుడు. సూర్యకాంతితోనే చంద్రుడు ప్రకాశిస్తాడు. కనుక పగలు సూర్యప్రభవాహనం జరిగిన తర్వాత చంద్రప్రభ వాహనం రాత్రిపూట జరుగుతున్నది.

## స్వర్ణరథోత్సవం


శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో అత్యంత వైభవమైనది, భక్తజనాకర్షకమైనది స్వర్ణరథోత్సవం. ఎనిమిదవ రోజు ఉదయం, ఉదయసూర్యుని కిరణకాంతు లతో దేదీప్యమానమై స్వర్ణరథంలో ఇరువైపులా ఉభయ దేవేరులైన శ్రీదేవి- భూదేవుల మధ్యలో వేంకటేశ్వరస్వామి వేంచేసి ఉండగా భక్తుల గోవిందనామస్మరణలమధ్య అత్యంత వైభవంగ స్వర్ణరథోత్సవం జరుగుతుంది.

## అశ్వవాహనం

నవరాత్రిబ్రహ్మోత్సవాలలో ఎనిమిదవనాటి రాత్రి వేంకటేశ్వరస్వామి ఒక్కడే శిరస్త్రాణాన్ని ధరించి, ఖడ్గం చేత బూని, యుద్ధవీరుని వలె కనిపిస్తూ అశ్వవాహనంపై ఊరేగు తాడు. కలియుగాంతములో వేంకటేశ్వరస్వామి అశ్వవాహనం మీద కల్కి రూపంలో వచ్చి దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మ సంరక్షణ చేస్తాడని చాటి చెప్పడమే అశ్వవాహన ప్రయోజనం.

## చక్రస్నానం

నవరాత్రిబ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా తొమ్మిదవరోజు ఉదయం పల్లకి ఉత్సవం. తర్వాత శుభఘడి యలలో-సుముహూర్తంలో చక్రస్నాన మహోత్సవం జరుగు తుంది. బ్రహ్మోత్సవంలో చివరి ఘట్టం అవభృథము-చక్ర



స్నానం. ఇది యజ్ఞాంతంలో ఆచరింపబడే అవభృథస్నానమే. యజ్ఞం చివర అవభృథస్నానం చేయడం సంప్రదాయం. శాస్త్ర విహితం కూడ. బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల పాటు ఒక యజ్ఞం వలె శ్రద్ధగా, ఘనంగా, వైభవంగా నిర్వ హింపబడుతాయి.

వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులైన మలయప్ప స్వామి శ్రీదేవి భూదేవులతో పల్లకిలో వరాహస్వామి ఆలయ ప్రాంగణం చేరుకొంటారు. వీరితో పాటు వేరొక పల్లకిలో చక్రత్తాళ్వారు (సుదర్శన చక్రం) వస్తాడు. తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారును మాత్రమే స్వామి పుష్కరిణిలో ముంచి పవిత్రస్నానం (చక్రస్నానం) చేయిస్తారు. ఉత్సవం వేంకటేశ్వర స్వామికి (యజమానికి), అవభృథము చక్రత్తాళ్వారుకు (సేవకునకు)జరుగుతుంది.

ఈ బ్రహ్మోత్సవమును ఎవరు చేయించినను, నిర్వ హించినను వారు ఈ లోకమున సమస్త భోగములను అనుభవించి, బ్రహ్మలోకమును పొందుదురు.

*శ్రీనివాస గోవిందా! గోవిందా!! గోవిందా!!!*

*(కోవిడ్-19 వల్ల పై తెలిపిన వాహనసేవల్లో గాని, ఉత్సవాల్లో గాని తి.తి.దే. ఉన్నధికారుల ఆదేశాల మేరకు మార్పులు జరిగే అవకాశమున్నది. భక్తులు గమనించగలరు.)*

# పావనములకెల్ల పావనమయమూ..



-'వాచస్పతి' బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

'వేంకటేశ్వరుడు, వేంకటాద్రి' - అద్భుతాలకు నిలయాలు. శ్వేతవరాహకల్పంలో ఆదికృత యుగంలో ఈ పర్వతం వెలసిందని పురాణ కథనం.

ఆదిశేషుడే ఆదినారాయణునికి క్రీడాపర్వతంగా మారి కొలుచుకుంటున్నాడు.

'వేంకట + ఈశ్వర' అనే అరుదైన పేరుతో శ్రీనివాసుడు భాసిస్తున్నాడు.

యజ్ఞవరాహ రూపంతో భూమిని ఉద్ధరించిన శ్రీహరి, భూదేవి ప్రార్థన మేరకు, బ్రహ్మదేవుని అభ్యర్థనను మన్నించి ఈ పర్వతంపై వసించాడు. ఈ పర్వతానికి వేంకటాద్రి, స్వర్ణాద్రి, రత్నాద్రి.... వంటి అనేక నామాలు ఉన్నాయని భవిష్య, భవిష్యోత్తరాది పురాణాలు చెబుతున్నాయి.

కృతయుగంలో వృషాద్రి, త్రేతలో అంజనాద్రి, ద్వాపరంలో శేషాద్రి, కలియుగంలో వేంకటాద్రి-అనే ప్రసిద్ధ నామాలతో ఈ పర్వతశ్రేణి శోభిస్తోంది.

ఆదియుగంలోనే వృషభాసురుడనే రాక్షసుని విష్ణువు సంహరించడం చేత ఈ పర్వతం వృషభాద్రి అయింది. 'వృష' మంటే ధర్మమని అర్థం. ధర్మంపై అధిష్ఠించిన దైవం కనుక- దీనికి వృషాద్రి అని పేరు. గరుడుడు, శేషాదులందరూ ఈ పర్వతంలో వివిధ విధాలుగా స్వామిని సేవించుకోవడం చేత గరుడాద్రి, శేషాద్రి-అని పేర్లున్నాయి.

సర్వపాపాని 'వేం' ప్రాహుః కటః తద్దాహ ముచ్యతే,
తస్మాద్వేంకట శైలోయం లోకే విఖ్యాత కీర్తిమాన్।
వేంకారోమృత బీజస్తు కటమైశ్వర్య ముచ్యతే
అమృతైశ్వర్య సంఘత్వాత్ వేంకటాద్రి రితిస్మృతః॥

'వేంకట' శబ్దానికి రెండు రకాల నిర్వచనాలను శాస్త్రాలు చెబుతున్నాయి. 'వేం' అంటే పాపాలు, 'కటః' అంటే దహింప (నశింప) జేసేదని అర్థం. సర్వపాపాలను, పాప ఫలితాలైన దుఃఖాలను నశింపజేసే ఆనందనిలయం. అది అర్థపరమైన నిర్వచనం. శబ్దశక్తిని అనుసరించి చూస్తే 'వేం' అమృతశక్తి బీజం. 'కటం' ఐశ్వర్య బీజం. అమృతత్వం (కైవల్యం, ఆనందం), ఐశ్వర్యం కలబోసిన శక్తిమంతమైన క్షేత్రమిది. ఈ వేంకటగిరిపై వెలసిన ప్రభువు వేంకటేశ్వరుడు.

ఆదిలో బ్రహ్మ వేంకటపతిని కొలిచి ఉత్సవాలను నిర్వహించాడనీ, నాటి నుంచి బ్రహ్మోత్సవ సంప్రదాయం ఏర్పడిందనీ చెబుతారు.

తాళ్లపాక అన్నమయ్య **'తిరువీధుల మెరసీ దేవదేవుడు'** అంటూ బ్రహ్మోత్సవ వైభవాలను సంకీర్తించాడు.

రోజుకొక్క సేవగా పది రోజుల పండుగగా జరిగే మహోత్సవాలివి.

ఈ ఉత్సవాల్లో విష్ణుమూర్తిగానే కాక, జగదంబా స్వరూపంగా సరస్వతీ, మోహినీవంటి రూపాల్లో తాను శక్తి స్వరూపుడనని కూడా భాసింపజేస్తాడు స్వామి. అధికమాసం మూడు సంవత్సరాలకు ఒకసారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీవారికి రావడం పరిపాటి. శరన్నవరాత్రులతో ఈ ఉత్సవాలు రావడం విశేషం.

సర్వదేవమయుడైన శ్రీనివాసుని కశ్యపుడు శ్రీ విద్యా స్వరూపిణిగా భావిస్తే, అత్రి శివరూపంగా కీర్తించాడు. భరద్వాజుడు లక్ష్మీపతిగా దర్శించాడు. విశ్వామిత్రుడు విరాట్పురుషునిగా, గౌతముడు గోపాలకృష్ణునిగా, జమదగ్ని జీవేశ్వ



రునిగా, వసిష్ఠుడు నిర్గుణ బ్రహ్మంగా దర్శించి ఉపాసించారని పురాణ స్తోత్రవచనాలు చెబుతున్నాయి.

వేంకటగిరి స్థూలనేత్రాలకు రాతికొండగా కనిపించినా, సూక్ష్మదృష్టికి ఇది విష్ణుచైతన్య విలసితం.

'వేదములే శిలలై వెలసినదీ కొండ. యే దెస పుణ్యరాశులే ఏరులైనదీ కొండ, పదివేల శేషుల పడగల మయమైన' దివ్యపర్వతమిది.... అని శాస్త్రాధారంగా అన్నమయ్య దర్శించాడు.

ప్రాచీన ఆధ్యాత్మికగ్రంథాల్లో ఉన్న ప్రశస్తితో పాటు, భారతీయ చారిత్రక సాంస్కృతిక వైభవాలకు కూడా ఈ గిరి ఆధారం.

ఈ కొండను, ఈ దైవాన్ని కొనియాడుతూ అద్భుతమైన సాహిత్య, సంగీత, శిల్పకళాదులు విస్తరిల్లాయి. ముఖ్యంగా ఆంధ్రసాహితీ సంగీతాల్లో అగ్రస్థానాన్ని అలంకరించిన అన్నమయ్య తన ప్రాణభావ కళాసృజనలను ఈ స్వామికే కైంకర్యం చేశాడు.

శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్తమాల్యద' ప్రబంధాన్ని ఈ వేంకట భర్తకే అంకితం చేశాడు.

ఆళ్వారుల రచనలు స్వామిని అనేకంగా కీర్తించాయి. పేయాళ్వారు, పొయ్‌గై ఆళ్వారు, తిరుమంగై ఆళ్వారులు స్వామిని తమ పాశురాల్లో కొనియాడారు.

తిరుమలనంబి (శ్రీశైలపూర్ణులు), భగవద్రామానుజులు, కురువనంబి, అనంతాళ్వారు మొదలైన భక్తాచార్యులు శ్రీనివాసుని దివ్యతత్త్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

"ఒప్పుల కుప్పయై ధర మహోన్నతుడై వెలుగొందుచుండు మా అప్పుడు వేంకటేశ్వరుడహర్నిశమున్ కమలా సమేతుడై...." అని కీర్తించిన తరిగొండ వేంగమాంబ 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' రచించింది. పలు కీర్తనలతో ఆరాధించింది.

శ్రీనివాసుడు భక్తవాత్సల్యమూర్తి. ఆయన సేవలు భక్తులపై తాను చూపించిన కృపకు సంకేతాలు. స్వామి గర్భగుడి గడప – కులశేఖరాళ్వారుల రూపం.

నిరంతరం వేంకటేశదర్శనాన్ని కోరిన కులశేఖరులు గడప (కులశేఖరాళ్వార్ పడి)గా మారాడంటారు. 'కురువరతి నంబి' అలనాడు మట్టిపాత్రలో నివేదన చేసినదానికి గుర్తుగా నేటికీ స్వామివారికి మట్టిపాత్రల్లోనే ఆరగింపు. 'పడి'కి ఆవల స్వామికి నివేదించేది మట్టి పాత్రలోనే.

తరిగొండవారి హారతి, అన్నమయ్య వారిపాట ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అనంతాళువారి భక్తికి సంకేతంగా స్వామి గట్టిన పచ్చకర్పూరం, తిరుమలనంబి వారి సేవకు ప్రతీకగా ఆకాశ గంగాజలం నేటికీ స్వామి భక్తవాత్సల్యానికి చిహ్నాలు.

యోగపరంగా చూస్తే – మనలోని మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రాలను దాటి సప్తమస్థానమైన పరంధామాన్ని (సహస్రారాన్ని) చేరుకొనే యోగసాధన ఈ సప్తగిరియాత్రలో సంకేతం.

ఈ ఏడుచక్రాల ప్రయాణంలోని యోగశక్తి కుండలినిని యోగవిద్యలో సర్పంగా సంకేతించారు. ఆ సర్ప స్ఫురణే 'శేషాచలం'గా ఈ పర్వతంలో ద్యోతకమవుతోంది.

స్వామి పుష్కరిణిలో సరస్వతీనది అంశగా ప్రవేశించిందని పురాణకథ. లెక్క లేనన్ని తీర్థాలు, కోనేరులు ఈ పర్వతశ్రేణిలో ఉన్నాయి. దేవతలు, మహర్షులు, ఆచార్యులు, భక్తులు, తపస్వులు అనాదిగా ఆశ్రయించి ఆరాధిస్తున్న వేంకటాద్రి చరిత్రకీ, సంస్కృతికీ, ఆధ్యాత్మికతకీ, భక్తికీ ఆధారమై విరాట్ హైందవ చైతన్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తోంది.

ఆపద్బాంధవునిగా, భక్తవత్సలునిగా, సర్వ దేవతామయునిగా ప్రకాశిస్తున్న నారాయణ బ్రహ్మం–శ్రీతిరుమల గిరి ప్రభువు. సర్వదేవతామయమైన శ్రీవేంకటేశ్వర చైతన్యానికి సభక్తికంగా అంజలి ఘటిద్దాం....

*ఓం నమో వేంకటేశాయ*



'అవివేకము' వలన 'బుద్ధి' నాశనమగును

*గత సంచిక తరువాయి భాగం.....*

## తిరుమల దర్శనం

రెట్టించిన ఉత్సాహంతో అన్నమయ్య తిరుమల గిరికి చేరుకున్నాడు. కొండపైకి వెళ్ళిన వెంటనే మొదటగా కోనేటిరాయని పుష్కరిణి చేరుకొని, పవిత్రస్నానమాచరించాడు. స్వామి పుష్కరిణి సౌందర్యాన్ని దర్శించిన అన్నమయ్య హృదయం తెల్లతామర వలె వికసించింది.



ఆనందం ఉప్పొంగగా, వరాహస్వామి ఆలయాన్ని సందర్శించాడు. భూవరాహస్వామి సందర్శనానంతరం భూలోకవైకుంఠమై, తిరువేంకటనిలయమై వర్ధిల్లు ఆలయ సందర్శనానికై బయలు దేరాడు. ఆనందనిలయుడి దర్శనానికై ప్రధానద్వారం దాటి, గరుడస్తంభానికి సాష్టాంగ నమస్కారం చేశాడు. వెండివాకిలి దాటి ప్రదక్షిణ మార్గంలో ఆలయానికి ప్రదక్షిణ చేశాడు. ఆలయంలోని 'పోటు' నుండి వచ్చే నేతి వాసనను ఆస్వాదిస్తూ

ఏ పొద్దు చూచిన దేవుఁడిట్లానే యారగించు
రూపులతోఁ బదివేలు రుచులై నట్లుండును ॥పల్లవి॥

మేరుమందారాలవలె మెఱయు నిద్దెనలు
సూరియచంద్రుల వంటి చుట్టుఁ బళ్లేలు
ఆరని రాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరనన చుక్కలు రాసివోసి నట్లుండెను ॥చరణం॥

పండిన పండుల వంటి పచ్చళ్లుఁ గూరలును
వండి యలమేలు మంగ వడ్డించఁగా
అండనె శ్రీవేంకటేశుఁడారగించి మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను ॥చరణం॥

అని ఆ శ్రీహరి ఆరగింపును గురించి స్తుతిస్తూ, ప్రదక్షిణ సాగిస్తూ, ఆ ప్రదక్షిణ మార్గంలోని యోగనారసింహుని, శ్రీమద్రామానుజాచార్యులను దర్శించి దేదీప్యమానంగా వెలుగులీనుతున్న ఆనందనిలయాన్ని కనులారా చూచి, మనసారా ఆనందించాడు. వాహనమండపంలోని (ప్రస్తుతం పరకామణి) స్వామివారి ఊరేగింపుకోసం ఉంచిన ఉచ్ఛైశ్రవాన్ని (అశ్వవాహనం), గరుడవాహనాన్ని, శేష వాహనాన్ని దర్శించి, ధ్యానించాడు. నిత్యకల్యాణభూతుడైన శ్రీనివాసుని పరిణయ వేడుకలు నిర్వహించే కల్యాణోత్సవ మండపాన్ని దర్శించాడు. పెద్ద ఎత్తున భక్తులు కానుకలు సమర్పించే శ్రీహరి హుండీని దర్శించి తన పైపంచ అంచున ముడిపెట్టి ఉన్న రూకను స్వామికి సమర్పించాడు.

## శ్రీవేంకటేశ్వర సందర్శనం

బంగారువాకిలి గుండా ఆలయప్రవేశం చేసి, అక్కడ–


గ్రక్కున దగ్గఱఁ గనుపట్టు పసిఁడి
టక్కుల తల వాకిటను గానవచ్చు
ధళధళల్ తిలకించు దర చక్రహస్త
ములు బొద్దుమానికమును గతారమును



మంజీర కింకిణీ మంజుల పాద
కంజ ద్వయంబును గాంచనాంబరము
కటి మీఁదఁ జేర్చిన కర పంకజంబు
.......................................

తలవాకిటనుండి ప్రస్ఫుటంగా కనిపించే మూర్తిని, పై రెండు చేతులలో శంఖ, చక్రాలు ధరించిన వాడిని, నాభి యందు మాణిక్యంతో అలంకరింపబడినవాడిని, నందక ధారిని, మనోహరమైన చిరుగంటలు పాదాలయందు కలిగిన వాడిని, కటి వరదహస్తుణ్ణి, మణిమయ కర్ణాభరణ కాంతి కలవాడిని, మందస్మిత వదనారవిందుడైన వాడిని, మేలి ముత్యాలు ఊర్ధ్వపుండ్రాలుగా కలిగినవాడిని, ధగధగాయ మానమైన రత్నకిరీటధారిని, శ్రీవత్సాంక కౌస్తుభధారిని, దివ్యమంగళాకారుని, శ్రీనివాసుని అన్నమయ్య తనివితీరా దర్శించి తరించాడు. ఆ దివ్యమంగళ విగ్రహాన్ని అన్నమయ్య తన 'కన్నుల కఱవెల్లఁదీర' దర్శించాడు. దర్శించి స్తుతిం చాడు. స్తుతించి కీర్తించాడు. 'కంటి నయ్యఖిలాండ కర్తనే నధికుఁ, గంటి నాయఘము నిక్కము వీడుకొంటి' అని ఆనందించాడు.

"పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయక వయ్య కోనేటి రాయఁడా



కోరిమమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁడా" ॥

అంటూ పరవశించిపోయాడు. అర్చకస్వాములు ఇచ్చిన తీర్థప్రసాదాలు సేవించి, తన ఆవాసానికి వెళ్ళాడు అన్నమయ్య. ఆ రాత్రి ఆనంద పారవశ్యంలో నిద్దురరాక కళ్ళనిండా వేంకటేశ్వరుని రూపాన్ని నింపుకొన్నాడు. మరు సటి ఉదయం తిరుమలక్షేత్రంలో వెలసిన కుమారధార, ఆకాశగంగ, పాపవినాశన తీర్థాలను సేవించాడు. అటు పిమ్మట అన్నమయ్య మరలా స్వామి దర్శనానికై వెళ్లగా అక్కడ తాళాలు వేసి ఉన్న ద్వారబంధాలు దర్శనమిచ్చాయి. ఆశువుగా అన్నమయ్య అలమేలుమంగాపతిపై అనర్గళంగా శతకాన్ని చెప్పాడు. అంతే ఆ తాళాలు తమంత తామే ఊడి కిందపడ్డాయి. ఇదంతా గమనించిన అర్చకస్వామి ఆశ్చర్యంతో ఆ బాల అన్నమయ్య భక్తిని కొనియాడి, గౌరవానురాగంతో లోనికి తీసుకువెళ్ళాడు. అక్కడ బంగారునగలతో అలం కరింపబడి భక్తులపాలిట కల్పతరువు వంటి శ్రీవేంకటపతిని అన్నమయ్య సేవించాడు.

'ధర సింహాసనమై, నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై। పరమామ్నాయములెల్ల వందిగణమై బ్రహ్మాండమా గారమై। సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై। వరుసన్నీఘనరాజసంబు నిజమై వర్ధిల్లు' శ్రీమన్నారాయణుని సందర్శించాడు అన్నమయ్య. అర్చక స్వామి ఆగమోక్తంగా చేసే అర్చనా విధానాన్ని చూసిన అన్నమయ్య అంతకు ముందు చెప్పిన శతకాన్ని మళ్ళీ చెప్పాడు. స్వామి కరుణ చూపాడు. నిదర్శనంగా మెడలోని ముత్యాలహారం జారి స్వామివారి పాదాలపై బడింది. అర్చకస్వామి ఆశ్చర్య పోయాడు. ఈ బాలుడు సాధారణ బాలుడు కాదు. శ్రీనివాస కృపాకటాక్షాలను పొందినవాడు అని అన్నాడు. అక్కడున్న వాళ్ళు ఆ మాటలు విని ఆ బాల అన్నమయ్యను గౌరవపురస్సరంగా చూశారు. అది మొదలుగా ప్రతిరోజూ శ్రీవారి దర్శనం చేసుకుంటూ నారాయణనామ సంకీర్తనలు పాడుతూ, తిరువీథులలో తిరుగుతున్నాడు అన్నమయ్య.

*(ఇంకా ఉంది)*

బాలప్రబోధం

# భావన

– శ్రీమతి జి.సత్యవతి

ఒక ఊరిలో ఒక ధనవంతుడు ఉండేవాడు. అతడు విష్ణుభక్తుడు. విష్ణువుపై ఉన్న అచంచల భక్తితో తన ఇంటి ఆవరణలో ఒక మందిరం కట్టించాడు. అందులో సుందరమైన విష్ణువు విగ్రహాన్ని ప్రతిష్ఠించి, విగ్రహానికి షోడశోపచారాలతో పూజలు చేయసాగాడు. చక్కని రుచికరమైన నైవేద్యాలు, నేతిదీపాలు, పరిమళాలధూపాలతో అర్చించసాగాడు. అతనికి అనుకోకుండా వ్యాపారంలో నష్టం వచ్చింది. అప్పుడు ఎవరో సలహా ఇచ్చారు. విష్ణువు సంపద ప్రదాత కాదనీ, సంపదలు రావాలంటే సిరిసంపదలతో తులతూగాలంటే లక్ష్మీదేవి పేరు చెప్పి, ఆ దేవతని ఆరాధించమని చెప్పారు.

వెంటనే, ఇతను ఆ దేవతావిగ్రహాన్ని కొని తెచ్చాడు. పూజలు ప్రారంభించాడు. అతనికి అదృష్టం కలిసి వచ్చింది. వ్యాపారంలో అనుకోని లాభాలు వచ్చాయి. వెంటనే అతను ఇనుమడించిన ఆనందంతో పూజలు చేయసాగాడు.


ఒక పర్వదినాన రకరకాల పిండి వంటలతో, ధూప దీపాలతో పూజ చేయసాగాడు. పూజకి ముందు విష్ణుమూర్తి విగ్రహం కన్పించింది. వెంటనే కోపం వచ్చింది. 'ఇంక నువ్వెందుకిక్కడ' అని తీసి ఆ విగ్రహాన్ని ఒక మూలగా పడ వేశాడు.

తను పూజిస్తున్న దేవతకి అతను రోజూ పూజ చేయసాగాడు. రకరకాల పిండివంటల కమ్మని ఘుమఘుమలు, దీపధూపాల పరిమళాలు, సువాసనలు వెదజల్లే సుగంధపుష్పాలతో ఆ గదంతా చక్కని సుమధుర వాసనలతో నిండిపోయింది.

అతనికి దూరంగా ఒక మూలగా, ప్రక్కగా పడ వేసిన విష్ణు విగ్రహం కన్పించింది. ఆ వెంటనే అతను కోపంగా లేచి వెళ్లి, ఒక వస్త్రంతో ఆ విగ్రహం ముక్కు మూసివేశాడు. "ఈ వాసనలన్నీ హాయిగా ఆఘ్రాణిస్తున్నావా? ఇవన్నీ నీ కోసం చేయలేదు. ఈ వస్తువుల వాసనలు కూడా నీకు రాకూడదు" అన్నాడు.

వెంటనే విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యాడు. చిరునవ్వుతో, జగన్మోహన కాంతితో ఉన్న ఆ వాసుదేవుని చూసి కళ్ల నీళ్లతో "స్వామీ! నిన్నెంతో ఆరాధించాను, అర్చించాను, రకరకాల నైవేద్యాలు పెట్టాను. అప్పుడంతా నీవు కనికరించకుండా, కష్టాలు అనుభవించేటట్లు చేశావు. ఇప్పుడు నిన్ను ఆరాధించడం మాని ఇంకెవరినో సేవిస్తూ, ఆ నైవేద్యాల వాసన కూడా నీకు రానివ్వకుండా చేస్తే, ఇప్పుడు ప్రత్యక్షమై కనికరించావు ఇదేమి వింత?" అని ప్రశ్నించాడు. అందుకు ఆ మహా మాయావి నవ్వుతూ "నీవు పూజలు చేసావు నిజమే. నైవేద్యాలు నివేదించావు. కానీ నేను అక్కడే ఉన్నాను అన్న 'భావన'తో నీవు చేయలేదు. ఏదో పూజ చేసాం, ఏదో నైవేద్యం తప్పనిసరి అన్నట్లుగా చేసావు.

కాని, ఇప్పుడు నీవలా అనుకోలేదు. నేను ఇక్కడే ఉన్నాను అనుకున్నావు. ఈ ధూపాల వాసనలు, ఈ నైవేద్యాల ఘుమఘుమలు ఇవన్నీ నేను అనుభవిస్తున్నాను అనే భావన నీలో కలిగింది. నా ఉనికి, నా సామీప్యం, నా సాన్నిధ్యం, నీ భావనలో పొందావు. ఇక్కడే ఉన్న నా ముక్కు మూసావు. అంటే అంత ప్రత్యక్ష భావన నీలో కలిగింది. ఎప్పుడైతే ఆ భావన నీలో కలిగిందో, నా సాక్షాత్కారము లభించింది" అన్నాడు.



# దుర్గోపాసన

- శ్రీ కాశీభట్ల సుబ్బరామశర్మ

## నవరాత్రుల్లో... 'దుర్గామాత' స్వరూపాలు













దుర్గానామాన్ని బట్టి ఆమె వాచాతీత పరాత్పరశక్తి. అంటే పరిపూర్ణ బ్రహ్మ స్వరూపిణి. అహం బ్రహ్మ స్వరూపిణీ అని ఆ దేవత స్వయంగా దేవతలతో చెప్పింది. ఆమె 'దుర్గా మాత'.

మంత్రాలన్నిటికి మాతృక ఆమెయే. అక్షరరూపంలో ఉండేది ఆమెయే. శబ్దంలోని జ్ఞానం అంటే అర్థరూపిణి. సమస్తజ్ఞానాల్లో చిన్మయాతీత జ్ఞానం శూన్యంలో శూన్య సాక్షిణి. మహాప్రళయానంతర స్థితి శక్తి సంగమ మనబడుతుంది. మహాప్రళయ మేర్పడినపుడు అంతా శూన్యమవుతుంది. అప్పటి దశే శూన్యస్థితి. దాన్ని చూచేది అంటే చిచ్ఛక్తి స్వరూప బ్రహ్మము. ఆమె మహాప్రళయంలోను లీనం గాదు. ఆమెను మించిన పరమతత్త్వం మరేదీ లేదు. ఆమె 'దుర్గ'.

దుర్గలోని '**దు**' అనే అక్షరం దారిద్ర్యాన్ని, దుఃఖాన్ని, దుర్భిక్షాన్ని, దుర్వ్యసనాదులను నాశనం చేస్తుంది. దైత్య నాశానికి ప్రతీక. సమస్త రోగాలను నశింప చేస్తుంది. '**గ**' కారం పాపనాశకం. అకారము అన్యాయ అత్యాచార అధర్మ ఆసురీ ప్రకృతుల నశింపజేసే వాచకము.

దుర్గనాశిని దుర్గతినాశిని దుర్గ. దుర్గ పదానికి 'కోట' యనే అర్థమే గాక 'భవసాగరమనే' అర్థం గూడ ఉంది. ఈ దుర్గమనే భవపాశాన్ని ఛేదించి, నిష్కామ సాధకులను విముక్తుల్ని చేస్తుంది. సకామ సాధకుల తాపత్రయాలను నశింపచేసి సౌఖ్యాన్ని కలిగిస్తుంది. అంటే దుర్గామాత భక్తి యుక్తుల ప్రసాదించే పరబ్రహ్మ స్వరూపిణి.

### అవతరణోద్దేశ్యము

దుర్గ సంఘశక్తికి ప్రతీకం. దేవతల సమూహశక్తి తోనే అపారతేజస్సు వెలువడింది. అట్లనే ఇంద్రాది దేవతల ముఖంనుండి ఒక అద్భుతతేజస్సు వెలువడింది. ఆ తేజస్సులన్నీ కలసి ఒక్కటిగా మారింది. ఆ అపార తేజః పుంజ జ్వాలలు దశదిశల నావరించి, జ్వలించే పర్వతమా అన్నట్లుండెను. తన దివ్య కాంతితో ముల్లోకాల ప్రసరింపచేసే ఆ తేజః పుంజం క్రమంగా స్త్రీ మూర్తిగా మారబడింది. శివుని ముఖం నుండి వెలువడిన తేజస్సుతో ఆమె ముఖము, యముని తేజస్సుతో వెంట్రుకలు. విష్ణుతేజస్సుతో బాహువులు, చంద్రునితేజస్సుతో స్తనయగ్మము, ఇంద్రతేజస్సుతో నడుము, వరుణ తేజస్సుతో పిక్కలు, తొడలు, బ్రహ్మతేజస్సుతో పాదాలు, సూర్యతేజస్సుతో కాలి వ్రేళ్లు, వసువుతేజస్సుతో చేతి వ్రేళ్లు, కుబేరతేజస్సుతో ముక్కు, ప్రజాపతితేజస్సుతో దంతాలు, అగ్నితేజస్సుతో మూడు కండ్లు, వాయుతేజస్సుతో చెవులు, ఇతర దేవతల తేజస్సులతో ఆ మంగళమూర్తి పరిపూర్ణ దేవత అయింది. ఈమె చిత్రవర్ణ అంటే ఏ దేవత ఏ వర్ణంలో ఉంటుందో ఆ దేవతా తేజస్సుతో ఏర్పడిన అవయవాలు ఆయా వర్ణాలలో ఉంటాయి. ఇన్ని వర్ణాలుండినా ఆమె అందరికి సందర్శనీయే.

నవరాత్రుల్లో...
'దుర్గామాత' స్వరూపాలు

మహిషాసురునితో బాధలు పడే దేవతలు ఆ దివ్య తేజోమూర్తిని జూచి మహదానందమొంది తమ తమ అస్త్ర శస్త్రాలను ఆమెకు సమర్పించుకున్నారు.

సమాజ పరిస్థితిని భంగపరచే ఆసురీశక్తుల నణచడానికే 'దుర్గ' అవతరించింది. ధర్మమడుగంటినప్పుడంతా ధర్మాన్ని సంరక్షించడానికి నేను యుగ యుగాల్లో అవతరిస్తూంటానని, భగవానుడు గీతలో చెప్పినట్లే దుర్గ మార్కండేయ పురాణంలో ఇట్లే ప్రతిజ్ఞచేసింది.

అనాచార అత్యాచార అన్యాయాలకు ప్రతీకలైన ఆసురీశక్తుల వినాశానికే ఆమె అవతారము.

మార్కండేయ పురాణం దుర్గా మహిమను వర్ణిస్తూ - విశ్వాన్ని సృష్టించి, రక్షించి నశింపజేసే నారాయణుని గూడ నిద్రావశుణ్ణి చేసే సామర్థ్యం నీకుంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నీ సంకల్పంతో శరీరాన్ని ధరించినారు. అట్టి మహా మహిమగల నిన్ను స్తుతింపగల శక్తి ఎవరి కుంది. అదే అధ్యాయంలోనే- *'జ్ఞాని నామపి చేతాంసి దేవీ భగవతీ హి సా......'* ఆ భగవతి అయిన మహామాయ జ్ఞానుల చిత్తమును కూడ బలాత్కారంగా ఆకర్షించి మోహవశుల చేస్తుంది. ఈ ప్రపంచమంతా ఆమే సృష్టించింది. ముక్తి హేతువు. ఆమె సర్వేశ్వరి అయినప్పటికి సంసార బంధాలకు హేతువవుతుంది.

## దుర్గా స్వరూపము

దుర్గా స్వరూపాన్ని వేదశాస్త్రోపనిషత్తులు, తంత్రాలు ఎన్నోవిధాల కీర్తించి నాయి. దేవ్యథర్వశీర్షంలో- 'నేను బ్రహ్మ స్వరూపిణిని. నా నుండే ప్రకృతి పురుషాత్మక విశ్వము సృజింపబడుతుందని' అమ్మ చెప్పింది. శ్రీమద్భాగవతంలో సగుణ నిర్గుణ రూపిణిగా దేవి రెండు రూపాలతో కనిపిస్తుంది. కూర్మపురాణం అనంత నిర్వికార నిర్గుణ బ్రహ్మగా అంగీకరించింది. ఈ పురాణం దుర్గాతత్త్వాన్నిట్లు విశ్లేషించింది.

*'యయేదం భ్రామ్యతే విశ్వం యోగిభిర్యా విచింత్యతే'*- ఏ దేవితో ఈ సంసార చక్రం త్రిప్పబడుతుందో, యోగు లే దేవిని నిరంతరం ధ్యానిస్తుంటారో ఏ మాత ప్రకాశంతో జగత్తంతా ప్రకాశిస్తుందో ఆమే జగద్వ్యాపియైన దుర్గామాత.

శ్రీకృష్ణభగవానునిచే దెలియబడేది పరాశక్తి యొక్కటియే, అతడును ఆమె స్వరూపమే. ఆ పరాదేవత దుర్గ. ఆమె మహావిరాట్ స్వరూపిణి. ఈమెను తెలిసి కొన్నంత మాత్రంలోనే పరమాత్మను చేరవచ్చు. అదే ఆదిశక్తి మహామాయ అన్నిటికి ఆధార శక్తి, అఖిలేశ్వరీ.


దుర్గామహాశక్తిని చతుర్భుజిగా, అష్టభుజిగా, దశభుజిగా, షోడశభుజిగా భావిస్తూ పూజిస్తుంటారు. ఈ విలక్షణ రూపాల్లోని తత్త్వమేదో మనకు తెలియదు. ఈ పరతత్త్వ స్వరూపం మన మహర్షుల దృష్టికి గోచరించినవే.












ఈ దుర్గ మెఱపు తీగ వంటి కాంతి గలది. సింహ స్కంధము నధిరోహించినది. భీకరాకారము గలది. కత్తి, డాలు శరము, ధనుస్సు, గుణము తర్జనీముద్ర- వీనిని చేతుల ధరించునది. అగ్ని వంటి తేజో రూపం గలది. చంద్రకళను దాల్చినది. త్రినేత్రములు గలది. వీటిని లక్ష్యంలో పెట్టుకొని దుర్గా తత్వాన్ని తెలుసుకోవడం ముఖ్యము.

**1)విద్యుల్లత-** చిచ్ఛక్తిని సూచిస్తుంది. విద్యుత్తు బ్రహ్మమని, శక్తి అని, బలమని తైత్తిరీయం చెపుతూంది. పరాత్పర శక్తిని విద్యుత్తని ఎందుకు చెపుతున్నారంటే-ఈమె స్మరణ మాత్రంతోనే అంధకారం తొలగి ప్రకాశముత్పన్న మౌతుంది. ఇదే ప్రాణశక్తి. ఇది లేక ఏ పదార్థము ఉండదు. జడ పదార్థాల్లోను ఈ ప్రాణశక్తి సుప్తావస్థలో ఉంటుంది. వృక్షాలల్లో స్వప్నావస్థలో, జీవుల్లో జాగ్రద వస్థలో ఉంటుంది.



**2) మృగపతి-** దీనివల్ల సింహము, శివరూపి అయిన శివుడు సూచింపబడుతున్నారు. శివుని పశుపతి అంటారు. అంటే దేవతల పతి *'సర్వే దేవాః పశుతామ వాపుః- తస్మాత్ స్వయం పశుపతిర్బభూవ'.*

**3)భీషణ-** భయంకరము. భీషణత్వము పరబ్రహ్మ విశిష్ట లక్షణాల్లో ఒకటి. ఈమె విరాట్ స్వరూపమే భయం కరం.

**4)కన్యాసేవితా-**కన్య అనే పదానికనేకార్థాలున్నాయి. దానిలో జ్యోతిష్మతి యొకటి. ప్రకాశమండలము గలది. రెండ వది అవివాహిత వ్యక్తి. ఆమె చేతిలోని ఆయుధాలు రక్షణాత్మక శక్తిని సూచిస్తున్నాయి. శక్తులన్నీ ఆమెను సేవిస్తున్నాయని అర్థము.

**5)అష్టభుజ-** పంచభూతాలు మనోబుద్ధి చిత్తాహంకారా లనే అష్టప్రకృతులు సూచింపబడుతున్నాయి.

ఈ విధంగా పరాత్పరయగు భగవతి ప్రకృతి ధారిణి, ప్రకృతి రూపిణి అవుతూంది. ఇట్లే అన్ని రూపాల్లో బాహ్యార్థాలు, అంతరార్థాలు ఎన్నో ఉన్నాయి.

## దుర్గానామ మహిమ

జగన్మాత నామాల్లో దుర్గానామం మహా ద్భుతము. విశిష్టగుణ సంపన్నము. రామకృష్ణ శివాది నామాల్లో ఒక్కొక్క విశిష్టగుణమే ఉంది.

కానీ, దుర్గానామంలో విశిష్టగుణాలెన్నో ఉన్నాయి కాబట్టే, శ్రీశంకరులు ముండమాలా తంత్రంలో దుర్గానామం పలికే చోట, శివుడుండే కైలాస మందిరమే ఉంటుందన్నారు.

అంతేగాక... సమష్టిగుణాలతో కూడి యున్నందున అన్ని సంప్రదాయాలవారు దుర్గా నామాన్ని జపిస్తూంటారు.

'దుర్గా స్మరణజం దేవి దుర్గా స్మరణజం ఫలమ్....
....భజేద్దుర్గాం స్మరేద్దుర్గాం యజేద్దుర్గాం శివప్రియామ్.'

జీవిత లక్ష్యం మోక్షాన్ని పొందడమే. దీనికన్నిటి కంటే సులభ మార్గం అమ్మ నామాన్ని స్మరించడమే. దుర్గా నామాన్ని జపించే వారికి మోక్షం కరతలామలకం.

'దుర్గ దుర్గేతి దుర్గాయాః దుర్గ నామ పరం మనుమ్...
.....యో జపేత్ సతతం దేవి జీవన్ముక్త స్సమానవః'

అని శంకరుల సూక్తి.

'దుర్గా దుర్గా' అని దుర్గానామాన్ని జపించేవారు జీవన్ముక్తులే. సందేహం లేదు. దేవతల నామాలన్నిటిలో దుర్గా నామం మేరుపూస వంటిది.

దుర్గానామం నామాలన్నిటి లీలా స్వరూపాలను తెలియజేస్తుంది. ఈ దుర్గానామాన్ని గ్రహించి, జపించి స్మరించడంవల్ల సమస్త దేవతా నామోచ్చారణ ఫలితం లభిస్తుంది. ఏ రూపాన్ని ఉపాసించేవారైనా 'దుర్గా! దుర్గా' అనడంవల్ల ఆ రూపమే సాక్షాత్కరిస్తుంటుంది.

సమస్తాపదలనే సాగరాన్ని దాటడానికి దుర్గా నామం నౌకవంటిది. అది లౌకికభయం గావచ్చు. ఆధ్యాత్మికం గావచ్చు. దుర్గా నామమే దాటింప గలుగుతుంది. ఈ దుర్గానామ జప మహిమ నెంతని వర్ణించగలము?

ప్రతి దినము పవిత్రుడై, భక్తిశ్రద్ధలతో అష్టోత్తర శతం 108 జపించేవారు ధనవంతుడు, పుత్రవంతుడు, జ్ఞాని, దీర్ఘాయుష్మంతుడు అవుతున్నాడు అని పరమశివుడు పార్వతితో చెప్పినట్లు రుద్రయామళ తంత్రంలో కనిపిస్తుంది.

'ఓ పరమేశ్వరీ! ప్రతి దినము దుర్గానామాన్ని 1008 జపించడం వల్ల గలిగే ఫలితాన్ని విను. ధనార్థి ధనాన్ని, జ్ఞానార్థి జ్ఞానాన్ని పొందుతున్నారు. రోగార్తుడు రోగ ముక్తుడౌతున్నారు. భయపడిన వానికి భయం పోతుంది. పాపి పాపవిముక్తి బొందుచున్నారు. పుత్రార్థి పుత్రుల బడయుచున్నారు.'



'ఓ పార్వతీ! ప్రతి దినము పదివేలు జపించేవారు నిగ్రహానుగ్రహ సమర్థుడౌతున్నాడు. సర్వాభీష్టములకు ఈ మంత్రం కల్ప వృక్షం వంటిది. ఇందులో సందేహం లేదు.'

'ఓ దేవీ! నెలకు లక్ష సంఖ్యలో జపించేవానికి గ్రహ బాధలుండవు. దారిద్ర్య మెప్పటికీ నుండదు. అగ్ని, చోర, సింహ, వ్యాఘ్ర, పిశాచాదుల భయముండదు. శత్రువులు ఉండరు. దుర్గానామాన్ని జపించేవారు స్వర్గ భోగాల ననుభవిస్తారు.'

దుర్గానామ జపప్రభావంతో సహస్ర వాజపేయ ఫలితం లభిస్తుంది. దుర్గానామంతో సమానమైంది మరి యొకటి లేదు. కాబట్టి సాధకులు దుర్గా నామాన్ని నిరంతరం జపిస్తూండవలె.

ఈ దుర్గానామం మహాసులభమైంది. మహా ఫలప్రదాయకమైంది. ఈ జపసాధనలో ఎటువంటి కష్ట నష్టాలుండవు. కఠిన నియమాలుండవు. ఈ దుర్గానామాన్ని సదా స్మరిస్తుండవలె.

'ఓం దుర్గాయై నమః'

## భగవద్గీత-యువత

# అంతరంగశత్రువులు

డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్

స్వర్గం, నరకం అనే రెండు ప్రదేశాల గురించి సాధారణంగా అందరూ వినే ఉంటారు. స్వర్గానికి వెళ్ళిన వారు ఆనందాలు అనుభవిస్తారని, నరకానికి వెళ్ళినవారు ఎన్నో కష్టాలు పడతారని అందరికీ తెలుసు. నిజానికి నరకలోక శిక్షల గురించి మనకు శ్రీమద్భాగవతములో లభిస్తుంది. భాగవతంలో స్థూలమైన పాపాలకు శిక్షల గురించి వివరించబడితే, భగవద్గీతలో సూక్ష్మంగా ఉండే పాపాలకు శిక్ష ఎలా కలుగుతుందో స్పష్టంగా చెప్పబడింది. ఇది యువత చక్కగా తెలిసికోవాలి.

నరకానికి మూడుద్వారాలు ఈ లోకంలోనే ఉన్నాయని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో చెప్పాడు. **కామము, క్రోధము, లోభము** అనేవి నరకానికి దారితీసే మూడు ద్వారాలు. అవి ఆత్మకు నాశనము కలిగిస్తాయి కనుక ప్రతీ బుద్ధిమంతుడు వాటిని తప్పక విడిచి పెట్టాలి (భగవద్గీత 16.21).

సాక్షాత్తుగా భగవంతుడే మానవుల క్షేమం కొరకు, శ్రేయస్సు కొరకు అతి ముఖ్యమైన హెచ్చరిక చేస్తున్నాడు. కామము, క్రోధము, లోభము అనేవి సహజ స్వభావాలుగానే కనిపించినా నిజానికి అవి నరకద్వారాలు.

మొదటిది **కామము** అంటే సాధారణంగా కామవాంఛ అని అర్థం చెప్పబడినా దానికి అణపరాని కోరికగా అర్థం చెప్పుకోవచ్చు. యువత ప్రస్తుత కాలంలో పతనం చెందుతున్నది ఈ కామవాంఛతోనే. అది ప్రస్తుత జీవితాన్ని పతనం చెందింప జేయడమే కాకుండ జన్మాంతరములో నరకానికి దారి తీస్తుంది. కామవాంఛకు లోనైన యువత తమ భవిష్యత్తును పణంగా పెడుతున్నవారేనని అర్థం చేసికోవాలి.

అందుకే ఆ విషయంలో పెద్దలు, గురువులు ప్రముఖ పాత్ర వహించి ఆ పతనం నుండి యువతను కాపాడాలి. చక్కని సాంగత్యం ఏర్పాటు చేయడం ద్వారా యువత కామవాంఛ నుండి బయటపడగలుగుతారు.

ఇక **కోపమనేది** రెండవ నరకద్వారంగా చెప్పబడింది. అణచలేని కామం వల్లనే క్రోధం వస్తుంది. ఎవరైతే తన కామవాంఛకు అడ్డు వస్తున్నారో వారి మీద క్రోధం కలుగుతుంది. తన ఆనందానికి అడ్డు వచ్చేవాడి అంతు చూడడమే మనిషి క్రోధం వలన చేసే పని. అటువంటి పరిణామాలు ప్రస్తుత జీవితాన్నే నరకంగా మార్చేస్తాయి. ఇక జన్మాంతము గురించి చెప్పేదేముంది? కోపం రావడం వలన దేహంలో అనేకమైన రోగాలు వస్తాయి.

అందుకే మనిషి తనకు కోపం రాకుండ చూసుకోవాలి. అయినా ఒక్కొక్కసారి కోపం ప్రదర్శించవలసి రావడం జరుగుతూనే ఉంటుంది. అది తెచ్చుకున్న కోపమే గాని వచ్చిన కోపం కాదు. దాని వలన భయమేమీ లేదు.

మూడవ నరకమార్గం **లోభం.** లోభమంటే అంతా తనకే కావాలని అనుకోవడం, ఎవ్వరికీ అది అందకూడదని అనుకోవడం. లోభం వలన ప్రేమానురాగాలు సాంఘిక జీవనం, బాంధవ్యాలు అన్నీ నశించిపోతాయి.

కాబట్టి యువత ఈ విషయంలో సావధానులై ఉండి గీతోపదేశ హెచ్చరికను జాగ్రత్తగా గమనించాలి. కామానికి, క్రోధానికి, లోభానికి దూరంగా ఉండే ప్రస్తుత జీవితం గండం లేకుండ ప్రశాంతముగా సాగడమే గీతా సందేశం ద్వారా మనకు లభిస్తున్న అద్వితీయవరము!

# శ్రీవారి సేవలో 'తిరుమలనంబి'

-శ్రీ వేమరాజు అనంతపద్మనాభం

కలియుగ దైవముగా వెలసి, తిరుమలేశునిగా, శ్రీనివాసునిగా, గోవిందునిగా, శ్రీవేంకటేశ్వరస్వామిగా భక్తులను అనుగ్రహిస్తున్న ఆ దేవదేవుని సేవలో జీవించి తరించిన భక్తాగ్రేసరులెందరో వున్నారు. అందులో ముందు స్వామివారి ప్రథమ 'తీర్థకైంకర్యులుగా' కీర్తిగాంచిన భక్తవరేణ్యుడు తిరుమలనంబి. శ్రీశైల శ్రీరంగాచార్యులవారు తమ శ్రీనివాసగద్యంలో తిరుమలనంబిని శ్రీశైలపూర్ణునిగా అభివర్ణించారు.

తిరుమలనంబి యామునాచార్యులవారి శిష్యుడు. సంస్కృత, తమిళ భాషలలో మహాపండితుడు. ఇంతేగాక శ్రీవైష్ణవ విశిష్టాద్వైత ప్రవక్త. శ్రీమద్రామానుజాచార్యులవారికి మేనమామ. మరియు శ్రీరామానుజులవారి ఐదుగురి గురువులలో తిరుమలనంబి కూడ ఒకరు. ముఖ్యంగా శ్రీరామానుజులవారికి మహిమాన్వితమైన 'ఓం నమో నారాయణాయ'- అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించినారు.

## శ్రీరామానుజులవారికి రామాయణ బోధ


స్వామి ఆళవందారువారు తమ సనాతన ధర్మజ్ఞాన సంపదను శిష్యసమేతంగా శ్రీరామానుజులకు ప్రసాదించారు. శ్రీరామాయణమును మాత్రం తిరుమలనంబి వారికి ప్రసాదించారు. కాలాంతరమున శ్రీరామానుజులకు తిరుమలనంబి రామాయణ రహస్యములను తెలిపిన సంఘటన ఎంతో మహత్తరం, మహిమాన్వితం.

తిరుమలనంబి ఆదేశానుసారము శ్రీరామానుజులు తిరుమలకు వచ్చి మూడురోజులు స్వామివారిని సేవించి తిరుపతిలోని అలిపిరి సమీపంలో నివసించారు. ప్రతినిత్యము శ్రీవేంకటేశుని ప్రభాత కైంకర్యములు చేసి నంబి తిరుమలనుండి క్రిందికి దిగివచ్చి శ్రీరామానుజులవారికి శ్రీరామాయణమును సంవత్సరం పాటు బోధించారు. చెప్పిన అర్థం తిరిగి చెప్పకుండా 18మార్లు రామాయణరహస్యాలు వివరించారు. ఆ సమయంలో మధ్యాహ్నసమయంలో శ్రీనివాసునికి కైంకర్యము చేయలేకపోతున్నందుకు చింతిస్తున్న నంబికి స్వామి ప్రత్యక్షమై తనపాదాలను అలిపిరివద్ద ప్రసాదించి సేవించమని అనుగ్రహించారు. అవే భక్తులు అలిపిరి వద్ద కొలిచే శ్రీవారి పాదములు.

ఇన్ని విశేషములతో తన యావజ్జీవితము శ్రీనివాసుని సేవలో తరించిన తిరుమలనంబి స్వామివారి ప్రథమ కైంకర్యములు చేసిన భక్తవరేణ్యుడు. అన్నమాచార్యులవారు 'కొండలలో నెలకొన్న కోనేటిరాయడువాడు' అనే కీర్తనలో **'మచ్చిక దొలక తిరుమలనంబి తోడుత నిచ్చ నిచ్చ మాట లాడి నచ్చినవాడు'** అని ప్రస్తావించాడు.

ఈనాటికీ వేలాదిమంది భక్తులు తిరుమల కొండలు కాలినడకన ఎక్కి మొక్కులు తీర్చుకోవడం- అలిపిరి వద్ద శ్రీనివాసుని పాదాలకు నిత్యహారతులు ఇవ్వడం, గోవింద నామస్మరణతో తిరుమల మారుమ్రోగడం - నిత్య సత్య వైభవాలుగా భాసిస్తున్నాయి.

చిరస్మరణీయుడు, ప్రాతస్మరణీయునిగా తిరుమలనంబి శ్రీవేంకటేశుని భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నాడు.



## తిరుమలనంబి తీర్థకైంకర్యము

తిరుమలనంబి తిరుమల శ్రీనివాసునికి నిత్యము చాలా దూరము ప్రయాణించి, మట్టికుండలో ఆకాశగంగ నుండి అభిషేక జలం తెచ్చి స్వామివారికి ప్రథమ తీర్థ కైంకర్యము చేసేవారు. ఆ సేవకు శ్రీనివాసుడు ఎంతో సంతోషించేవాడు. తిరుమలనంబి కైంకర్యాన్ని లోకానికి తెలియచేసే ఉద్దేశ్యంతో, కిరాతుని రూపంలో ధనుర్బాణాలు ధరించి తిరుమలనంబితో "తనకు దాహం వేస్తున్నది, కొంత జలమివ్వమని" అడిగాడు. దానికి తిరుమలనంబి నిరాకరించగా, స్వామి వాని వెంటే వెళ్ళారు. అనంతరం బాణంతో కుండకు చిల్లు చేసారు. జలం త్రాగడం నంబి చూశాక, నంబి తన కైంకర్యమునకు భంగం కలిగిందని ఎంతో వ్యథ చెందాడు.

కిరాతక రూపంలో ఉన్న శ్రీనివాసుడు నంబితో 'ఇచ్చటికి దగ్గరలోనే జలమున్నదని తన బాణంతో ఒక కొండను తాకగానే విశేషమైన జలధార రావడం- ఇక ముందు ఈ నీటితోనే తనకు అభిషేకము చేయమని' చెప్తూతూ అంతర్ధానమయ్యాడు. ఆ కిరాతుడే తన స్వామి యని తెలుసుకొని పరవశించిపోయాడు ఆ మహాభక్తుడు నంబి.

ఆనాటినుండి ఆకాశగంగ తీర్థంతోనే స్వామివారి కైంకర్యము తిరుమలలో జరుగుతున్నది. ఆ రోజును **'ఆకాశగంగా తీర్థోత్సవం', 'తన్నీరముదు ఉత్సవం', 'అమృత జలోత్సవం'** అనే పేర్లతో ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందుగా ప్రారంభమయి, వైకుంఠ ఏకాదశి తర్వాత 14 రోజులు-మొత్తం 25 రోజులు జరుగుతుంది. ఈ సమయంలో శ్రీవారి అధ్యయనోత్సవం, తిరుమల నంబి తిరుమంజనోత్సవం నిర్వహిస్తారు. సాక్షాత్తు శ్రీనివాసునిచే 'తాత' అని పిలువబడిన తిరుమలనంబి ధన్యుడు.

## తిరుమలనంబి ఇతరకైంకర్యములు

తిరుమలనంబి స్వామివారికి అనేక కైంకర్యములు చేసేవారు. వాటిలో ముఖ్యమైనవి తోమాలసేవ, తిరుమంజన కైంకర్యం, ఆకాశగంగ తీర్థకైంకర్యం, శాత్తుమొఱై, మంత్ర పుష్పకైంకర్యం, వేదపారాయణం మొదలైనవి. నేటికీ ఈ కైంకర్యములు తిరుమలనంబి వంశీయులు నిత్యమూ స్వామి వారికి భక్తిప్రపత్తులతో చేస్తూనే ఉన్నారు. చారిత్రకాధారములు వలన తిరుమలనంబి తిరుమల దక్షిణమాఢవీథిలో నివసించి నిత్యం కైంకర్యములు చేసేవారని తెలియుచున్నది. నేటికీ స్వామివారి నిత్య ఊరేగింపు దక్షిణవీథిలోని తిరుమల నంబి ఆలయంవద్ద ప్రథమహారతిని అందుకొని ప్రారంభమవుతుంది.





# ఆళ్వార్ తిరువడిగళే శరణమ్...

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు



**శ్రీవైష్ణవసంప్రదాయంలో పన్నిద్దరాళ్వారులలో మొదటిముగ్గురు ఆళ్వారులను యోగిత్రయం (లేదా) మొదలాళ్వారులని పిలుస్తారు. వీరు పొయ్‌గై ఆళ్వార్ (సరోయోగి), పూదత్తాళ్వారు (భూతయోగి), పేయాళ్వారు (మహాయోగి).**

**ఈ మాసంలో యోగిత్రయంలో రెండవ, మూడవ ఆళ్వారులైన పూదత్తాళ్వారు, పేయాళ్వార్ల వర్షతిరునక్షత్రం వచ్చినందున వారిని గురించి తెలుసుకుందాం.**



## పూదత్తాళ్వారు (భూతయోగి)

**భూతం నమామి యో విష్ణోః జ్ఞానదీప మకల్పయత్।**
**వందే భూతాఖ్యయోగీంద్రం వరేణ్య గుణసంపదమ్॥**

శ్రీమన్నారాయణుని మంగళాశాసనం చేయడానికి జ్ఞానాన్నే దీపంగా చేసినట్టి, శ్రేష్ఠగుణయుక్తులయిన భూతాఖ్య యోగీంద్రులకు నమస్కారం.

శ్రీహరి కౌమోదకి గదాంశాన పూదత్తాళ్వారు జన్మించారు. వీరు మొదటి ఆళ్వారులలో రెండవవారు. పొయ్‌గై ఆళ్వారు పుట్టిన మరునాడే వీరు మహాబలిపురంలో అవతరించారు. ద్రావిడభాషలో మహాబలిపురాన్ని 'తిరుక్కడల్ మలై' అంటారు. ఇది బంగాళాఖాతసముద్రతీరాన ఉంది. పూదత్తాళ్వారు మాధవీ కుసుమం (బండి గురువింద పువ్వు) నుండి పుట్టారు.

సిద్ధార్థి నామసంవత్సరం, చాంద్రమాన ఆశ్వయుజం, శుక్ల పక్ష నవమీ తిథి, ధనిష్ఠా నక్షత్రం రోజున వీరు అవతరించారు. విష్వక్సేనుల వారు వీరికి ఆచార్యులు.

'పూతం' అంటే యథార్థం, పవిత్రం, ఆత్మ అని అర్థం. వీరు జ్ఞానాధికులయిన సర్వేశ్వరునికి ఆత్మగా విరాజిల్లారు. అందువల్ల పూదత్తాళ్వారుగా ప్రసిద్ధి పొందారు. వీరు బ్రహ్మముద్ర కలవారు. వీరు రచించిన దివ్యప్రబంధం "ఇరండాం తిరువన్దాది". ఇందులో నూరుపాశురాలు- ఉన్నాయి.

పూదత్తాళ్వారు అనుగ్రహించిన 'ఇరండాం తిరువన్దాది' దివ్యప్రబంధంలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు 13. ఆ వివరాలు సంక్షిప్తంగా- 1)తిరువరంగం, 2)తంజమామణిక్కోయిల్, 3)తిరుక్కుడన్దై, 4) తిరుమాలిరుంజోలై, 5)తిరుక్కోట్టియూర్, 6)తిరుత్తణ్ గాల్, 7)తిరుక్కోవలూర్, 8)తిరుక్కచ్చి, 9)తిరుప్పాడగం, 10)తిరునీర్ మలై, 11)తిరుక్కడల్ మలై, 12)తిరుమల, 13)తిరుపార్ కడల్.

పూదత్తాళ్వారు తిరుమలవేంకటేశుని 11 పాశురాలలో మంగళాశాసనం చేస్తూ ఒక పాశురంలో ఇలా చెప్పారు- 'పరమపదంలో నిత్యసూరులచే నిత్యం స్తుతించబడే పరవాసుదేవుడు- త్రేతాయుగంలో శ్రీరామచంద్రమూర్తిగా అవతరించి,

సాధుజనాలను కాపాడడానికై రావణాసురుణ్ణి సంహరించాడు. ఆ పరాత్పరుడే కలియుగాన నిఖిల ప్రాణులను కాపాడడం కోసం, చాలా ఎత్తైన ఎదురు పొదలు కలిగి చల్లగా ఉండే చరియలతో గూడి పరమభోగ్యమైన శ్రీవేంకటాచలంలో విజయం చేసి ఉన్నారు.' అని ప్రస్తుతించారు.

## పేయాళ్వారు (మహాయోగి)

పద్మారమణపాదాబ్జ ప్రేమభ్రాంత్యా మనోజ్ఞయా।
భ్రాంతయో గీతి విఖ్యాతం మునిం వందే గుణాంబుధిమ్॥

శ్రియఃపతిపాదారవిందాలమీద ఉండే ప్రీతివల్ల కలిగిన భ్రాంతిచే భ్రాంతయోగి అనే వినుతిని గడించిన సుగుణఖని అయిన పేయాళ్వార్లకు నమస్కరిస్తున్నాను.

శ్రీహరి నందకఖడ్గాంశాన పేయాళ్వారు అవతరించారు. మొదలాళ్వారులలో వీరు మూడవవారు. పూదత్తాళ్వారు పుట్టిన మరునాడే వీరూ పుట్టారు. వీరు (నేటి చెన్నైలోని మైలాపూర్) మయూరనగరంలో మణికైరవం అనే బావిలోని ఎఱ్ఱకలువల నుండి అవతరించారు. సిద్ధార్థి నామ సంవత్సర చాంద్రమాన ఆశ్వయుజ శుక్లపక్ష దశమి శతభిషా నక్షత్రాన వీరు అవతరించారు. 'పేయ్' అంటే పిచ్చి, భ్రాంతి అని అర్థం, భగవంతుని యందే మనస్సు కలిగి పేయ్ / పిచ్చిగా తిరుగుతూ ఉండడంచేత వీరు పేయాళ్వారుగా ప్రాచుర్యం పొందారు. వీరు రచించిన దివ్యప్రబంధం పేరు "మూన్రాం తిరువన్దాది". ఇందులో నూరు పాశురాలు ఉన్నాయి.



పేయాళ్వారు అనుగ్రహించిన 'మూన్రాం తిరువన్దాది' దివ్యప్రబంధంలో మంగళాశాసనం చేసిన దివ్యతిరుపతులు 15. ఆ వివరాలు సంక్షిప్తంగా – 1)తిరువరంగం 2)తిరుక్కుడన్తై 3)తిరువిణ్ణగరం 4)తిరుక్కోట్టియూర్, 5) తిరుక్కచ్చి, 6)అష్టభుజం, 7)వేళుక్కై 9)తిరుఊరగం, 10) తిరువెజకా, 11)తిరువెల్లిక్కేణి, 12)తిరుఘటికై, 13) తిరువేంగడం, 14)తిరుప్పార్ కడల్, 15)పరమపదం.

తిరుమలలో వేంచేసి ఉన్న వరాహస్వామివారిని పేయాళ్వారు 10 పాశురాలలో మంగళాశాసనం చేశారు. అందులో మచ్చునకు ఒక పాశురభావం –

'మదపుటేనుగులు–అనురూపంగా ఉండే ఆడ ఏనుగులతో సంశ్లేషించి, ప్రణయ కలహంతో అటు ఇటు తిరుగుతుంటాయి. స్వచ్ఛమైన రాళ్లలో తమ ప్రతిబింబాలను చూసి వేరే ఏనుగులని భావిస్తుంటాయి కొన్ని ఏనుగులు. వాటి దంతాలలోని ముత్యాలు వేంకటాద్రిపై రాలిపడుతుంటాయి. ఆ శ్రీవేంకటాచలమే పూర్వం తనకొమ్ములతో జలార్ణవంనుంచి భూమిని ఉద్ధరించిన శ్రీవరాహస్వామి వేంచేసి ఉండే దివ్య పర్వతం.' అని కీర్తించారు.

ఈ విధంగా పూదత్తాళ్వారు, పేయాళ్వారులు తమ పాశురాలలో శ్రీవారిని కీర్తించి, స్మరించినటువంటి ఆచార్యులను సేవించి తరిద్దాం.

*ఆళ్వార్ తిరువడిగలే శరణమ్.*



ఉత్సాహాన్ని మించిన బలము లేదు


# ఆచార్యశేఖరులు మణవాళమహాములు

– డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీవైష్ణవ సంప్రదాయంలోని "తెంగలై"శాఖకు చెందిన పూర్వాచార్యుల పరంపరలో మణవాళమహామునులు చివరి వారు, మొదటి వారు కూడా. కాలాన్ని బట్టి వీరు చివరివారుగా పరిగణింపబడుతున్నా, లక్ష్మీనాథుడైన శ్రీరంగ నాథునకు కూడా ఆచార్యులైనందున ఈ ఆచార్యశేఖరులు ఆచార్య పరంపరలో మొదటి స్థానాన్ని అలంకరిస్తున్నారు. తెంగలై సంప్రదాయానికి చెందినవారంతా గురు పరంపరను స్మరించేటపుడు మొదటగా మణవాళమహామునులస్తుతి శ్లోకమైన **"శ్రీశైలేశ దయాపాత్రమ్"** ఇత్యాది తనియన్‌ను పఠించడం దీనిని తెలుపుతున్నది.


మణవాళమహామునులు అవతరించి ఇప్పటికి 650 సంవత్సరాలు పూర్తి కావస్తున్నది. వీరు ఆళ్వార్ తిరునగరిలో (నమ్మాళ్వార్ల జన్మస్థలంలో) క్రీ.శ. 1370వ సంవత్సరంలో సాధారణనామ సంవత్సరం అల్పి (ఆశ్వయుజ) మాసంలోని మూలానక్షత్రంలో జన్మించారు. వీరు బాల్యంలో "శిక్కిల్ కడారమ్" అనే ఊరిలో మేనమామగారి వద్ద పెరిగారు. వీరి జన్మనామం (పుట్టినప్పుడు పెట్టిన పేరు) "అళకియమణ వాళప్పెరుమాళ్ నాయనార్". వీరు సన్న్యాసాశ్రమం స్వీక రించిన తరువాత కూడా ఈ నామంతోనే "అళకియమణవాళ మాముని" అని వ్యవహరింపబడ్డారు. మేనమామ వద్ద బాల్యంలో సకలశాస్త్రాలను అభ్యసించారు. వీరి తండ్రి పేరు జిహ్వావధీశదాసులు. ద్రావిడభాషలో "తిరునావీఱుడైయ పిరాన్" అని పేరు. వీరి వద్దనే మణవాళమహామునులు బ్రహ్మోపదేశాన్ని పొందారు.

తండ్రి పరమపదించిన తరువాత మణవాళమహా మునులు ఆళ్వార్ తిరునగరిలో ద్రావిడ వేదాంతంలో విశేష మైన పాండిత్యాన్ని కల తిరువాయ్ మొళిప్పిళ్ళై అనే ఆచా ర్యులు వద్దకు వెళ్లి, వారిదగ్గర ద్రావిడ వేదాంత (ఆళ్వారుల ప్రబంధాల) వ్యాఖ్యానాలను, వాటిలోని రహస్యాలను గ్రహించారు. ప్రత్యేకించి "తిరువాయ్ మొళి" ప్రబంధా నికి కల విస్తృతమైన వ్యాఖ్యానాన్ని వారి దగ్గర తెలుసు కొన్నారు. తిరువాయ్ మొళిప్పిళ్ళై వీరి పాండిత్యాన్ని, మేధా విలాసాన్ని చూచి, తమకు తరువాత మణవాళమహామునులే శ్రీవైష్ణవ నిర్వాహకులు కాగలరని ఆశీర్వదించారు. తమ ఆచార్యులైన పిళ్ళై దగ్గర ఉండే గౌరవాతిశయం వల్ల, వారి ఆజ్ఞవల్ల మణవాళమహామునులు ఆళ్వార్ తిరునగరిలోని "శ్రీరామానుజ చతుర్వేది మంగళమ్" అనే అగ్రహారంలో వేంచేసి ఉండే భగవద్రామానుజులనే సర్వస్వంగా భావించి,



వారిని స్తుతిస్తూ **'యతిరాజవింశతి'** అనే స్తోత్రాన్ని రచించారు. వీరికి గల యతిరాజ ప్రావీణ్యంవల్ల **"యతీంద్ర ప్రవీణు"** లనే పేరు వీరికి ప్రసిద్ధమైనది. అంతేకాక, శ్రీమణవాళ మహామునులు ఆదిశేషుల అంశలో అవతరించారనీ, భగవద్రామానుజులే మళ్లీ ఈ రూపంలో అవతరించారని సంప్రదాయ విశ్వాసం. అందువల్ల వీరికి "యతివరపునరవతారభూతులు" అనే ప్రసిద్ధి వచ్చింది. శ్రీరంగంలో నివసిస్తూ సంప్రదాయసేవచేసిన మణవాళమహామునులకు ఎంతో మంది శిష్యులున్నా, వారిలో ముఖ్యులైన ఎనిమిది మంది గొప్ప పండితులు "అష్టదిగ్గజాల"నే పేరుతో కీర్తింపబడ్డారు.

శ్రీమణవాళ మహామునులు తమిళంలో, సంస్కృతంలో ఎన్నో గ్రంథాలను, వ్యాఖ్యానాలను రచించారు. ఉపదేశ రత్తిన మాలై, ఆర్తిప్రబంధం, తిరువాయ్ మొళి నూత్తందాది మొదలైన ద్రావిడకృతులను, యతిరాజ వింశతి, భగవద్గీతకు ప్రతిపదార్థరూపమైన వివరణము మొదలైన సంస్కృత కృతులను, ముముక్షుప్పడి, తత్త్వ త్రయం, శ్రీవచనభూషణం, ఆచార్యహృదయం మొదలైన రహస్యగ్రంథాలకు వ్యాఖ్యానాలు రచించారు. వీరి వ్యాఖ్యాన క్రమంలోని వైలక్షణ్యాన్ని బట్టి వీరికి "విశదవాన్ శిఖామణి" అనే బిరుదు వచ్చింది.



మీరు ఎంత గొప్ప విద్వాంసులో, అంత గొప్ప ఆత్మగుణపూర్ణులు. అజాతశత్రువు అనదగినవారు. ఎవరినీ నొప్పించేరీతిలో వీరు ఎక్కడా పలుకరు, అభిప్రాయ భేదం వ్యక్తంచేసేటపుడు కూడా చాలా మృదువుగా, ఇతరుల నొప్పించని రీతిలో వీరి రచనా శైలి ఉంటుంది. తమ చివరిదశలో కూడా 'ఆచార్యహృదయమనే' గ్రంథానికి వ్యాఖ్యానాన్ని రచించి, అనంతరకాలం వారికి తమజ్ఞానాన్ని వితరణ చేసిన మహోదారులు వీరు. మణవాళమహామునుల వద్ద శ్రీరంగనాథుడు 'తిరువాయ్ మొళి' వ్యాఖ్యానాన్ని, తన ఆలయంలో జరిగే అన్ని ఉత్సవాలను నిలిపి, విన్నాడని, చివరినాడు గురు దక్షిణగా మణవాళ మహామునుల గొప్పతనాన్ని తెలిపే "శ్రీశైలేశ దయాపాత్రమ్" అనే శ్లోకాన్ని అయిదేండ్ల బాలుని రూపంలో వచ్చి, అందరి ముందు పఠించి, అదృశ్యమయ్యాడని పెద్దలంటారు. అందువల్ల, ప్రథమాచార్యుడైన శ్రీరంగనాథునకు కూడా ఆచార్యులైన గొప్పతనం శ్రీమణవాళమహామునులకే ఉన్నది. ఈ మహనీయులు జన్మించి 650సంవత్సరాలు పూర్తి అయ్యే ఈ సందర్భంలో వీరు చూపిన మార్గాన్ని, వీరి రచనలను, వీరి మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని సంస్మరించుకోవడం అత్యంతం సముచితం.

"యతీంద్ర ప్రవణం వందే
రమ్య జామాతరం మునిమ్"


తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల

## శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవం

2020 అక్టోబరు 16 నుండి 24 వరకు

**17-10-2020**
**శనివారం**



పగలు:
చిన్నశేషవాహనం




రాత్రి:
హంసవాహనం

**18-10-2020**
**ఆదివారం**



పగలు:
సింహవాహనం




రాత్రి:
ముత్యపుపందిరివాహనం

తిరుమల

## శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవం


2020 అక్టోబరు 16 నుండి 24 వరకు



**19-10-2020**
**సోమవారం**

**పగలు:**
**కల్పవృక్షవాహనం**

**రాత్రి:**
**సర్వభూపాలవాహనం**






**20-10-2020**
**మంగళవారం**

**పగలు:**
**పల్లకీలో**
**మోహినీఅవతారోత్సవం**

**రాత్రి:**
**గరుడవాహనం**



## తిరుమల
# శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవం
### 2020 అక్టోబరు 16 నుండి 24 వరకు

**21-10-2020**
**బుధవారం**



పగలు:
హనుమద్వాహనం




రాత్రి:
గజవాహనం

**22-10-2020**
**గురువారం**



పగలు:
సూర్యప్రభవాహనం



రాత్రి:
చంద్రప్రభవాహనం






శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్. గారి నుండి
04-10-2020 తేదీన
తి.తి.దే. పూర్తి అదనపు కార్యనిర్వహణాధికారిగా
తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న
శ్రీ ఆకేపాటి వెంకటధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. గారు



శ్రీ ఆకేపాటి వెంకటధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. గారి నుండి
10-10-2020 తేదీన
తి.తి.దే. నూతన కార్యనిర్వహణాధికారిగా
తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గారు

# శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయం
## తిరుచానూరు

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం



'తిరుచానూరు' ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రాన్ని 'మంగపట్నం' అనీ, 'పద్మావతిమందిరం' అనీ, 'శ్రీశుకపురం' అని చెప్పబడింది. కాలగమనంలో శ్రీశుకపురమే 'తిరుచ్చుకపురం'గా 'తిరుచ్చుకనూరు'గా, 'తిరుచానూరు'గా పిలువబడిన ఈ క్షేత్రం తిరుపతి పట్టణానికి ఆగ్నేయ దిశగా 3 మైళ్ల దూరంలో ఉంది. ఈ క్షేత్రాన్ని దర్శిద్దాం.. రండి....!!

### శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం

ప్రధానంగా శ్రీపద్మావతి అమ్మవారి ఆలయాన్ని ఊంజల్ మండపం, ధ్వజస్తంభమండపం, ముఖమండపం, అర్ధమండపం, అంతరాళం, గర్భాలయం అని ఆరుభాగాలుగా పరిశీలించవచ్చు.

### ఆశీర్వాదమండపం

ధ్వజస్తంభమండపానికి తూర్పున సుమారు 4 అడుగుల ఎత్తైన రాతి అధిష్ఠానంపై నిర్మింపబడిన 16 రాతి స్తంభాల మండపమే 'ఊంజల్ మండపం'. పూర్వం, ఈ మండపం మధ్యలో వున్న వేదికలో అలమేలుమంగమ్మకు డోలోత్సవం జరుపబడేది. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం కొలువు మేళాలు (భజంత్రీ) వాయింపబడుతున్నాయి.

ఇంకా, ప్రముఖులు అమ్మవారి దర్శనానంతరం ఈ మండపంలో కూర్చుని తీర్థప్రసాదాలను ఆశీర్వాదాన్ని స్వీకరిస్తుంటారు.

### ధ్వజస్తంభమండపం

ఒక వరుసకు ఆరుస్తంభాల వంతున ఆరు వరుసలతో మొత్తం 36 రాతిస్తంభాల ఎత్తైన మండపం మధ్యలో బంగారు బలిపీఠం, దానికి పశ్చిమంగా ఆనుకొని ఉన్న బంగారుధ్వజస్తంభం ఉండడంచేత ఈ మండపం ధ్వజస్తంభ మండపం అని పిలువబడుతున్నది. అమ్మవారికి నివేదనలు జరిగిన మూడుపూటల చివర్లో ఆలయాన్ని అంటి పెట్టుకొన్న భూతగణాలకు శుద్ధాన్నం బలిగా ఈ పీఠంపైన సమర్పింపబడుతుంది. కనుక ఇది బలిపీఠం. దీనికి ఆనుకొని ఎత్తైన బంగారు ధ్వజస్తంభం ఉంది. అమ్మవారికి ఎదురుగా ఈ స్తంభంలో కింది భాగంలో పశ్చిమాభిముఖంగా గజవాహనం, ఉత్తరదక్షిణ వైపున శంఖచక్రాలు, తూర్పుముఖంగా శ్రీపద్మావతి అమ్మవారి ప్రతిమ ఇలా నలువైపులా ఈ ధ్వజస్తంభంపై ప్రతిష్ఠింపబడినాయి. ప్రతిసంవత్సరం కార్తికమాసంలో వైభవంగా జరిగే బ్రహ్మోత్సవ ప్రారంభంలో ఈ బంగారు ధ్వజస్తంభంపైన గజపతాకం ఎగుర వేయబడుతుంది. బ్రహ్మోత్సవానంతరం చివర్లో, ఈ ధ్వజం అవరోహణ జరుపబడుతుంది.

### కల్యాణోత్సవమండపం

అమ్మవారి ధ్వజస్తంభమండపానికి దక్షిణంగా, శ్రీబలరామకృష్ణస్వామి ఆలయానికి ముందు భాగంలో వున్న కల్యాణమండపంలో శ్రీపద్మావతీ శ్రీనివాసులకు ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుంది.

### ముఖమండపం

శ్రీపద్మావతిఅమ్మవారి ప్రధాన ఆలయానికి ముందు భాగంలో చుట్టూ ఇనుపకటాంజనంతో మధ్యలో నాలుగుస్తంభాల మధ్యలో ఎత్తైన రాతి వేదికతో విరాజిల్లుతున్న మండపమే ముఖమండపం. శ్రీపద్మావతి అమ్మవారికి ఈ మండపంలో ఆస్థానాలు, కొలువులు జరుగుతుంటాయి.





**అర్ధమండపం-** ముఖమండపందాటి లోనికి వెళితే ఉండేదే అర్ధమండపం. ఇది గర్భాలయానికి ప్రదక్షిణా మండపంగా కూడ ఉపయోగపడుతున్నది. ఈ అర్ధమండపంలో గర్భాలయానికి ముందుభాగంలో దక్షిణవారకు ఉత్తరాభిముఖంగా ఉన్న రాతి అరలో సుదర్శన భగవానుని, విష్వక్సేనులవారి పంచలోహవిగ్రహాలు ఉన్నాయి. వీటితో పాటు విష్వక్సేనులవారు, గరుత్మంతులవారి శిలావిగ్రహాలు ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. అలాగే ఉత్తరం వారకు దక్షిణాభిముఖంగావున్న రాతి అరలో శ్రీభగవద్రామానుజులవారి శిలామూర్తితో పాటు, పంచలోహమూర్తి కూడ ప్రతిష్ఠింపబడివున్నాయి.

**అంతరాళం-** అర్ధమండపం దాటి లోనికి వెళితే ఉండే మండపమే అంతరాళం. ఈ అంతరాళంలో ప్రవేశించే ద్వారాన్ని ఇరువైపులా ఉండే అమ్మవారి సేవికలు 'వనమాలిని, బలాకిని' కాపలా కాస్తుంటారు. ఈ అంతరాళంలో శ్రీపద్మావతి అమ్మవారి పంచలోహ ఉత్సవమూర్తితో పాటు శ్రీపద్మావతి శ్రీనివాసుల భోగమూర్తుల విగ్రహాలు కూడ చోటుచేసుకున్నాయి.

**గర్భాలయం-** అంతరాళం దాటిన తర్వాత గర్భాలయం మధ్యలో పద్మపీఠంపై, కూర్చొన్న భంగిమలో శ్రీపద్మావతి అమ్మవారి శిలామూర్తి ప్రతిష్ఠింపబడింది.

చతుర్భుజి అయిన అమ్మవారికి పై రెండు చేతుల్లో పద్మాలు ఉన్నాయి. క్రింది కుడి, ఎడమచేతులు వరుసగా అభయ, వరద ముద్రలు కలిగి దర్శనమిస్తున్నది.

'అలమేలుమంగ' అని పిలువబడుతున్న పద్మావతి అమ్మవారిమూలమూర్తికి ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, సహస్రనామార్చన అనే కుంకుమార్చన, నివేదన చేస్తారు. భక్తులు సర్వదర్శనవేళల్లో కూడ ఈ తల్లికి 'కుంకుమార్చన' నిర్వహించుకోవచ్చు.

ఇదిగాక ప్రతిసోమవారం 'అష్టదళపాదపద్మారాధన', ప్రతి గురువారం 'తిరుప్పావడ సేవ' ప్రతి శుక్రవారం 'అభిషేకం' ప్రతి శనివారం 'పుష్పాంజలి' సేవ అమ్మవారి మూలమూర్తికి నిర్వహింపబడతాయి.

**శాంతినిలయవిమానం-**

శ్రీపద్మావతి అమ్మవారి గర్భాలయంపైన "శాంతినిలయవిమానం" అనే పేరుతో బంగారు కవచంతో ఏకకలశగోపురం నిర్మింపబడింది. ఈ బంగారు విమానంపైన అష్టలక్ష్ముల విగ్రహమూర్తులు అష్టదిక్కుల్లో ప్రతిష్ఠింపబడినందువల్ల ఈ అష్టలక్ష్ముల సమన్వయసమాహార రూపమే ఈ అలమేలుమంగ! అన్ని కోరికలను తీర్చగల సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి! అని స్పష్టమవుతున్నది.

విశేషంగా శాంతినిలయ విమానంమీద వాయవ్యమూలలో విలసిల్లే "విమానలక్ష్మి"గా కూడ దర్శనమిస్తున్నది అలమేలుమంగ! ఈ శాంతినిలయం మీది "విమానపద్మావతి" తిరుమలకొండవైపు చూస్తున్నట్లుగా



దర్శనమిస్తూ శ్రీనివాసుని స్మరింపజేస్తుంది. శ్రీపద్మావతి అమ్మవారికి పాంచరాత్రాగమం ప్రకారంగా ఏడాది పొడవునా నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలు ఎన్నెన్నో వైభవంగా జరుపబడుతుంటాయి. తిరుమల యాత్రికులతో, భక్తులతో శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం కోలాహలంగా.. సందడిగా... అలరారుతూ... ఉంటుంది.

**శ్రీపద్మావతి అమ్మవారి ఉత్సవాలు-** దివ్యక్షేత్రమైన తిరుచానూరులో పవిత్రమైన పద్మసరోవర పుణ్యజలాల నుండి బంగారు సహస్రపద్మంలో ఆవిర్భవించిన అలమేలు మంగమ్మకు పద్మావతి అనే పేరుతో పాటుగా "స్వతంత్ర వీరలక్ష్మి" అనే మరో పేరు ప్రసిద్ధంగా ఉంది.

తిరుమల స్వామివారికి వైఖానసాగమశాస్త్ర రీతిగ స్వతంత్రంగా షట్కాలార్చనలు ఉత్సవాలు, ఊరేగింపులు జరుగుతున్నట్లుగా, తిరుచానూరులో శ్రీమహారాజ్ఞి అయిన పద్మావతి అమ్మవారికి పాంచరాత్రాగమ శాస్త్రరీతిగా "స్వతంత్ర వీరలక్ష్మ్యారాధన" పేరుతో నిత్యారాధనలు, ఉత్స వాలు, ఊరేగింపులు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీనివాసుని పట్టపురాణి అయిన పద్మావతికి తిరుమలేశుని మాదిరిగానే స్వతంత్రంగా జరుగుతున్న సేవలను క్లుప్తంగా జరిగే విధానాన్ని తెలుసుకుందాం.

**నిత్యోత్సవాలు-** ప్రతిరోజు విధిగా జరిగే ఉత్సవాలను నిత్యోత్సవాలు అంటారు. ప్రతిరోజు ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై వరుసగా శ్రీపద్మావతి అమ్మవారి మూల మూర్తికి సహస్ర నామార్చన, జరిగిన తర్వాత- నివేదన జరుగుతుంది.



"పద్మావతి పరిణయం" పేరుతో శ్రీపద్మావతీ శ్రీని వాసులకు నిత్యకల్యాణోత్సవం, ప్రతి సాయంత్రం అమ్మవారికి డోలోత్సవం (ఊంజల్ సేవ) జరుగుతవి. రాత్రి "ఏకాంత సేవ"తో ఆలయ కార్యక్రమం పూర్తి అవుతుంది. సర్వదర్శన వేళల్లో భక్తులు అమ్మవారి మూలమూర్తికి కుంకుమార్చన చేయించుకోవచ్చు.

**వారోత్సవాలు -** వారానికి ఒక రోజు ప్రత్యేకమైన ఉత్సవం విధిగా జరుగుతుంది. ఈ సేవల్లో భక్తులు నిర్ణీత ఆర్జిత రుసుమును చెల్లించి పాల్గొనవచ్చు. సోమవారం- అష్టదళ పాదపద్మారాధన, గురువారం- తిరుప్పావడ (అన్నకూటో త్సవం) మూలమూర్తికి జరుగుతుంది.

**అభిషేకం-** శుక్రవారం-అమ్మవారి మూలమూర్తికి అభిషేకం నిర్వహింపబడుతుంది.

**లక్ష్మీపూజ-** ప్రతి శుక్రవారం కల్యాణోత్సవానికి ముందుగా కల్యాణమండపంలో "లక్ష్మీపూజ" జరుగుతుంది.



**తోట ఉత్సవం-** ప్రతి శుక్ర వారంనాడు నిత్యకల్యాణం తర్వాత అమ్మవారు గుడికి దక్షిణ దిక్కులో ఉన్న శుక్రవారపు తోటకు వెళ్లిన తర్వాత, మధ్యాహ్నం 3 గంటల వేళలో ఆ తోటలో పసుపు, చందనం మున్నగు ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది. ఈ అభి షేకాన్ని భక్తులు అందరూ దర్శించవచ్చు.

**ఊంజల్ సేవ-** ప్రతిరోజు అస్థానమండపంలో ఊంజల్‌సేవ జరుగుతుంది. ఈ సేవ జరిగిన తర్వాత ప్రతి శుక్రవారం మాత్రమే ఊరేగింపుగా గ్రామోత్సవం జరుగుతుంది,

**పుష్పాంజలి సేవ-** ప్రతి శనివారం ఉదయం 6.30 గం॥లకు పుష్పాంజలి సేవగా పద్మాలతో మూలమూర్తికి పుష్పార్చన జరుగుతుంది.

**నక్షత్రోత్సవాలు-** ప్రతినెలా ఉత్తరాషాఢ, ఏకాదశి రోజుల్లో అమ్మవారి ఉత్సవమూర్తికి ఏకాంతంగా అభిషేకం జరుగు తుంది. ఉత్తరాషాఢానక్షత్రం రోజు సాయంత్రం శ్రీపద్మావతి అమ్మవారికి గజవాహనోత్సవం జరుపబడుతుంది.

**సంవత్సరోత్సవాలు-** ప్రతి సంవత్సరం ఉగాది రోజున ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆలయ ముఖమండపంలో ఉగాది ఆస్థానంరోజున పంచాంగశ్రవణం జరుగుతుంది.

**వసంతోత్సవాలు-** వైశాఖమాసం పూర్ణిమకు, మూడు రోజులపాటు అమ్మవారికి వసంతోత్సవాలు జరుగుతాయి. చివరిరోజు పున్నమిరోజున స్వర్ణరథోత్సవం జరుగుతుంది.

**తెప్పోత్సవాలు-** జ్యేష్ఠమాసం పూర్ణిమకు పూర్తయ్యేట్లుగా ఐదు రోజులపాటు తెప్పోత్సవాలు జరుగుతాయి.



మొదటిరోజున ఏకాదశినాడు శ్రీకృష్ణస్వామికి, రెండవ రోజు ద్వాదశిరోజున శ్రీసుందరరాజస్వామికి చివరి మూడు రోజులు శ్రీపద్మావతి అమ్మవారికి పద్మపుష్కరిణిలో తెప్పోత్సవాలు జరుగుతాయి.

**పవిత్రోత్సవాలు-** ప్రతి సంవత్సరం భాద్రపద మాసం పున్నమనాటికి పూర్తి అయ్యేట్లుగా 3 రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతాయి.



**బ్రహ్మోత్సవాలు-** ప్రతి సంవత్సరం కార్తిక శుద్ధ పంచమికి పూర్తగునట్లు, పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతుంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో మహారాజ్ఞి అయిన పద్మావతి అమ్మవారికి మాత్రమే వాహనసేవలు జరుగుతాయి. చివరిరోజున పంచమి





రోజున పద్మసరోవరంలో వేలాదిమంది భక్తులమధ్య జరిగే పంచమి తీర్థవేడుకలతో బ్రహ్మోత్సవాలు పూర్తి అవుతాయి

**లక్షకుంకుమార్చన -** బ్రహ్మోత్సవాలు ప్రారంభమగుటకు ముందు రోజున పద్మావతి అమ్మవారికి లక్షకుంకుమార్చన సేవ జరుగుతుంది.

**పుష్పయాగం -** బ్రహ్మోత్సవాలు పూర్తి అయిన మరునాడు శ్రవణనక్షత్రం రోజున ఆలయంలోనే శ్రీపద్మావతి అమ్మవారికి వివిధరకాల సుగంధ పుష్పాలతో "పుష్పయాగం" ఘనంగా జరుగుతుంది.

**తైమాసంలో ప్రత్యేకపూజలు -** ప్రతి సంవత్సరం పుష్య మాసంలో (అరవనెల తైమాసంలో) ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా, అమ్మవారికి పూజలు జరుగుతాయి. సుమంగళులకు పసుపుదారాలు ప్రసాదంగా పంచబడతాయి.

శ్రీనివాసభగవానుని పట్టపుదేవేరి అయిన పద్మావతి అమ్మవారు అర్చామూర్తిగా వేంచేసి వున్న తిరుచానూరుక్షేత్రం అంగరంగ వైభవంగా ఉత్సవాలతో, ఊరేగింపులతో ఏడాది పొడవునా జరిగే ఆ తల్లి ఉత్సవవైభవాన్ని వర్ణించడం సాధ్యం కాదు. ప్రతి భక్తుడు తిరుమలను సందర్శించే ముందు పద్మసరోవరాన్ని దర్శించడం, స్పృశించడం, స్నానం చెయ్యడం విధిగా ఆచరించాలి. తర్వాత శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకొన్న తర్వాతనే తిరుమలకు వెళితే తమయాత్ర సంపూర్ణంగా సిద్ధిస్తుంది.

శ్లో॥ మాతస్సమస్తజగతాం మధుకైటభారేః
వక్షోవిహారిణి మనోహర దివ్యమూర్తే ।
శ్రీస్వామిని శ్రితజన ప్రియ దానశీలే
శ్రీవేంకటేశదయితే తవ సుప్రభాతమ్ ॥

భాగవత కథాసాగరం

# భక్తప్రహ్లాదుని దివ్య మహిమలు

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్

గురుపుత్రులైన చండామార్కుల ఉపశమన వాక్కులను వినగానే హిరణ్యకశిపునికి తన పుత్రుడు హరిభక్తిని విడిచి తిరిగి తన మార్గానికి వస్తాడనే ఆశ చిగురించింది. ఇక ప్రహ్లాదునికి గృహస్థధర్మాలను మాత్రమే బోధించండని అతడు వారికి చెప్పాడు.

ఈసారి గురుపుత్రులు చాలా సావధానంగా ప్రవర్తిస్తూ ప్రహ్లాదునికి ధర్మార్థ కామాలను బోధ చేస్తూ, ఆ పిల్లవాణ్ణి మార్చేందుకు వారు తీవ్రమైన కృషి చేసారు. అయినా త్రిగుణాలకు అతీతుడైన ప్రహ్లాదునికి అవి నచ్చుతాయా? అందుకే గురువులు చెప్పే విషయాల మీద అతడు ఇష్టం చూపించలేదు.

ఒకసారి గురువులు తమ పనులను చూసుకోవడానికి వెళ్ళినపుడు తోటి రాక్షస బాలురు తమతో ఆడుకోవడానికి ప్రహ్లాదుని పిలిచారు. రాక్షసబాలురు తమతో ఆడుకోవడానికి పిలిచినప్పటికిని అచ్యుతుడే హృదయంలో నిండిన ప్రహ్లాదుడు వారికి ప్రీతివాక్కులతో భక్తి బోధ చేయడం మొదలుపెట్టాడు.

"మిత్రులారా! బుద్ధిమంతుడైన వ్యక్తి కౌమారావస్థ నుండే భాగవత ధర్మాన్ని చేపట్టాలి. మానవజన్మ ఇతర జన్మలలాగా తాత్కాలికమే అయినప్పటికీ, భక్తి యోగనిర్వహణకు ఎంతో అనువైనది. కాబట్టి ఇది ఎంతో అర్థవంతమైనది. ఇంద్రియాల వలన కలిగే సుఖం ఏ జన్మలోనైనా లభిస్తుంది. మనిషికి ఉన్నట్టి నూరేళ్ళ ఆయుష్షులో సగభాగం నిద్రలోనే గడిచిపోతుంది. కాబట్టి నిజానికి మనిషి ఆయువు యాభై సంవత్సరాలే అని తెలుసుకోండి. వాటిలో మొదటి పదేళ్ళు పసితనంలో గడిచిపోతాయి. తరువాత పదేళ్ళు ఆటపాటలలో గడచిపోతాయి. ఇక ముసలితనంలో మరి ఇరువది యేళ్ళు వ్యర్థంగా గడిచిపోతాయి. తృప్తి చెందని కామం వలన మిగిలిన ఆయువు గడిచిపోతుంది.

కాబట్టి ఇంద్రియ నిగ్రహం లేనట్టి వ్యక్తి తన్ను తాను ఏ విధంగా ముక్తుని చేసికోగలుగుతాడు? మిత్రులారా! దానవపుత్రులారా! భగవద్భక్తి లేనివారు భవబంధ ఉచ్చులో తగుల్కొని ఉంటారు. నిజానికి అటువంటివారే దానవులని పిలువబడతారు. మీరు దానవ సంతానమే అయినప్పటికీ అటువంటి వాటికి దూరంగా ఉండి నారాయణుని ఆశ్రయించండి. నేను ఈ జ్ఞానాన్ని నారదుని ద్వారానే విన్నాను." అని పేర్కొన్నాడు.

భక్తప్రహ్లాదుడు ఈ మాట చెప్పగానే రాక్షస బాలురకు సందేహం కలిగింది. తమ సందేహాన్ని వారు నిష్కపటంగా వెలిబుచ్చుతూ "ప్రహ్లాదా! మేము గాని, నీవు గాని ఈ చండామార్కులను తప్ప వేరే గురువులను ఎరుగము కదా! మనమందరము పిల్లలము. ఈ గురువులు మనలను నియంత్రించేవారు. అందునా అంతఃపురంలో నివసించే నీకు మహాత్ములతో సాంగత్యం దుర్లభం కదా! సౌమ్యుడా! అటువంటప్పుడు నీవు నారదుని ద్వారా ఈ దివ్యజ్ఞానాన్ని వినడం ఎలా జరిగింది. ఈ విషయంలో మాకు సందేహ నివృత్తి చేయవలసింది" అని ఉత్సాహంతో అడిగారు.

రాక్షసబాలురు ఆ విధంగా అడగగానే భక్త ప్రహ్లాదుడు తన గురువైన నారదముని బోధించిన ఉపదేశాలను స్మరించి, తేనె లొలికే మాటలతో ఇలా చెప్పసాగాడు- "నా తండ్రి అమరుడు కావడానికి మందరాచలానికి వెళ్ళినపుడు, ఇంద్రాది దేవతలు దానిని అనువుగా తీసికొని దానవులపై దండెత్తారు. దేవతల తాకిడికి అసురులు ఇళ్ళు వాకిళ్ళు వదలి పెట్టి పారి పోయారు. అప్పుడు దేవతలు మా తండ్రి భవనాన్ని ఆక్రమించి అంతా కొల్లగొట్టారు; దేవేంద్రుడు నా తల్లిని బంధించాడు. అపుడు నా తల్లి విలపించింది. అయినా ఇంద్రుడు నా తల్లిని బలవంతంగా ఈడ్చుకొని పోసాగాడు. అంతలో నారదముని అతనికి ఎదురుపడి "ఎందుకు ఆమెను నిర్దాక్షిణ్యంగా తీసికొని పోతున్నావని" అడిగాడు.

"ఆమె హిరణ్యకశిపుని పత్ని యని, ఆమె గర్భంలో హిరణ్యకశిపుని బీజం ఉన్నదని" ఇంద్రుడు సమాధానం చెప్పాడు. అప్పుడు దేవర్షి నారదుడు అతనితో 'ఆమె గర్భంలో ఉన్నది మహాభాగవతుడని, అతనిని చంపడం నీ సాధ్యం కాదని', తెలియజేసాడు. సత్యం తెలియగానే ఇంద్రుడు తన తప్పు ఒప్పుకొని, నారదునికి నమస్కరించాడు. భగవద్భక్తుడనైన తాను గర్భంలో ఉన్న కారణంగా ఆమెకు కూడ ప్రదక్షిణలు చేసాడు. తరువాత అతడు స్వర్గానికి వెళ్ళిపోయాడు."

"తరువాత నారదుడు నా తల్లిని తన ఆశ్రమానికి తీసికొని వెళ్ళి ఆశ్రయం కల్పించాడు. ఆమె సమ్మతించింది. ఆ సమయంలో ఆమె ఎంతో భక్తిశ్రద్ధలతో నారదమునిని సేవించింది. ఆమె వినయవిధేయతలకు మెచ్చిన ఆ ముని భాగవత ధర్మాన్ని ఆమెకు బోధించాడు. ఆ సమయంలో నేను ఆమె గర్భస్థుడనై ఉండి, ఆ ఉపదేశాలన్నీ విన్నాను. నారదముని చెప్పిన భాగవతధర్మాలను నా తల్లి మరచి పోయినప్పటికీ, ప్రత్యేకానుగ్రహం వలన అవి నాకు మరుపుకు రాలేదు."

"మిత్రులారా! నా మాటల మీద మీకు శ్రద్ధ ఉంటే బాలురైనప్పటికీ మీకు ఈ తత్త్వం అర్థమౌతుంది. అదే విధంగా స్త్రీలు కూడ ఈ దివ్యజ్ఞానం వలన ఆత్మానాత్మ వివేకాన్ని పొందగలుగుతారు. అసురబాలకులారా! సర్వ కారణకారణుడైనట్టి గోవిందుని పాదపద్మాలను సేవిస్తూ, ఆ దేవదేవుని సర్వత్ర చూడడమే జీవితలక్ష్యం. శాస్త్రాలలో వివరించబడినట్లు ఇదే మానవజీవితలక్ష్యం." భాగవతాగ్రేసరుడైన ప్రహ్లాదుని ఉపదేశాలకు అసురబాలకుల మనస్సులు పూర్తిగా భక్తిపూర్ణాలు అయ్యాయి. భక్తప్రహ్లాదునితో కలిసి వారు కూడ హరిగుణగానాన్ని మొదలుపెట్టారు.

ప్రహ్లాదుని సాంగత్యంలో అసురబాలకులు కూడా భక్తిలో పురోగమించడాన్ని చూసి చండామార్కులు కలవర పడ్డారు. వెంటనే వెళ్ళి హిరణ్యకశిపునికి వివరమంతా తెలియజేసారు. అది వినగానే ఆ దానవునికి తీవ్రమైన కోపం కలిగింది. ప్రహ్లాదుని వధించవలసిందే అంటూ నిర్ణయించు కొన్నాడు. ఆ దానవుడు బాలుడైన ప్రహ్లాదుని పరుషవాక్కులతో నిందించాడు. "ఓరీ మొండివాడా! మందమతీ! కుల నాశకా! నా శాసనాన్నే అతిక్రమించిన నిన్ను ఈ రోజు యమపురికి పంపిస్తాను. నా కోపానికి ముల్లోకాలే కంపిస్తాయని నీకు తెలుసు. అయినా ఎవరి బలం చూసుకొని నీవింత ధైర్యంతో ఉన్నావు? నిర్భయుడవై నా శాసనాన్నే ధిక్కరిస్తున్నావు?"

తండ్రి పలికిన మాటలకు బదులుగా ప్రహ్లాదుడు "రాజా! నా బలానికి మూలమే నీ బలానికి మూలమని తెలిసికో. నిజానికి అన్ని బలాలకు మూలము ఒక్కటే. స్థావర జంగమాలు గాని, ఉచ్చనీచములు గాని, బ్రహ్మతో పాటు సకల జీవులు ఆ దేవదేవుని బలం చేతనే నియంత్రించ బడుతున్నారు. అయినా తండ్రీ! ఈ అసుర స్వభావాన్ని విడిచి పెట్టు. హృదయంలో శత్రుమిత్ర భావాన్ని చూపక అందరి పట్ల సమభావంతో ఉండు. మనస్సును మించిన శత్రువే లేదు. దేహాన్ని దోచే ఆరుగురు శత్రువులను జయింపకుండా, దశదిశలలో శత్రువులను జయించా మనుకునే వారు మూర్ఖులే. ఆరుగురు అంతఃశత్రువులను జయించినవానికి అసలు శత్రువులే ఉండరు" అని అన్నాడు.

దానితో హిరణ్యకశిపుడు మరీ రెచ్చిపోయాడు. పళ్ళు పటపట కొరుకుతూ "ఓరీ మందమతీ! ఇంద్రియ నిగ్రహంలో నా కన్నను గొప్పవాడివైనట్లు మాట్లాడుతున్నావు. ఇది కేవలము అతితెలివి. చావు దగ్గరకు వచ్చింది కాబట్టే ఈ అసందర్భ ప్రేలాపన చేస్తున్నావు. అందరినీ నియంత్రించేవాడు నా కన్నను వేరొక్కడు ఉన్నాడన్నావు. వాడెక్కడున్నాడు? వాడు సర్వత్ర ఉండేవాడైతే ఈ 'స్తంభం'లో కూడ ఉంటాడా? అధిక ప్రేలాపన చేస్తున్న నీ శిరాన్ని ఇపుడు నా ఖడ్గంతో నరికివేస్తాను? నీ ఆరాధ్య దైవం నిన్నెట్లు రక్షిస్తుందో చూస్తాను" అని ఖడ్గాన్ని చేపట్టి సింహాసనం నుండి లేచినవాడై పిడికిలితో స్తంభాన్ని గుద్దాడు. అంతే! బ్రహ్మాండాన్నే బ్రద్దలు చేసే శబ్దం ఆ స్తంభం నుండి వినిపించింది.

*(సశేషం)*

కవితార్కిక సింహాయ కళ్యాణగుణశాలినే।
శ్రీమతే వేంకటేశాయ వేదాంతగురవే నమః॥


శ్రీవేంకటేశ్వరస్వామి ఘంటాస్వరూపులు శ్రీవేదాంత దేశికులు. శ్రీహయగ్రీవస్వామి కృపాకటాక్షవిశేషం చేత శతాధికగ్రంథాలను సంస్కృతంలో, తమిళంలో, మణి ప్రవాళంలోను అనుగ్రహించిన మహనీయులు. లోకక్షేమం కొఱకు ప్రజలయొక్క హితాన్ని కోరుతూ దాదాపు 28 స్తోత్రాలను రచించారు. అందులో **'న్యాసదశకం'** అనే స్తోత్రం మహిమాన్వితమైనది.

**న్యాసదశకం**– మొత్తం 10 శ్లోకాలతో కూడియున్న స్తోత్రమిది. శ్రీమన్నారాయణుడిని పొందడానికై విశిష్టా ద్వైతసిద్ధాంతం రెండు మార్గాలను తెలిపినది. ఒకటి **భక్తి** మరొకటి **ప్రపత్తి**. నవవిధభక్తిమార్గముల ద్వారా భగవంతుని పొందగలగడం. శ్రవణం, కీర్తనం మొదలగునవి. ఈ మార్గాల ద్వారా ఎందరో ఋషులు, తపస్సంపన్నులు, పరివ్రాజకులు, మహనీయులు భగవత్సాయుజ్యాన్ని పొందారు.

శ్రీవైష్ణవసంప్రదాయం ప్రకారం లక్ష్మీవల్లభుని చేరు కోవడం భక్తిమార్గం ద్వారా కష్టసాధ్యం, కనుక అగాధ భగవద్భక్తిసింధువులైన ఆళ్వారులు 'ప్రపత్తి' మార్గాన్ని సులభో పాయంగా భావించుకొని దేవదేవుని దివ్యకృపకు పాత్రులై నారు.

**ప్రపత్తి** – శరణాగతి, న్యాసం, భరసమర్పణం, త్యాగం అని పర్యాయపదాలు కలవు. **'న్యాసం'** అంటే ఉంచడం, పెట్టడం, సమర్పించడం అని అర్థం. మనల్ని భగవంతుడికి సమ ర్పించడం, మన భారాన్ని పురుషోత్తముడికే అర్పించడం. ఈ జీవాత్మను పరమాత్మయందు ఉంచడం. దీనికి 'న్యాస విద్య' అని పేరు. సత్యం, దానం, ధర్మం, తపస్సు, యాగా దుల కంటెను శీఘ్రంగా ఫలమిచ్చును కనుక ఈ విద్య చాలా శ్రేష్ఠమైనదని శ్రుతిప్రమాణం.

సర్వరక్షకుడు శ్రియఃపతియే అనే భావనతో జీవుడు తనను తాను సంపూర్ణంగా సమర్పించుకోవడమే ఈ న్యాస విద్య పరమార్థం. ఐదు అంగములతో కూడిన ఈ శరణా గతిని శ్రీవేదాంతదేశికులవారు కాంచీపురం శ్రీవరద రాజస్వామి దివ్యపాదారవిందములయందు సమర్పించి కృతార్థులైరి.



– ఆచార్య చక్రవర్తిరంగనాథన్

## న్యాసదశకం స్తోత్రం

01) అహం మద్రక్షణభరో మద్రక్షణఫలం తథా।
న మమ శ్రీపతేరేవేత్యాత్మానం నిక్షిపేత్ బుధః॥

02) న్యస్యామ్యకించనః శ్రీమన్ అనుకూలోఽన్యవర్జితః।
విశ్వాసప్రార్థనాపూర్వం ఆత్మరక్షాభరం త్వయి॥

03) స్వామీ స్వశేషం స్వవశం స్వభరత్వేన నిర్భరం।
స్వదత్తస్వధియా స్వార్థం స్వస్మిన్ న్యస్యతి మాం స్వయం॥

04) శ్రీమన్నభీష్టవరద త్వామస్మి శరణం గతః।
ఏతద్దేహావసానే మాం త్వత్పాదం ప్రాపయ స్వయం।

05) త్వచ్ఛేషత్వే స్థిరధియం త్వత్ప్రాప్త్యేకప్రయోజనం।
నిషిద్ధకామ్యరహితం కురు మాం నిత్యకింకరం॥

06) దేవీభూషణహేత్యాది జుష్టస్య భగవంస్తవ।
నిత్యం నిరపరాధేషు కైంకర్యేషు నియుంక్ష్వ మాం॥

07) మాం మదీయం చ నిఖిలం చేతనాచేతనాత్మకం।
స్వకైంకర్యోపకరణం వరద స్వీకురు స్వయం॥

08) త్వదేకరక్ష్యస్య మమ త్వమేవ కరుణాకర।
న ప్రవర్తయ పాపాని ప్రవృత్తాని నివర్తయ॥

09) అకృత్యానాం చ కరణం కృత్యానాం వర్జనం చ మే
క్షమస్వ నిఖిలం దేవ ప్రణతార్తిహర ప్రభో॥

10) శ్రీమాన్ నియతపంచాంగం మద్రక్షణభరార్పణం।
అచీకరత్ స్వయం స్వస్మిన్ అతోఽహమిహనిర్భరః॥

– న్యాసదశకం సమాప్తం –

శ్లోకభావసౌందర్య రసాస్వాదనం ప్రస్తుతం చేయబడుతున్నది.

**01)** "**అహం**......... బుధః" -తత్త్వజ్ఞానాన్ని పొందిన పండితుడు సర్వశేషియైన భగవంతుని సన్నిధిలో నన్ను రక్షించుకొనే సామర్థ్యం నాకు లేదు కనుక, అందరినీ రక్షించే సామర్థ్యం నీకొక్కడికి తప్ప మరెవ్వరికీ లేదు కనుక, శ్రియఃపతియైన నీయందు నన్ను నేను సమర్పించుకొంటున్నాను.

**02)** **న్యస్యామి**..... ఓ శ్రీమన్నారాయణా! వేరొక ఉపాయాన్ని అనుష్ఠించడానికి శక్తి లేనివాడనై, ఆనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం, రక్షిష్యతి అనే మహా విశ్వాసం, సర్వరక్షకత్వం, ఏది లేక పోవడం అనే ఐదు అంగములతో కూడిన ఆత్మరక్షణభారాన్ని ప్రార్థనా పూర్వకంగా నీ దివ్యసన్నిధియందు సమర్పించుకుంటున్నాను.

**03)** **స్వామిన్**... భగవంతుడు స్వతంత్రుడు. జీవుడు పరతంత్రుడు. శేషుడైన జీవుణ్ణి శేషియైన పరమాత్మ రక్షించుకోవలెను.

**04)** **శ్రీమన్**... ఇష్టమైన వరములను ప్రసాదించే వరద రాజస్వామీ! నిన్నే ఉపాయంగా ఆశ్రయించిన నన్ను దేహపరిత్యాగం తరువాత నీ పాదాలయందు నీవే పొందించుము.

**05)** **త్వచ్ఛేషత్వే**... నీకు దాసుడిగా, నిన్నుపొందడమే ప్రయోజనంగా కలవానిగా అనుగ్రహింపుము. ముఖ్యంగా శాస్త్రనిషిద్ధకర్మలను, కామ్యకర్మలను చేయనీయకుండ, సదా నీకు సేవ చేసేటట్టు అనుగ్రహించుము.

**06)** **దేవీభూషణ**.... సకలపరివారజనవిశిష్టుడైన శ్రియః పతి యైన నీకు ఎల్లప్పుడూ కాయిక కైంకర్యం చేయడానికి నన్ను వినియోగించుకొనుము.

**07)** **మాం మదీయం**- హే వరదరాజస్వామీ! నన్ను నాకు సంబంధించిన చేతన, అచేతన విషయాలనంతటినీ నీకు సేవచేసే పరికరములుగా ఉపయోగించుకొనుము.

**08)** **త్వదేక**- ఓ దయాకరా! నీ చేతనే రక్షింపబడువాడైన నాకు ఏ పాపాలు తగులకుండ, చేసిన పాపాలు తొలగిపోవునట్లు అనుగ్రహించుము.

**09)** **అకృత్యానాం**.. స్వయంకృతాపచారాలంతటినీ క్షమించమని ప్రార్థన. చేయకూడని పనులను చేసి కలిగిన దోషాన్ని, చేయవలసిన పనులను విడిచిపెట్టడం వలన కలిగే దోషాన్ని అన్నింటినీ క్షమించు.

**10)** **శ్రీమాన్**- ఓ లక్ష్మీపతి! ఐదు అంగములతో కూడిన ఈ న్యాసాన్ని, శరణాగతిని, నా ద్వారా నీవే అనుష్ఠింపచేసుకొన్నావు. కనుక నేను ఇక జీవించినంతకాలం నిర్భరుడనై, నిర్భయుడనై ఉందును.

ముఖ్యమైన విషయాలు ఈ స్తోత్రం ద్వారా తెలుసుకొవలెను.

**01)** భగవంతునియందు శరణాగతిని చేసినవాడు ఎలా ఉండాలి?

**02)** ప్రపన్నుని ప్రార్థన పురుషోత్తమునియందు ఎలా ఉండాలి?

**03)** ప్రతిభక్తుడు భగవంతుని దగ్గర ఎలా, ఏమని ప్రార్థించాలి?

**04)** 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ' అనే భావం భక్తునియందు సర్వదా ఉండాలి.


**05)** ప్రతి ఒక్కరూ, ప్రతిరోజూ దేవదేవుని సన్నిధిన ఈ 10 శ్లోకములను పారాయణం చేస్తే, ఇహపరసౌఖ్యములు మరియు పరమపురుషార్థమైన మోక్షము తప్పక లభించగలదని శ్రీదేశికవచనామృతము.

*శ్రీమాన్ వేంకటనాథార్యః చిరం విజయతాం భువి.*



అందరికీ 'శ్రీహరే' అంతరాత్మ

# పురాణాలు ధర్మమార్గ దర్శనములు



- శ్రీ పాలకుర్తి రామమూర్తి

మానవ జీవితం భౌతిక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక పార్శ్వాలలో సమన్వయంతో కూడిన సమగ్రతను సాధించినప్పుడే పరిపుష్టమౌతుంది. దీనిని సాధించేందుకు మార్గం చూపే సాహిత్యంలో పురాణాలు ముఖ్యమైనవి. పురాణాలు అంటే ఏమిటి? 'పునర్నవీనం' పురాణం. నిత్యనూతనంగా భాసిస్తుంది కాబట్టి పురాణము అన్నారు.

ప్రతివ్యక్తి జననమరణ బంధనాలకు అతీతమైన పరమపదాన్ని కోరుకుంటాడు. దానిని సాధించే క్రమంలో జీవితం ధర్మ అర్థ కామ మోక్షాల గుండా నడవాలి. ధర్మ మార్గంలో అర్థకామాలను సాధించి మోక్షాన్ని పొందాలి. ఈ సాధనా మార్గంలో ముందుకు నడిపించేవి పురాణాలు. అందుకే "పురాణాం సర్వ శాస్త్రాణాం ప్రథమం" అన్నారు. అన్ని శాస్త్రాలకు ఆద్యమైనది పురాణం. "ధర్మం చర సత్యం వద" లాంటి వేద మార్గాన్ని సుబోధకంగా చెపుతున్నాయి పురాణాలు. ధర్మ మార్గంలో ఎలా నడవాలి.. ధర్మాధర్మ విచికిత్స ఏర్పడిన వేళ ఎలా వ్యవహరించాలి.. ధర్మమేమిటి ధర్మ సూక్ష్మ మేమిటి? ఇలా ఎన్నో అంశాలను కథల రూపంలో హృదయాలకు హత్తుకునే విధంగా చెప్పడం పురాణాల విశేష లక్షణం. పురాణాలన్నీ ధర్మసూక్ష్మాలను తెలుసుకునేందుకే ప్రాధాన్యత నిచ్చాయి.

సమాజంలో ఉత్తమ వ్యక్తిగా గుర్తింపబడేందుకు అతని వ్యక్తిత్వం చక్కగా తీర్చిదిద్దబడాలి. దానికి ఎన్నో ఆచరణాత్మక మార్గాలు పురాణాలలో చెప్పబడ్డాయి. సమగ్ర జీవన గతిని సాధించేందుకు అవసరమైన వికాసాన్ని పొందే క్రమంలో ప్రశ్నించే విధానం, బదులిచ్చే విధానం, ఎదుటి వారి కోణంలో ఆలోచించే విధానం, ఎదుటివారి కష్ట సుఖాలకు స్పందించే విధానం, సమస్యలు కేంద్రంగా కాకుండా పరిష్కారదిశలో ఆలోచించే విధానం, పరిస్థితులను సమన్వయం చేస్తూ ముందుకు సాగే విధానం, విభిన్న ప్రవృత్తులను సమన్వయం చేసే విధానం.... ఇలా ఎన్నో కోణాలలో చక్కగా అవగాహనను కల్పిస్తున్నాయి పురాణాలు.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలను చెపుతూ... వ్యక్తి, ధార్మిక జీవనాన్ని స్వధర్మ నిరతితో సాగించాలని పురాణాలు చెపుతున్నాయి. సమయం, స్థలం, నమ్మకాలు, పాత అనుభవాలు, ఇష్టాయిష్టాలకు అతీతంగా సర్వజీవ సమభావనతో జీవితాన్ని సాగించడం మానవులకు సహజ స్వీకృతిగా చెపుతున్నాయి పురాణాలు.

శీల నిర్మాణ ప్రాముఖ్యతను చెపుతూ.. ఎక్కడ శీల నిర్మాణం జరుగుతుందో, ఎక్కడ ధైర్యసాహసాలు ఉంటాయో, ఎక్కడైతే మన అంతర్గత శక్తి సామర్థ్యాలపై విశ్వాసం



ఉంటుందో, ఎక్కడైతే చేసే పనిలో, పలికే మాటలో స్పష్టత ఉంటుందో, ఎక్కడైతే సమర్థత ప్రతిభావ్యుత్పత్తులు వెలుగు చూస్తాయో, ఎక్కడైతే భావ వ్యక్తీకరణ సరైన విధానంలో ఉంటుందో అక్కడ సుఖం, శాంతి, సంతోషం, ఆనందం నిలుస్తాయని చెపుతున్నాయి పురాణాలు.

శ్రీరాముని జీవితాన్ని ఆదర్శంగా చూపించి సమగ్ర మానవమూర్తిగా ఎలా మసలుకోవాలో చెపుతుంది రామాయణం. ఒక ఆదర్శగృహిణిగా పతివ్రతగా సీతమూర్తి మత్వాన్ని చూపింది. సోదరప్రేమకు నిదర్శనంగా లక్ష్మణుని చూపింది. హనుమంతునిలోని సేవాభావనకు అద్దం పట్టింది. సుగ్రీవునిలోని, విభీషణునిలోని ధార్మిక ప్రవృత్తిని పరిచయం చేసింది. రావణునిలోని చెడు లక్షణాలను చూపి జీవితం ఎలా ఉండకూడదో చెప్పింది.

పాండవుల ధార్మికతను, కౌరవుల కుటిలత్వాన్ని, భీష్మద్రోణుల ఉదాసీనతను, ధృతరాష్ట్రుని పుత్రవాత్సల్యాన్ని, విదురాదుల ధర్మనిరతిని చూపుతూ మనుషులెలా మసులుకోవాలో ప్రపంచానికి చెప్పింది. కృష్ణపరమాత్మను చూపుతూ సుఖదుఃఖాలలో ఎలా జీవించాలో నేర్పింది.

సత్య నిష్ఠ అన్నింటికన్నా ప్రధానమైనదని హరిశ్చంద్రుని పాత్ర ద్వారా తెలిపింది. దధీచి, శిబిలాంటి పాత్రల ద్వారా త్యాగ నిరతిని చూపింది. ప్రహ్లాదుని ద్వారా భక్తియొక్క పరాకాష్టను చూపింది. గజేంద్రుని పాత్రద్వారా విష్ణువు యొక్క భక్తపరాధీనతను, రుక్మిణి పాత్రద్వారా సమర్పణాభావాన్ని, నారద పాత్ర ద్వారా సమాజకల్యాణాన్ని, క్షీరసాగర మథన కథ ద్వారా అమృతసాధనా దీక్షాదక్షతలను పరిచయం చేశాయి పురాణాలు.


ఇలా పలు పాత్రల ద్వారా పురాణాలు మానవ జీవనవికాసానికి, విస్తరణకు, లక్ష్యసాధనకు మార్గం చూపాయి. ఆ మార్గంలో నడిచి భౌతిక ఆధ్యాత్మిక జీవనంలో ప్రగతిని సుగతిని పొంది రసమయ జీవితాన్ని ఆస్వాదించి భగవంతునిలో లయమయ్యేందుకు ప్రయత్నించండి అంటూ మార్గాలను చూపుతున్నాయి, పురాణాలు.



## శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు, తిరుచానూరు

**2020, నవంబరు 10 నుండి 19 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 10-11-2020 | మంగళ | లక్షకుంకుమార్చన | అంకురార్పణం |
| 11-11-2020 | బుధ | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 12-11-2020 | గురు | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 13-11-2020 | శుక్ర | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 14-11-2020 | శని | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 15-11-2020 | ఆది | పల్లకీ ఉత్సవం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 16-11-2020 | సోమ | సర్వభూపాలవాహనం | గరుడవాహనం |
| 17-11-2020 | మంగళ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 18-11-2020 | బుధ | రథోత్సవం | అశ్వవాహనం |
| 19-11-2020 | గురు | పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారి అవభృథము, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



# 'తీర్థం' దాని పరమార్థం

– శ్రీ యం.జి.రామచంద్రన్

"ఉదకం, చందనం, చక్రం, శంఖం చ తులసీ దళమ్, ఘంటాం, పురుషసూక్తం చ తామ్ర పాత్ర మథాష్టమం సాలగ్రామశిలాచైవ నవభిస్తీర్థ ముచ్యతే"

అంటే– నీరు, చందనం, చక్రం, శంఖం, తులసీ దళం, ఘంట, పురుషసూక్తం, రాగిపాత్ర, సాలగ్రామం– ఈ తొమ్మిదింటి కలయిక వల్ల ఏర్పడే ఉదకాన్నే **'తీర్థం'** అంటారు. అలాగే–

**'భగవత్పాద తీర్థం తు నిత్యం యః పిబేత్‌నరః.... సర్వరోగాది శమనం సర్వపాప హరం భవేత్'**

అనగా– భగవంతుణ్ణి అభిషేకించిన లేదా నైవేద్యం పెట్టిన తీర్థాన్ని గ్రహించే మానవుడు ఆరోగ్యంగా ఉంటాడని, పరమేశ్వర సాయుజ్యాన్ని పొందుతాడని, తులసితో కూడిన సాలగ్రామతీర్థం అన్నిరకాల రోగాలను పోగొడుతుందని మన ఆధ్యాత్మిక గ్రంథాలు చెప్తున్నాయి. సాధారణంగా గుళ్ల లోని దేవతా విగ్రహాలని కడిగిన లేదా అభిషేకించిన జలాన్ని, పాలను దేవాలయాలకి వచ్చిన భక్తులకి తీర్థంగా ఇస్తారు. కొన్ని గుళ్లలో మామూలుగా తులసి, పచ్చకర్పూరం లాంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన తీర్థాన్ని దేవుడికి నివేదన చేసి, వచ్చిన భక్తులకు ఇస్తారు.

భగవంతునికి నివేదించిన ఆ తీర్థాన్ని ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపత్రయాన్ని ఉపశమించే విధంగా, మూడుసార్లు 'అకాలమృత్యుహరణం సర్వవ్యాధి నివారణం శ్రీవిష్ణుపాదోదకం లేదా శివపాదోదకం పావనం శుభం' అంటూ భక్తుల చేతిలో మూడుసార్లు పోస్తారు. అలాంటి పవిత్రమైన తీర్థాన్ని కింద పడకుండా పవిత్రమైన భావనతో సేవించాలి.

**'పరమాణుసమం తీర్థం....'** అన్నారు.. అంటే పరమాణు సమానమైన తీర్థం మహాపాతకాలని సైతం నాశనం చెయ్యగలదు. అటువంటి తీర్థం నేల మీద ఒక్క చుక్క పడినా అది ఎనిమిది రకాల పాపాలని ఇస్తుందిట.

తీర్థాన్ని ఏవిధంగా స్వీకరించాలంటే – ఎడమ అరచేతి కింద అంగవస్త్రాన్ని నాలుగు మడతలుగా పెట్టుకొని, దానిపై కుడిచేతిని శంఖం ఆకారంలో పెట్టుకుని నేల మీద ఒక చుక్క కూడా క్రింద పడకుండా తీర్థాన్ని స్వీకరించాలి. ముఖ్యంగా పూజారులు కూడా తీర్థాన్ని ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఇయ్యాలి.

అందువలన పవిత్రమైన, పాపహరణమైన ఆ తీర్థాన్ని తాకి లేదా అందులో మునిగి ఐహికమైన వాంఛలన్నీ పోవాలన్నీ, అవన్నీ దైవ అనుగ్రహం, దీవెన ఉంటేనే పోతాయనే భావంతో స్వీకరించాలి. కాబట్టి తీర్థం ఇవ్వడం, పుచ్చుకోవడం వెనక ఇంత విషయం ఉంది అని తెలుసుకోవాలి..




# ముడుపు తీర్చుకున్న స్వామి

శ్రీమతి సుజాతా శేఖర్

శ్రీవేంకటేశ్వరుని లీలలు ఎంత చెప్పినా, ఎన్ని విన్నా అంతులేనివి. ఆ కోనేటిరాయుని అద్భుతాలు అందరికీ జరిగి ఉండొచ్చు కాని, మా జీవితంలో జరిగిన ఈ సంఘటన ఇది.

మాది విజయవాడ. మేము తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దగ్గరకు ప్రతి సంవత్సరము వెళ్తాం. మాకు వివాహం జరిగిన దగ్గరనుండి మా ఇంట్లో వాళ్ళు 'జోగెత్తు' కొని వెళ్లాలని అన్నారు. కాని మేము ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చాం. ప్రతి సంవత్సరంలాగే మేము ఎప్పుడు కూడా తిరుమలకు వెళ్లాలని అనుకుంటుంటే, యీసారైనా జోగెత్తుకోని వెళ్ళండి అని మా ఇంట్లో వాళ్ళు గట్టిగా అనేవాళ్లు. అప్పుడు ఏం చేయాలో తెలియక ఇల్లు కట్టుకుంటే వెళ్తాము అని గట్టిగా చెప్పాము.

తరువాత తిరుమల వెళ్ళి శ్రీవారి దర్శనం కన్నుల పండుగగా చేసుకొని అక్కడే ఉన్నాము. తర్వాత మాకు తెలిసిన ఒక వ్యక్తి ఫోన్ చేసి ఒక ఇల్లు ఉంది చూద్దురుగాని రండి అన్నారు. సరేనని కిందకు వచ్చి తిరుచానూరు వచ్చి శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించి, ఇంటికి వెనక్కి వచ్చాము.


ఆ తర్వాత ఇల్లుచూసి కొనాలని కూడా అనుకోలేదు. కాని యాంత్రికంగా ఇల్లు కొనటం, గృహప్రవేశం అవటం అన్ని జరిగినవి. తర్వాత తిరుమలకు వెళ్లాలని అనుకుని "జోగెత్తుకోవటం" చేయాలని జోగెత్తుకున్నాను. కాని మాకు మొదటినుండి జోగెత్తుకోవటం అంటే చిన్నతనంగా భావించి, జోగెత్తుకోలేదు. ఆరోజు ఆ మొహమాటంతో నాలుగుసందులు పేరుకు తిరిగి వచ్చాము.

తర్వాత మేము తిరుపతికి వెళ్లాలని విజయవాడలో రైల్వేస్టేషన్‌కు వెళ్ళాము. అక్కడ బాబు తప్పిపోయాడు. ఎంత వెదికినా దొరకలేదు. మైక్‌లో కూడా చెప్పించాము. అయినా జాడలేదు. మేము కంగారుగా తలా ఒక దిక్కుకు పరిగెత్తాము. స్టేషన్ మొత్తం రెండుగంటలపాటు పరుగులు తీశాము. అయినా కనబడలేదు. ఏం చేయాలో తోచలేదు మా ట్రైన్ వెళ్ళిపోయింది. మేము అందరము స్టేషన్‌లోనే ఉండిపోయాము. దిగులుతో హృదయమంతా నిండిపోయింది. అప్పుడు గుర్తుకు వచ్చింది. మనం జోగెత్తుకొని తొందరగా వచ్చేశాము, అందుకే ఆ స్వామి స్టేషన్ మొత్తం నడిపించాడు అని. అంతే స్వామివారికి మనసులో క్షమాపణలు చెప్పుకుని ఎలాగైనా బాబు దొరికేటట్లు చేయమని కోరుకున్నాము.

అప్పుడు ఒక ఫోన్ వచ్చింది. వెంటనే తీశాము. అప్పుడు మా బాబు ఫోన్ చేసి "మీరు ఆ ట్రైన్ ఎక్కారనుకొని వేరే ట్రైన్ ఎక్కాను. మీరు ఎవ్వరూ ఎంత వెతికినా కనపడలేదు. నా దగ్గర ఫోను కూడా లేదు చేయటానికి. అలాగే ఆగిన తర్వాత దిగుదాం అనుకుంటే ఆ రైలు ఎక్కడా ఆగలేదు. ఇంక భయం వేసి అక్కడ ఉన్న అబ్బాయిని ఫోన్ అడిగి ఫోన్ చేశాను" అన్నాడు.

ఆ తరువాత ఎలాగోలా మా బాబుని కలిశాము. ఇదంతా ఆయన లీల కాక వేరొకటి కాదు. తరువాత నా పర్సు పోయింది. డబ్బులు మొత్తం పోయినవి. ఆయనకు రావలసిన మూల్యం ఆయన తీసుకున్నాడు. ఆయన లీలలు శతకోటి.

అటు తర్వాత మేము ఇంటింటా జోగెత్తుకొని వెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని ఇంటిల్లిపాది దర్శించుకున్నాము.



# విష్వక్సేనం తమాశ్రయే

– డా॥ తిరుమల శ్రీతేజాచార్యులు

**వందే వైకుంఠసేనాన్యం దేవం సూత్రవతీ సఖమ్।**
**యద్వేత్రశిఖస్పందే విశ్వమేతత్ వ్యవస్థితమ్॥**

'ఎవరి చేతి బెత్తం కొనయొక్క చలనమందు ఈ చరాచరవిశ్వం తన స్థానం నుండి కదలకుండ నిలిచి యున్నదో, అట్టి దివ్యమూర్తియైన, సూత్రవతీనాథుడైన విష్వక్సేనుడనే వైకుంఠసేనాధిపతికి నమస్కరిస్తున్నాను.'

మహావిష్ణువుకి సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనుడు. ఈయననే 'సేనాధిపతి' లేక 'సేనైమొదలియార్' అని అంటారు. సర్వమంగళ నాయకుడైన విష్వక్సేనుని ఎవరు ఆరాధిస్తారో, వారికి ఎలాంటి ఆపదలు ఉండవని వైఖాన సాగమం చెబుతోంది.

శ్రీపాంచరాత్రాగమంలో పాద్మసంహితలో విష్వక్సేనుడి గురించి ఇలా వివరించబడింది.



**దౌవారికేషు సర్వేషు యశ్చండః ప్రథమో భవేత్।**
**విష్వక్సేన సమాఖ్యాం చ సర్వసేనాధిపోచితామ్॥**

**–(పాద్మసంహితా, క్రియాపాదే 32.114–116)**

"కుమారా! ఒకానొకప్పుడు దేవతలకునూ–రాక్షసులకు చాలా సంవత్సరములు యుద్ధము జరిగినది. దేవతలు ఓడి నన్ను శరణు వేడగా, అప్పుడు నేను యుద్ధమునకు బయలుదేరబోగా నా ద్వారపాలకులలో ప్రథముడైన చండుడు నాకు నమస్కరించి, తమకు ఆ శ్రమ ఎందులకు? తమ దాసుడనగు నాకు అనుమతి ఇచ్చినచో నేను ఆ రాక్షసులను పారద్రోలెదనని అనెను. అట్లే అని నేను చండునికి అనుమతిని ఇచ్చితిని. వాని ప్రతాపధాటికి ఆగలేక రాక్షసులు కొందరు మరణించిరి, మరికొందరు పారిపోయిరి. అతని పరాక్రమమునకు సంతోషించి అతనికి నా స్వరూప సామ్యమును, అప్రతిహతమైన బలమును, సకలలాంఛనములతో సర్వసైన్యాధిపతిత్వమును అనుగ్రహించితిని. అతనిని సేవించినవారికి ఎటువంటి విఘ్నములు కలుగవు. సకల శుభములు కలుగునని, అలాగే నాకు చేసిన నివేదనయందు నాల్గవపాలు విష్వక్సేనుడికి నివేదనము చేయవలెనని" శ్రీమన్నారాయణుడు బ్రహ్మకు చెప్పెను.

**త్వదీయ భుక్తో జ్ఝిత శేష భోజినా**
**త్వయా నిసృష్టాత్మభరేణ యద్యథా।**
**ప్రియేణ సేనాపతినా న్యవేది తత్**
**తథాఽను జానంతముదారవీక్షణైః॥**

**(స్తో.ర. 42శ్లో.)**

ఈ శ్లోకమున ఆళవందార్ సేనముదలియార్‌ను ఈ విధముగా కీర్తించిరి. "ఆ శ్రియఃపతియొక్క శేషప్రసాదమును ప్రథమంగా స్వీకరించి, ఉభయ విభూతుల పర్యవేక్షణా భారమును భగవదాజ్ఞగా స్వీకరించి, దానిని సమర్థవంతంగా నడిపించు విష్వక్సేనులను ప్రతివారు ఇష్టపడుదురు. ఆ వైకుంఠనాథుడు చెప్పకుండానే వారి నేత్రముల సైగలతో వారి మనస్సును గ్రహించి, కార్యమును సమర్థవంతముగా పూర్తిచేయగల సామర్థ్యము కలవారు విష్వక్సేనులు."

భగవద్రామానుజులవారు కూడా "శ్రీమత్ విష్వక్సేనేన్యస్త సమస్తాత్మైశ్వర్యమ్" అని స్తుతించారు.

**శ్రీరంగచంద్రమసమిందిరయా విహర్తుం**
**సేనాన్యమన్య విముఖాస్తమిహాశ్రయామః॥**

అని శ్రీపరాశరభట్టర్ వారు "ఈ సమస్త విశ్వాన్ని చరాచర జీవులను నడిపే అధికారాన్ని అవలీలగా నిర్వహించేవారు అని విష్వక్సేనులని" స్తుతించారు.

**విష్వక్సేనం చతుర్బాహుం శంఖచక్రగదాధరం।**
**ఆసీనం తర్జనీహస్తం విష్వక్సేనం తమాశ్రయే॥**

విష్వక్సేనులు నాలుగు చేతులతో పద్మపీఠంపై ఆసీనులై, శంఖచక్రాలను ధరించి, కుడిచేత అభయ ముద్ర లేక తర్జనీ ముద్ర ధరించి ఉంటాడు. కొన్నిచోట్ల దండాన్ని ధరించి కూడా కనిపిస్తాడు. ఎడమచేత గదను ధరించి ఉంటాడు.

శ్రీవైష్ణవాగమంలో విష్వక్సేనుని ప్రతి కార్యంలోను పూజించడం జరుగుతుంది. వైఖానస ఆగమోక్తప్రకారం తిరుమల శ్రీవారికి నిర్వహించే నిత్యకంకైర్యాలలో విష్వక్సేనులది ప్రధాన పాత్ర.

తిరుమలలో శ్రీవారిదేవాలయంలో వైకుంఠప్రదక్షిణ ద్వారం, దాని ప్రక్కన చిన్నమందిరంలో దక్షిణాభిముఖంగా శ్రీవిష్వక్సేనులవారు వేంచేసి ఉన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ముందుగా సేనాపతి ఉత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఈయన నాలుగు మాడవీథులలో ఊరేగింపుగా వచ్చిన తరువాత శ్రీవేంకటేశ్వరస్వామివారు వాహనంపై వేంచేస్తారు. అటువంటి ఆయనను ఆశ్రయిస్తే చాలు, సమస్తదోషాలను హరించి, భక్తులలో జ్ఞానజ్యోతిని వెలిగిస్తాడు.

## శంఖణ మహారాజు

శ్రీవేంకటేశ్వరస్వామిని భక్తితో సేవించిన వారు ఎందరో ఉన్నారు. వారిలో పూర్వకాలంలో కాంభోజ దేశాన్ని శంఖణుడు అనే మహారాజు పరిపాలించే వాడు. ప్రజలను కన్నతండ్రివలె చక్కగా పాలన చేస్తూ మంచి పేరుతెచ్చుకొన్న ఈ రాజు అందరినీ సులువుగా నమ్మేవాడు. అందువల్లే ఆ రాజు శత్రువులచేత సులభంగా మోసగింపబడి తన రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. ఆ తర్వాత విచారంతో ఎటు వెళ్లాలో తెలియక పయనం సాగించాడు.

కష్టకాలంలోను, క్షేత్రదర్శనం మంచిదన్న పెద్దల మాటలను అనుసరించి చివరకు శ్రీవేంకటాచల దివ్య క్షేత్ర సమీపంలోనికి వచ్చి చేరాడు. ఆ క్షేత్రం మీద ఉన్నటువంటి పవిత్రమైన "స్వామిపుష్కరిణి"ని చూశాడు. అంతేకాదు, ఈ పుష్కరిణిలో స్నానం చేసినట్లయితే నీ కష్టాలన్నీ తొలగుతాయనీ, శంఖణ మహారాజు భార్యతో కూడ వేంకటాచల క్షేత్రాన్ని భక్తితో అధిరోహించినాడు.

బంగారు విమానంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమహావిష్ణువు దివ్యాభరణాలతో సుగంధసుమనోహరమైన పుష్పమాలలతో అలంకరింపబడి, దేదీప్యమానంగా వేయి వెలుగులతో దర్శనమిచ్చినాడు. స్వామి పుష్కరిణికి నమస్కారాలర్పించి, తిరిగి తన రాజ్యాన్ని చేరుకొన్నాడు. దైవానుగ్రహం వలన శంఖణుడు శత్రువులను అనాయాసంగా జయించినాడు. ఆ మహారాజు జనరంజకంగా సుఖసంతోషాలతో రాజ్యంచేస్తూ చిట్టచివరకు మోక్షాన్ని కూడా పొందాడు.



'అసూయ-ద్వేషం' ఉంటే మానవుడు పైకి ఎదగలేడు

# స్వయంప్రభ

- ఆచార్య కె.మలయవాసిని

శ్రీమద్రామాయణం కిష్కింధకాండ చివరలో 51, 52 సర్గలు, 53వ సర్గలో 13 శ్లోకాలు మొత్తం ఏభై ఒక్క శ్లోకాల్లో 'స్వయంప్రభ' వృత్తాంతం వర్ణించాడు వాల్మీకి మహర్షి.

సీతాన్వేషణ తత్పరులై అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఆంజనేయాదులు ఒక వనంలో ప్రవేశించారు. ఆ వనంలో చెట్లకు ఎక్కడా ఫలాలు లేవు. నీటికొలనులు లేవు. కండు మహర్షి శాపానికి గురి అయిన వనం అది. లోపలికి వెళదాం అని నిశ్చయించుకున్నారు. అందరూ దాహం తీర్చు కోవడానికి వేరే దారిలేక ఒకరిని ఒకరు పట్టుకుని యోజన దూరం ప్రయాణం చేసారు. చీకటిలో నడకతో అలసి, సొలసి, తెలివి తప్పి దబ్బుమని పడిపోయారు.

కొంతసేపటికి తెలివి వచ్చింది. తేరుకుని కళ్ళు తెరిచి చూసే సరికి అద్భుతమైన వెలుగు. స్వర్ణమయమైన వివిధ ఫలవృక్షాలు. మణిమయ భవనాలు, తామర కొల నులు, జలపక్షులతో పరమ రమణీయమైన దృశ్యం కని పించింది. ఆశ్చర్యపడుతూనే ఆ భవనంలోకి ధైర్యం చిక్కబట్టుకుని ప్రవేశించారు. అక్కడ కందమూల ఫలాలు, ఆహార పానీయాలు, మద్యాలు కనిపించాయి.

అవి దాటి కొంచెం ముందుకు వెళ్ళగానే కృష్ణాజినం ధరించి, నియమితాహారంతో కృశించి, అగ్నిహోత్రంలా ప్రకా శిస్తున్న ఒక వృద్ధతాపసి దర్శన మిచ్చింది.

వెంటనే ఆంజనే యుడు ఆ వృద్ధ పవిత్రమూర్తికి భక్తితో నమస్కరించి 'అమ్మా! మీరెవరు? ఈ భవనాలు ఈ అంతులేని సంపదలు ఎవరివి? ఈ భోగభాగ్యాల మధ్య ధర్మ చారిణివైన తాపసివి నీవెవరు? మేం భరించలేని ఆకలితో దాహంతో ఈ బిలంలో నీరు లభిస్తుందనే ఆశతో వచ్చాం. ఇక్కడ అంతా అద్భుతంగా ఉంది. ఈ స్వర్ణమయ లోకంలో తపోసంపన్నులైన మీరు వసించడం చిత్రంగా ఉంది. కొంచెం వివరంగా చెప్పండి' అని కోరాడు.

ఆ వృద్ధతాపసి ఇలా చెప్పింది. నేను మనువులలో ఒకరైన మేరు సావర్ణి కుమార్తెను. నా పేరు స్వయంప్రభ. మయుడనే మాయావి మహాతేజస్సును సాధించి ఈ వనాన్ని ఈ భవనాన్ని నిర్మించాడు. బ్రహ్మ ఈ భవనాన్ని హేమ అనే అప్సరసకు ఇచ్చాడు. నృత్య గీత విశారద అయిన హేమ నా మిత్రురాలు. ఆమె కోరిక మీద ఈ భవనాన్ని నేను కాపాడుతున్నాను.

స్వయంప్రభ అతిథ్యానికి, సౌమ్య భాషణానికి సేద దేరిన హనుమ ఆ తాపసితో-శ్రీరామవృత్తాంతంతో ఆరం



భించి-సుగ్రీవుడు సీతాన్వేషణకై వానరులను నాల్గుదిక్కులకు పంపించడం- తాము దక్షిణ దిశకు రావడం, అన్వేషణలో అలసి ఈ బిలంలో ప్రవేశించడం పూసగుచ్చినట్లు వివరించాడు. చక్కని ఆతిథ్యంతో ఆదరించిన కన్నతల్లి వంటి మీకు ప్రత్యుపకారంగా మేము చేయదగినది ఏదైనా ఉంటే సెలవియ్యమని కోరాడు. ధర్మచారిణి అయిన స్వయంప్రభ తాను తన ధర్మం నిర్వర్తించాననీ దానికి బదులుగా తనకేమీ చేయనవసరం లేదనీ చెప్తుంది.

## వకుళమాత

**ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు మాతృమూర్తి యశోదా దేవి వద్ద బాల్యం నుండి ఎంతో గారాబంగా పెరిగాడు. చిన్న నాటి నుండి ఎందరో రాక్షసులను సంహరించి, తన మహిమలను చూపాడు. కొంతకాలానికి కంసుని వధానంతరం, ఆ కృష్ణుడు తల్లిదండ్రులైన దేవకీవసుదేవులతో చేరాడు. అక్కడే ఆయనకు వివాహాది కార్యక్రమాలన్నీ జరిగాయి. చిన్నప్పటినుంచి పెంచి పెద్దచేసిన తాను శ్రీకృష్ణునికి వివాహాన్ని స్వయంగా చేసి, సంతోషించే భాగ్యానికి నోచుకోలేదని చింతిస్తున్న యశోదమాత మనస్సును తెలుసుకొన్న శ్రీకృష్ణుడు "అమ్మా! నీవు ఏమాత్రం చింతించవలసిన పని లేదు. ఇప్పుడు పెంచి పెద్ద చేసిన చేతులతోనే స్వయంగా నీవే నాకు వివాహాన్ని చేసి సంతోషించే భాగ్యాన్ని కలిగిస్తాను. అది ఈ ద్వాపరయుగంలో కాదు. తర్వాత వచ్చే కలియుగంలో వేంకటాచలశిఖరాలమీద నీవు యోగినివై ఉన్న సమయంలో 'శ్రీనివాసుడను' పేరుతో నీ దగ్గరికి చేరతాను. ఆ సమయంలో నీ చేతుల మీదుగానే నా వివాహం జరిపించి ఆనందించి నన్ను సేవించే భాగ్యాన్ని పొందగలవని" తల్లిని ఊరడించి వరమిస్తాడు శ్రీనివాసుడు. ఇదిగో ఆ ద్వాపరయుగం నాటి వరప్రభావంచేత ఆ యశోదాదేవి వకుళాదేవిగా నేడు అవతరించింది.**

**అప్పటి శ్రీకృష్ణుడే నేడు శ్రీనివాసునిగా అవతరించి, వేంకటాచలానికి చేరి వరాహస్వామి అండదండలతో అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకొన్నాడు. అప్పటినుండి వకుళమాత శ్రీనివాసుని ఆలనా పాలనా చూస్తూ అన్నపానాదులు, ఆకలిదప్పులను తీరుస్తూ తృప్తిగా కాలక్షేపం చేస్తూ ఉండింది.**

ప్రస్తుతం హనుమదాదులు బిలంలో చిక్కుకుని ఉన్నారు. సీతాన్వేషణ ఇంకా పూర్తికాలేదు. ఈ బిలం నుండి బయటపడే మార్గమూ వారికి తెలియదు. ఈ విషయం స్వయంప్రభకు తెలుసు.

స్వయంప్రభ హనుమ వైపు మెచ్చుకోలుగా అనింది 'ఈ బిలంలో ప్రవేశించినవాళ్ళు ప్రాణాలతో బయటపడడం జరగదు. కానీ మీరందరూ గట్టిగా కళ్ళు మూసుకుంటే మిమ్మల్ని బయటికి చేరుస్తాను. అది నా తపశ్శక్తి వల్ల నియమ నిష్ఠల వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.'

వానరులంతా తను సన్నని వేళ్ళతో కళ్ళు గట్టిగా మూసుకున్నారు. స్వయంప్రభ క్షణంలో అందరినీ బిలం నుండి బయటకు తీసుకు వచ్చింది. 'ఇవిగో పర్వతాలు- అదిగో- మహాసముద్రం. క్షేమంగా వెళ్ళండి. 'స్వస్తి' అంటూ స్వయంప్రభ శ్రీమంతమైన తన గుహలోకి వెళ్ళిపోయింది.

మహాకావ్యమైన రామాయణం కిష్కింధకాండ చివరలో వచ్చిన ఈ చిన్ని ఘట్టం, పెద్ద ప్రయోజన్నాని కూర్చి పెట్టింది. సీతాన్వేషణలో వానరులు ఎదుర్కొన్న కష్ట బాహుళ్యాల్ని వివరించే ఘట్టమిది. రసపరంగా పరిశీలిస్తే అద్భుత రసాన్వితమైన ఘట్టం.

ఇక రచనా పరంగా చూస్తే స్వయంప్రభను గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా వాల్మీకి మహర్షి ఆమెను 'ధర్మ చారిణి!' అని సంబోధించి సంభావిస్తాడు. కొంతకాలానికి హనుమ సీతాదర్శనం చేసి, శ్రీరాముని సందేశాన్ని క్షేమాన్ని ఆమెకు తెలియజేస్తాడు.


కేవలం ధర్మాన్ని ఆచరించి ధర్మచారిణి కావడమే కాదు, ఆ తపస్విని సర్వభూతాలకు హితము చేయాలనే కోరిక గల మహోన్నతురాలు.

ధర్మచారిణీ! సర్వభూతహితేరతా! అనే అన్వర్థమైన విశేషణాలతో విరాజిల్లే స్వయంప్రభ- రామాయణం అందించే ధర్మాల్లో 'సర్వభూతహితైషులు' కావాలన్న విషయానికి ప్రబల ఉదాహరణగా నిలిచింది. స్వయంప్రభ చరిత్ర సర్వకాలాల్లో ప్రశంసనీయమైనట్టిది.

ఇంతటి వెలుగు అందించే స్త్రీ పాత్ర గల రామాయణం మానవ జీవితానికి కరదీపిక అగుగాక!

బాలవాక్కు

# అత్యాశ




ఒక ఊళ్ళో ఒక బిచ్చగాడు ఉండేవాడు. వాడు ఒకరోజు బిచ్చమెత్తడానికి బయలుదేరాడు. రాజవీథిలో నుంచి వెళ్తూ ఇలా అనుకున్నాడు. 'ఓహో! ఈ మేడ ఒకప్పుడు ధనపాలుడిది. పాపం పేరాశకి పోయి విదేశాలకి వెళ్లి, వ్యాపారంలో నష్టపోయి ఈ మేడని కోల్పోయాడు'.

'ఈ భవంతి రత్నాలవ్యాపారి సుబ్బిశెట్టిది. ఇతను వ్యాపారంలో దివాలా తీశాడనీ చెప్పుకుంటున్నారు. అయినా వీళ్లకి ఇంత ఆశ ఎందుకో, ఉన్నదానితో తృప్తిపడవచ్చు కదా. తనని గనుక అదృష్ట దేవత కనికరిస్తే, వీళ్లలాగా ఉండను' అని అను కున్నాడు.

ఇంతలో కనులు మిరుమిట్లు గొలుపుతూ అదృష్టదేవత ప్రత్యక్షమైంది. 'నీ జోలె పడితే... దానిని బంగారు నాణాలతో నింపుతా. కానీ సంచి నిండుగా ఇస్తానని, ఒక్క నాణెం క్రింద పడ్డా మొత్తం నాణేలూ మాయమవుతాయనీ' హెచ్చ రించింది.

బిచ్చగాడు జోలె పట్టాడు. ఆమె నింపు తున్నది, సంచి నిండుతున్నది, ఆమె హెచ్చరిం చింది. అందుకు ఆ బిచ్చగాడు 'నీకెందుకు? నీవు నింపవమ్మా! క్రింద పడకుండా నేను చూసు కుంటానులే' అన్నాడు.

మెరిసిపోయే బంగారు నాణాలు జోలెలో పడ సాగాయి. అతను జోలెని కుదించాడు. కొన్ని నాణాలు క్రింద పడ్డాయి. నాణాలతో పాటు, అదృష్టదేవతా కూడా మాయమయ్యింది.

వెనువెంటనే దేవత హెచ్చరించినట్లు అంతా జరిగింది. మనం ముందుగానే మనకు కావలసిన దానితో తృప్తి చెందినట్లయితే దైవానుగ్రహం కూడా లభిస్తుంది. కాబట్టి **'అత్యాశ'** ఎన్నటికీ పనికిరాదు.




మాస్టర్ జె.వి.ఎస్.ఇంద్రనీల్,
6వ తరగతి,
భారతీయవిద్యాభవన్ శ్రీవేంకటేశ్వరవిద్యాలయ,
తిరుపతి.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-01

రచన- మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య　　నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

## పాఠకులకు కొన్ని సూచనలు

01) ప్రతిపాఠములోని పదాలను కంఠస్థము చేయాలి.

02) చదివిన పాఠములను నిత్యము ఐదు (లేక) ఆరుసార్లు చింతన చేయాలి.

03) ప్రతిపాఠము క్రింద అభ్యాసార్థము సంస్కృతములో వ్రాయబడిన వాక్యాలను తెలుగులోకి, తెలుగులో ఉన్న వాటిని సంస్కృతములోకి సరిగా మార్చి చెప్పాలి.

04) మార్చునపుడు ఆయా పాఠంలోని పదాలను చూడరాదు.

05) మీ ఇంటిలోని వారితోను/తోటివారితోను సిగ్గుపడక వచ్చినంతవరకు సంస్కృతంలో మాట్లాడాలి. వారిని కూడా మాట్లాడమని ప్రోత్సహించాలి.

06) అభ్యాసములో ఇచ్చిన వాక్యముల వంటి వాటిని అనేకములు కల్పించుకొని ప్రయత్నించాలి.

07) చిన్న చిన్న కథలను చిన్న చిన్న సంస్కృత వాక్యములో చెప్పుచు వ్రాయుచు ఉండాలి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| सः | = | వాడు | कुत्र | = | ఎక్కడ? | अस्ति | = | ఉన్నాడు |
| त्वं | = | నీవు | तत्र | = | అక్కడ | असि | = | ఉన్నావు |
| अहं | = | నేను | अत्र | = | ఇక్కడ | अस्मि | = | ఉన్నాను |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) सः अस्ति
02) अहं तत्र अस्मि
03) त्वं कुत्र असि?
04) सः तत्र अस्ति
05) अहं अत्र अस्मि
06) त्वं तत्र असि
07) सः कुत्र अस्ति?
08) सः तत्र अस्ति
09) त्वं तत्र असि
10) अहं कुत्र अस्मि?

అ) జవాబులు

01) వాడు ఉన్నాడు　02) నేను అక్కడ ఉన్నాను
03) నీవు ఎక్కడ ఉన్నావు?　04) వాడు అక్కడ ఉన్నాడు
05) నేను ఇక్కడ ఉన్నాను　06) నీవు అక్కడ ఉన్నావు
07) వాడు ఎక్కడ ఉన్నాడు?　08) వాడు అక్కడ ఉన్నాడు
09) నీవు అక్కడ ఉన్నావు　10) నేను ఎక్కడ ఉన్నాను?

### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నీవు ఎక్కడ ఉన్నావు?
02) నేను ఇక్కడ ఉన్నాను
03) వాడు అక్కడ ఉన్నాడు
04) నీవు ఇక్కడ ఉన్నావు
05) నేను ఎక్కడ ఉన్నాను?
06) నీవు ఉన్నావు
07) నేను ఉన్నాను
08) వాడు ఉన్నాడు
09) నేను అక్కడ ఉన్నాను
10) నీవు అక్కడ ఉన్నావు

ఆ) జవాబులు

01) त्वं कुत्र असि?　02) अहं अत्र अस्मि
03) सः तत्र अस्ति　04) त्वं अत्र असि
05) अहं कुत्र अस्मि?　06) त्वं असि
07) अहं अस्मि　08) सः अस्ति
09) अहं तत्र अस्मि　10) त्वं तत्र असि

# ఆయుర్వేదం

## వ్యాధులను నిర్మూలించే....
# 'చిత్రమూలం'

– డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

సర్వసాధారణంగా సుమారు ఒక మీటరు వరకు పెరిగే ఔషధగుణాల పెన్నిధి బహువార్షిక మొక్క చిత్ర మూలంలో వివిధ వ్యాధులను నిర్మూలించే అపారగుణాలు ఉన్నాయి.

'బలమారోగ్య మాయుశ్చ ప్రాణశ్చాగ్నౌ ప్రతిష్ఠితః' అంటుంది ప్రామాణిక ఆయుర్వేద వైద్య గ్రంథం 'చరక సంహిత'. బలం, ఆరోగ్యం, ఆయుష్షు, ప్రాణం యిలాంటి అతి ముఖ్యమైన వన్ని అగ్ని వల్లనే ప్రతిష్ఠింపబడుతాయని స్థూలంగా దీని అర్థం. అగ్ని మందగిస్తే ఇవన్నీ మందగించి పోతాయి. అటువంటి అగ్నిని కాపాడేందుకు, జీర్ణక్రియకు సహకరించేదుకు శరీరాన్ని వజ్రతుల్యంలా చేసేందుకు సహ కరించే శక్తి ఉన్నందున దీనికి అనల, వహ్ని సంజ్ఞక అను సంస్కృత నామాలు కూడా ఉన్నాయి.

ఆంగ్లంలో 'సిలోన్ లెడ్‌వార్ట్' గాను, హిందీలో 'చీత' గాను పిలువబడే ప్లంబాజినెసి అను వృక్ష కుటుంబానికి చెందిన ఈ మొక్క శాస్త్రీయ నామం ప్లంబాగో జైలానిక.

ఎండించిన చిత్రమూలం వేర్లు సంవత్సరమంతా పచారి కొట్లలోను, మూలి కలు అమ్మే దుకాణాలలోను లభ్యమవు తాయి.

ప్రకృతి ప్రసాదించిన చిత్రమూలం ద్వారా మన దైనందిన జీవితంలో ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్య లను ఎలా పరిష్కరించుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

**అధిక బరువు తగ్గేందుకు–** చిత్రమూలం చూర్ణం, జీలకర్రను వేయించి చేసిన చూర్ణం, ఇంగువ ముక్కలను కొద్దిగా నెయ్యి వేసి వేయించి చేసిన చూర్ణం ఒక్కొక్కటి 10 గ్రాములు, త్రిఫల చూర్ణం (కరక, తాని, ఉసిరి కాయలను కలిపి చేసిన చూర్ణం) 30 గ్రాములు, త్రికటు చూర్ణం (శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు కలిపి చేసిన చూర్ణం) 30 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు ఉదయం, రాత్రి ఆహారానికి అరగంట ముందు పూటకు ఒక గ్రాము పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తూ నియమబద్ధ ఆహార నియమాలు పాటిస్తూ వుంటే త్వరగా ఈ సమస్య తగ్గుతుంది. అంతేకాకుండ ఉదర భాగంలో సంచితమైన అధిక క్రొవ్వు కరిగి బొజ్జ సమస్య తగ్గుతుంది.

**ఆకలి బాగా అయ్యేందుకు–** రోజు ఒకసారి 100 మి.లీ. తాజా మజ్జిగలో ఒక గ్రాము చిత్రమూలం పొడి కలిపి



సేవిస్తు ఉంటే జీర్ణరసాలు, జఠర రసాల ఉత్పత్తి బాగా జరిగి మంచి ఆకలి కలిగి జీర్ణశక్తి కూడా మెరుగవుతుంది.

**బొల్లి వ్యాధి తగ్గేందుకు–** చిత్రమూలం పొడి, కరక్కాయల పొడి సమానంగా కలిపి నిల్వ ఉంచుకొని, రోజూ ఒకసారి తగినంత పొడిలో తగినంత నిమ్మరసం కలిపి పేస్టులా చేసి బొల్లి మచ్చలపైన లేపనం చేస్తుంటే చర్మానికి రంగునిచ్చే మెలానిన్ అనే రజక పదార్థం తయారై ఆ సమస్య తగ్గుతుంది.

**పిప్పి పన్ను సమస్య తగ్గేందుకు–** కాస్త చిత్రమూలం పొడిని తగినంత నీటిలో కలిపి పేస్టులా చేసి, పిప్పి పన్ను భాగంలో వుంచితే తక్షణమే మంట, పోటు, నొప్పి, బాధ, సలుపు తగ్గుతాయి.

**శరీర వాపులకు–** చిత్రమూలం, పల్లేరు, గలిజేరు, తిప్పతీగ చూర్ణాలను ఒక్కొక్కటి 50 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని, 200 మి.లీ. నీటిలో 5 గ్రాముల పొడిని వేసి, 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి ఉదయం, సాయంత్రం పూటకి 50 మి.లీ. చొప్పున ఒక టీ స్పూను తేనె గాని లేదా అలాగే సేవిస్తు ఉంటే చక్కటి పరిష్కారం దొరుకుతుంది.

**మూర్ఛ వ్యాధికి–** చిత్రమూలం, వచ, సరస్వతి ఆకు చూర్ణాలను ఒక్కొక్కటి 30 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని, రోజూ మూడు పూటలా ఆహారానికి 15 నిమిషాల ముందు పూటకు ఒక గ్రాము చొప్పున తగినంత తేనెతో సేవిస్తు వుంటే, వ్యాధి తీవ్రత క్రమంగా తగ్గి ఆ సమస్య నుండి బయటపడవచ్చు.

**గొంతు బొంగురు సమస్యకు–** చిత్రమూలం, వామును వేయించి చేసిన చూర్ణం, పసుపు, యవక్షారం, ఉసిరి పెచ్చుల చూర్ణం సమానంగా కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు 2–3 గ్రాముల ఔషధంలో ఒక టీ స్పూను తేనె, అర టీస్పూను నెయ్యి కలిపి సేవిస్తుంటే సుగుణం కనిపిస్తుంది.

**పులిత్రేన్పులకు–** చిత్రమూలం, శొంఠి పొడి ఒక్కొక్కటి 20 గ్రాములు, వామును వేయించి చేసిన చూర్ణం, మిరియాల పొడి, సైంధవ లవణం పొడి ఒక్కొక్కటి 5 గ్రాములు కలిపి ఉంచుకొని, రోజూ 2 సార్లు 100 మి.లీ. గోరువెచ్చని నీటిలో అర టీ స్పూను బెల్లం వేసి కరిగించి ఒక గ్రాము పొడిని వేసి కలిపి సేవిస్తు ఉంటే శీఘ్రంగా సత్వర పరిష్కారం దొరుకుతుంది.

**గమనిక–** పైన పేర్కొన్న ఔషధ దినుసులన్ని సంవత్సరమంతా మూలిక ఔషధ విక్రయశాలల్లో లభ్యమవుతాయి.

చిత్రకాదివటి, చిత్రకహరీతకి, చిత్రకాదితైలం మొదలగు ఆయుర్వేద ఔషధాల తయారీలోను, తమిళనాట ప్రసిద్ధి పొందిన సిద్ధ వైద్య ఔషధలైన వాతసూరక కుడినీర్, గంధకరసాయనం, కారుణయ్ లేహ్య, మహావల్లాతి, కారుప్పు విష్ణుచక్రం, ఏరసకెంతిమెజుగు, మహావీరమెజుగు మొదలైన ఔషధాల తయారీలో ఈ చిత్రమూలాన్ని ఒక అనుఘటకంగా ఉపయోగిస్తారు.

## ఆకాశరాజు

**మాధవుడనే బ్రాహ్మణుడు పాపవిముక్తికై వేంకటాద్రికి వచ్చి భగవంతుని కోసం తీవ్రమైన తపస్సు చేశాడు. చివరకు ప్రాణత్యాగానికి కూడా తలపడ్డాడు. అప్పుడు దేవుడు ప్రత్యక్షమై 'నువ్వు తర్వాత జన్మలో సుధర్ము డనే రాజుకు పుత్రునిగా జన్మించి ఆకాశరాజు అనే పేరుతో ప్రసిద్ధి పొందుతావు. అప్పుడు సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి అయిన పద్మావతీదేవి నీకు పుత్రికగా లభిస్తుంది. ఆ కన్యతోనే నాకు ఇచ్చి వివాహం చేస్తావు' అని వరమిస్తాడు. ఆకాశరాజు, ధరణీదేవిలకు యజ్ఞభూమి దున్నుతుండగా ఒక బంగారు పెట్టె దొరికింది. ఆ పెట్టెలో వింత తేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక పసిపాప పద్మంలో ఉంది. రాజదంపతులు ఎంతో సంతోషించి ఆ పాప పద్మంలో దొరికినందున పద్మావతి అని నామకరణం చేశారు. కాలక్రమంలో ఆమెనే వకుళమాత స్వయంగా శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం జరిపించింది.**



సంపదలు కలిగినప్పుడు 'సజ్జనులు' గర్వాన్ని పొందరు

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** శారీరిక బాధల దుష్ఫలితములు తొలగుటకు దుర్గా దేవి ఆరాధన చేయాలి. శుక్రుని పంచమరాశి సంచార ఫలము ఆదాయము పెరుగుట, ధనధాన్య లాభములను సూచించుచున్నది.



**వృషభం–** సంతానం పరీక్షలలో ఉత్తీర్ణులవుతారు. భూగృహ స్థిరాస్తుల విషయంలో లాభపడతారు. శరీర ఆరోగ్యము బాగుంటుంది. యత్నకార్యసిద్ధి. సుఖ సౌఖ్యమైన జీవితాన్ని అనుభవిస్తారు.



**మిథునం–** ధనాదాయానికి లోటు ఉండదు. వృత్తి వ్యాపారాలు కలసివస్తాయి. ఆరోగ్యము బాగుంటుంది. అపమృత్యు దోషపరిహారార్థం మృత్యుంజయ జపం చేయుట మంచిది.



**కర్కాటకం–** ఆరోగ్య విషయములకై శ్రద్ధ వహించుట అవసరము. అన్ని విషయముల లోనూ ముందంజ. సంతానము అభివృద్ధిలోనికి వచ్చుట, పూర్వపు మిత్రులను కలియుట జరుగును.



**సింహం–** వృత్తి ఉద్యోగములలో వృద్ధి, ఆరోగ్య జీవనములు, వాహనములు చెడిపోవుట వలన అధికధనవ్యయము. సంతాన విషయమై కలసి వచ్చుట. వారి అభివృద్ధిని వీక్షించుట, సమాజములో గౌరవము పొందడం జరుగుతుంది.



**కన్య–** వృత్తి వ్యాపారాలలో మిశ్రమ వాతావరణం కనపడుతుంది. గృహమున సౌభాగ్యకరమగు స్థితి నెలకొని ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. మాసాంతంలో యత్నకార్యసిద్ధి. అధికారుల అండదండలు కల్గుతాయి.



**తుల–** వృత్తి వ్యాపారాలు అనుకూలం. ధనధాన్య వస్త్రలాభములు, మంచి పనులు చేయుట వలన సమాజంలో కీర్తి, గుర్తింపు. ఉన్నత ఉద్యోగములకు ఎంపిక అవుతారు.



**వృశ్చికం–**ఇతరులపై పట్టు సాధించి వ్యాపారాలలో మీ స్థానం నిలబెట్టుకుంటారు. శత్రుజయం కల్గుతుంది. వృత్తివ్యాపార ఉద్యోగాలు ఆశించిన ఫలితాన్నిస్తాయి.



**ధనుస్సు–** వృత్తి వ్యాపారాలలో అవసరార్థం ఇతరదేశాలకు వెళ్లవలసి వస్తుంది. కార్యజయము కల్గుతుంది. వస్తు వస్త్రాభరణములను పొందుటకు ధనవ్యయం చేస్తారు.



**మకరం –** విద్యార్థులకు అభివృద్ధి. శరీర ఆరోగ్యము బాగుండును. వృత్తి ఉద్యోగాలలో ముందంజ. చిరకాలముగా నిలచియున్న ఉద్యోగులకు పదోన్నతులు కలసివచ్చుట, భాగ్యవృద్ధి, వస్త్ర లాభములు కల్గును.



**కుంభం–** ఈ మాసము వృత్తి విషయాలు మిశ్రమంగా ఉంటాయి. కుటుంబ అవసరాలకై పూర్వపు ఆస్తిని కొంత అమ్మవలసి వస్తుంది. సాత్విక ఆహారం తీసుకొనుట వలన ఆగ్రహావేశాలు తగ్గి బాగుంటారు.



**మీనం–** అధికారవృద్ధి, సౌభాగ్యము, సంతాన విషయమై ఆనందం కలుగుట, వారి ప్రతిభను చూచి మురిసిపోవుట, సంతోషము, ఆర్థికవిస్తృతి కలుగును. నూతనోత్సాహములు. శుభకార్యములు కలసి వచ్చుట జరుగును.



హరిదాస వాఙ్మయంలో... 7

# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

జ్ఞానిగళిగేగోచరనే అజ్ఞానిగళిగగోచరనే ।
ధ్యానిపరల్లి నిల్లువనే బలు। దైన్యాదిగళుద్ధారనే ।
ఆనందమయనే అనంతావతారనే। అనుదిననె నెవరహృదయ మందిరనే।
తనువినక్లేశ దురితసంహారనే। ఘనమణి భూషణ శృంగారనే ॥

('జ్ఞానినాం జ్ఞానసాధనం' 'దైత్యానాం మోహ నార్థాయ' 'సురాణాం ముక్తి సిద్ధయే' - ఈ మొదలైన పురాణ వాక్యానుసారం హే శ్రీనివాస! నీవు జ్ఞానులకు గోచరుడవు (జ్ఞానీమత్ప్రియో తమః) అజ్ఞానులకు అగోచరుడవు. 'ధ్యానే నాత్మని పశ్యంతి' ధ్యానించే వారి హృదయ మంటపమున ప్రకాశిస్తావు. దీనులను ఉద్ధరిస్తావు. ఆనందమయుడవు, అనంతావతారుడవు. సదా తలచేవారి హృదయముననే ఉండేవాడివై, శరీరమందలి తాపములను, పాపములను పారద్రోలే (చింతామణివి) ప్రకాశించే మణివి శృంగారపురుషుడివయ్యా.

"జయతు దోషవినాశ । జయ జయతు మహిమా విశేష ।
జయతు లకుమి పరితోష । జయతు శ్రీవేంకటేశ ।
జయ కమలజ జనకనె జయజగదీశ ।
జయ గజవరద పాలిప పుణ్యనామ ।
జయతు జనార్దన మోహన వేష జయరంగ విఠల కరుణావిలాస॥

హే రంగవిఠల శ్రీనివాస! నీకు జయము. నీవు దోషదూరడవు. వినాశకుడవు. మహిమావిశేషుడవు. లక్ష్మీ పరితోషితగాత్రుడవు. కమలజుని తండ్రివి. జగదీశుడవు. గజరాజరక్షకుడవు. పుణ్యశ్లోకుడవు. జనార్దనుడవు. మోహనసౌందర్యుడవు. కరుణావిలాసుడవు. భక్తిరస ప్రబోధితము అయిన ఈ కీర్తన మోహన రాగమున పాడడం వలన మరింత ఆనంద రసానుభూతి కలుగును.

శ్రీహరి మూలరూపమునకు అవతార రూపములకు భేదము లేదనే సిద్ధాంతానుసారము శ్రీపాదరాజులవారు శ్రీవేంకటేశ్వరుని- నరసింహుని, శ్రీరాముని, శ్రీకృష్ణునిగా భజించినారు. ఈ మూడు మూర్తులు క్రమంగా కృత, త్రేతా, ద్వాపరయుగమున అర్చావతారములైనవి కూడ. 'కృతేతు నారసింహోభూత్। త్రేతాయాం రఘునందనః । ద్వాపరేవాసు దేవశ్చ। కలౌ వేంకటనాయకః॥' అను పురాణవచనానుసారం శ్రీపాదరాయలవారు రఘటిలమైన పదబందములచే దీర్ఘచరణములచే శ్రీనివాసునిలో మూడు రూపములను ఉపాసన చేసినారు.

"సాగి బారయ్యనీను। బాగినమిసువే।
యోగిగళరసనే శ్రీనివాస। భోగిశయననే నిన్న భాగవతరు బందు
జాగు మాడదె నిన్న బాగిలొళు నింతి హరో

## శ్రీవ్యాసరాయలవారిచే రచింపబడిన శ్రీనివాసస్తుతి

"ఈశమునిగళిద్దేను మాడిదరు వ్యాసముని మధ్వమతవ నుద్ధరిసిద"

'ఇంతమంది జ్ఞానులుండినను వ్యాసముని మధ్వమతమునుద్ధరించినారని, పురందరదాసులవారు వ్యాసరాయల వారిని స్తుతించినారు. మధ్వాచార్యుల పీఠమునలంకరించిన యతులలో సుప్రసిద్ధులైన వీరు బ్రహ్మణ్యతీర్థకమల సంజాతులై "సిరిక్రిష్ణ" అను అంకితముతో, కన్నడములో అసంఖ్యాక కీర్తనములను భక్తివైరాగ్య ప్రబోధితములైనవిగా వ్రాసినారు. వీరి కీర్తనలు సంగీత లక్షణబద్ధముగాను, భజన సంప్రదాయానుసారముగాను పాడుటకు వీలైనది. పురందర కనకదాసులకు గురు స్థానమును వహించినారు. 'తర్కతాండము', 'న్యాయామృతము' 'చంద్రిక' గ్రంథములను రచించి చంద్రికాచార్యులుగా ప్రసిద్ధి

కెక్కినారు. 'కృష్ణానీ బేగనేబారో' 'జనుమజనుమదలి కొడుకండ్యహరియె' 'అంతరంగదలి హరియకాణదవ హుట్టుకురుడనో' 'నమపార్వతీ పతినుతజనపాల' ఈ మొదలైన కృతులు ఎంతో ప్రసిద్ధి చెందినది. గురువుల ఆదేశానుసారం శ్రీనివాసుని సేవించిన మహా మహితాత్ములు వ్యాసరాయలవారు శ్రీనివాసుని మూడు శ్లోకముల చేత స్తుతించినారు.

"ప్రాతః స్మరామి రమయా సహ వేంకటేశం ।
మందస్మితం ముఖ సరోరుహా కాంతిరమ్యం ।
మాణిక్యకాంతి విలసన్ముకుటోర్ధ్వపుండ్రం ।
పద్మాక్షలక్షమణికుండల మండితాంగం ॥

ప్రాతర్భజామి కరరమ్యసుశంఖచక్రం ।
భక్తాభయప్రద కటిస్థలదత్తపాణిం ।
శ్రీవత్స కౌస్తుభలసన్మణికాంచనాఢ్యం ।
పీతాంబరం మదనకోటి సుమోహనాంగం ॥

ప్రాతర్నమామి పరమాత్మ పదారవిందం ।
ఆనంద సాంద్ర నిలయం మణినూపురాఢ్యం।
ఏతత్సమస్త జగతామితిదర్శయంతం ।
వైకుంఠమత్ర భజతాం కరపల్లవేన ॥

### వైకుంఠపాళి
### :: 58- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 వ | సు | 2 దే | వు | 3 డు | | |
| 4 మ | | ర్ష | | వ | | ల్లు | | 5 ల |
| 6 హ | రి | | 7 న | లు | డు | | 8 పా | పి |
| తి | | 9 సు | | డు | | 10 వూ | | త |
| | 11 ప్ర | మ | తి | | 12 పూ | రు | డు | |
| 13 చా | | తి | | 14 జ | | డు | | 15 సు |
| 16 రు | క్మి | | 17 సు | ర | భి | | 18 ఆ | శ |
| వు | | 19 స్వా | | | | 20 కా | | ర్మ |
| | | 21 హ | య | హ | య | డు | | |

వ్యాసరాజయతి ప్రోక్తం శ్లోకత్రయ మిదం శుభం ।
ప్రాతః కాలే పఠేద్యస్తు పాపేభ్యోముచ్యతే నరః ॥

శ్రీ వ్యాసరాయలవారి బృందావనము ఆనేగుందిలో ఉన్నది.

## శ్రీవాదిరాజస్వాములవారిచే స్తుతింపబడిన శ్రీవేంకటేశ్వరుడు

ఉడిపి అష్టమఠములలో ఒకటైన సోదే మఠపు పరంపరలో వచ్చిన సుప్రసిద్ధ యతిశ్రేష్ఠులును, హయగ్రీవో పాసకులును, వాగీశ తీర్థకరకమల సంజాతులును, 'తీర్థప్రబంధము', 'రుక్మిణీశ విజయము', 'యుక్తి మల్లిక' గ్రంథకర్తలును, కన్నడములో 'లక్ష్మీశోభనమ'నే దివ్య స్తోత్రమును రచించిన వారును, మరియు అనేక స్తోత్రము లను రచించిన వారును, హయవదన అంకితముతో పదములను రచించిన వారును, తమ 120 సంవత్సరముల జీవితములో అనేక పర్యాయములు శ్రీకృష్ణుని ఉడిపిలో ఉండి సేవించిన వారును, ఉడిపి పర్యాయమును రెండు సంవత్సరములకు పెంచినవారును, మహిమాన్వితులును, శ్రవణ స్మరణ మాత్రముచే సకలారిష్ట పరిహారకులును, సకలేష్ట ప్రదాతలును అయి నేటికి సోందాక్షేత్రమునందు పంచవృందావన మధ్యమున విరాజమానులైన శ్రీవాదిరాజ గురుసార్వభౌములు విశ్వమునకు ప్రాతఃస్మరణీయులు. ఈ మహనీయులు తమ జీవితములో అనేక పర్యాయములు తిరుమలకు వచ్చి శ్రీనివాసుని దర్శించి, ఆ స్వామికి సాలగ్రామములతో కూర్చిన మాలను (దండను) సమర్పించి నారని ఐతిహ్యము. అంతేకాక వీరు తమ తీర్థ ప్రబంధమున తిరుపతి క్షేత్రమును, క్షేత్రాధిపతి వేంకటేశ్వరుని విస్తారముగా తాత్త్విక ప్రధానముగా రచించి కీర్తించినారు.

శ్రీవేంకటలసచ్ఛైలవాసీదాసీకృతామరాః ।
ఛాయయాపాతుమాంనిత్యం శ్రీనివాసః సురద్రుమః ॥

ప్రకాశవంతమైన శ్రీవేంకట పర్వతమునందున్న శ్రీనివాసుడనే కల్పవృక్షపు ఛాయ (నీడ) ఎల్లప్పుడు నన్ను కాపాడాలని సకలదేవతలు కూడ శ్రీనివాసునికి దాసులై యున్నారు. *(ఇంకా ఉంది)*

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి
(సచిత్ర మాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2.** కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# 58 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ■ | ■ | 1 | | 2 | | 3 | ■ | ■ |
| 4 | ■ | | ■ | | ■ | | ■ | 5 |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| ■ | 11 | | | ■ | 12 | | | ■ |
| 13 | ■ | | ■ | 14 | ■ | | ■ | 15 |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | |
| | ■ | 19 | ■ | | ■ | 20 | ■ | |
| | ■ | 21 | | | | | ■ | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

1)శ్రీకృష్ణుని కన్నతండ్రి(5); 6)విష్ణుమూర్తికి మరొకపేరు(2); 7)దమయంతి భర్త(3); 8)పాపాలు చేయువాడు(2); 11)చ్యవన మహర్షికి సుకన్యకు కల్గిన కుమారుడు(3); 12)జహ్నుమహర్షి కుమారుడు(3); 16)రుక్మిణీదేవి సోదరుడు(2); 17)దేవతల గోవు(3); 18)కోరికకు గల మరియొక పేరు(2); 21)గుఱ్ఱం రూపంలో ఉన్న లక్ష్మీనారాయణులకు పుట్టిన కుమారుడు(5)

### నిలువు

1)మరీచిమహర్షి భార్య(2); 2)అక్రూరుని కుమారుడు(4); 3)'పడుట-రాలుట-దొర్లుట'-అను అర్థాలు నిచ్చుపదము(2); 4)నారదుని వీణపేరు(3); 5)మందపాలుని భార్య(3); 9)దశార్ణ దేశపురాజగు వజ్రబాహుని పెద్ద భార్య(3); 10)యయాతికి శర్మిష్ఠకు కల్గిన కుమారుడు(3); 13)శ్రీకృష్ణునికి రుక్మిణియందు పుట్టిన కుమారుడు(3); 14)ఈమె వల్ల కలుపబడుటచే జరాసంధుడు జీవించెను.(4); 15)కర్ణుని పుత్రుడు(3); 19)దక్షునికుమార్తె. అగ్నిభార్య(2); 20)శ్మశానము(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు


Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

## తిరుమల శ్రీవారి ఆలయంలోపల సాలకట్ల బ్రహ్మోత్సవాలలో స్వామివారికి జరిగిన వివిధ వాహనసేవల దృశ్యమాలిక













SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams printing on 25-09-2020.
Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

17-10-2020
శనివారం
రాత్రి:
హంసవాహనం

